జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | బుధవారం 10 జూన్ 2026 | సంపుటి: 19 | సంచిక: 94 | పేజీలు: 12 | వెల: రూ.3 | RNI No : TELTEL/2008/24799

పరాభవ నామ సంవత్సరం , జ్యేష్ఠ మాసము , తిథి: దశమి - 25:00:48 వరకు నక్షత్రంఉత్తరాభాద్ర - 09:22:30 వరకు కరణంవణిజ - 13:55:11 వరకు, విష్టి - 25:00:48 వరకు పక్షంకృష్ణ యోగంఆయుష్మాన్ - 06:29:28 వరకు, సౌభాగ్య - 28:02:32 వరకు వారం

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

## ఈ ఏడాదే పాలేరుకు గోదావరి జలాలు

**రాష్ట్రంలో కోటీ యాభై లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి**
**వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

ఖమ్మం,జూన్9(ప్రజాజ్యోతి): ఈ ఏడాదిలోనే పాలేరుకు గోదావరి జలాలు వస్తాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వివరించారు. రైతులను బాధపెట్టే వారే రేవంత్‌రెడ్డిని విమర్శిస్తున్నారని అన్నారు. తెలంగాణలో కోటీ యాభై లక్షల టన్నుల ధాన్యం పండించారని వ్యాఖ్యానించారు. ఇప్పటివరకు 75 లక్షల టన్నుల మెట్రిక్ ధాన్యం కొనుగోలు

మిగతా1 2లో..

## ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలం

మీడియా సమావేశంలో బీజేపీ అధ్యక్షుడు

భువనగిరి,జూన్ 9(ప్రజాజ్యోతి): తెలంగాణలో ధాన్యం కొనుగోలు వ్యవహారంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు.. కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. భువనగిరి మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన.. ధాన్యం దిగుబడుల అంచనాలను రూపొందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, కేంద్రానికి సరైన ఇండెంట్ పంపలేకపోయిందని ఆరోపించారు. ధాన్యం కొనుగోలు

మిగతా 2లో..

# నెత్తురోడిన పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్

అవామీ యాక్షన్ కమిటీపై నిరసనలు

**అల్లర్లలో 30 మందికిపైగా మృతి!**




కశ్మీర్, జూన్9(ప్రజాజ్యోతి): పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ మరోసారి నెత్తురోడింది. స్థానిక అవామీ యాక్షన్ కమిటీ-కమిటీపై నిషేధానికి వ్యతిరేకంగా నిరసనలు చేస్తున్న పౌరులపై పాక్ సైన్యం మంగళవారం కాల్పులు జరిపింది. దీనితో అల్లర్లు చెలరేగాయి. ఈ అల్లర్లలో పలువురు భద్రతాసిబ్బంది సహా మొత్తం 30 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారని, 200 మంది వరకు గాయాలపాలు అయ్యారని పాక్ ప్రభుత్వం తెలిపింది. మిగతా 2లో..

## కాంగ్రెస్‌కు ఊహించని షాక్

- మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ
- అఫిడవిట్‌లో వివరాలు దాచారని తిరస్కరణ
- న్యాయపోరాటం చేస్తామన్న సీఎం రేవంత్

భోపాల్,జూన్9(ప్రజాజ్యోతి): కాంగ్రెస్ పార్టీకి అనుకోని ఘటన ఎదురయ్యింది. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మధ్యప్రదేశ్ నుంచి ఆమె రాజ్యసభ ఎన్నికల కోసం నామినేషన్ వేయగా.. అది తిరస్కరణకు గురైంది. నామినేషన్ పత్రాలతో సమర్పించిన అఫిడవిట్‌లో ఒక పెండింగ్ కేసుకు సంబంధించిన వివరాలను

మిగతా 2లో..



# మహిళా సాధికారతకు మరో అడుగు

- మహిళా సంఘాలకు 553 ఆర్టీసీ బస్సులు పంపిణీ
- ఇందిరమ్మ రాజ్యంలోనే మహిళలకు పెద్దపీట
- వారిని కోటీశ్వరులను చేసే పనిలో వెనకడుగు లేదు
- మహిళల స్ఫూర్తితోనే తమ ప్రజాపాలన సాగుతోంది
- వారి దెబ్బకే కొందరు ఫామ్‌హౌజ్‌కు పరిమితం అయ్యారు
- కేసీఆర్ హయాంలో మంత్రి పదవులు కూడా ఇవ్వలేదు
- బీజేపీ కనీసం మహిళకు అధ్యక్ష పదవి ఇవ్వలేదు
- పరేడ్ గ్రౌండ్స్ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- మహిళలు ఎదుగుతుంటే ఓర్వలేని బిఆర్ఎస్
- ఫ్రీ బస్సు తీసుకొస్తే కళ్లల్లో నిప్పులు పోసుకున్నారు
- పరేడ్ గ్రౌండ్స్ సభలో మంత్రి సీతక్క ఘాటు విమర్శలు

**"బీజేపీ పార్టీ అధ్యక్ష పదవిని ఒక్కసారైనా మహిళలకు ఇచ్చారా?. బీఆర్ఎస్ ప్రభుత్వం తొలి ఐదేళ్లలో ఒక్క మహిళకూ మంత్రి పదవి ఇవ్వలేదు. మా ప్రభుత్వంలో ఇద్దరు మహిళలకు మంత్రి పదవులు ఇచ్చాం. గత ప్రభుత్వం మహిళలకు ఇవ్వాల్సిన రూ.4వేల కోట్ల సున్నా వడ్డీ నగదును చెల్లించలేదు. మహిళలతో పెట్టుకున్న ఎవరైనా అధికారంలో ఉంటారా? మహిళలతో పెట్టుకున్నందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఓడిపోయింది" - రేవంత్ రెడ్డి, సీఎం**

హైదరాబాద్,జూన్9(ప్రజాజ్యోతి): మహిళా సాధికారతకు తమ సర్కార్ మరో కీలక అడుగు వేసిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం.. మహిళా సంఘాలకు 553 ఆర్టీసీ బస్సులు పంపిణీ చేస్తున్నామని ఉద్ఘాటించారు. మహిళా శక్తి పథకం కింద 553 బస్సులు పంపిణీ చేశామని వ్యాఖ్యానించారు. మహిళలకు ఓటు హక్కు ఇచ్చింది కాంగ్రెస్ అని పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో బస్సులను సీఎం ప్రారంభించి ప్రసంగించారు. దేశానికి తొలి మహిళా రాష్ట్రపతిని అందించింది కాంగ్రెస్సేనని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. బీజేపీ అధ్యక్ష పదవిని ఒక్కసారైనా మహిళకు ఇచ్చారా అని ప్రశ్నించారు. మహిళలను స్ఫూర్తిగా తీసుకుని పరిపాలన చేస్తున్నామని వివరించారు. మహిళలను పరిపాలనలో భాగస్వామ్యం చేస్తామని పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలోని తొలి ఐదేళ్లలో ఒక్క మహిళకైనా మంత్రి పదవి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. తమ ప్రభుత్వంలో ఇద్దరు మహిళలకు మంత్రి పదవులు ఇచ్చామని ప్రస్తావించారు. మహిళలను స్ఫూర్తిగా తీసుకుని పరిపాలన చేస్తున్నామని వివరించారు. మహిళలను పరిపాలనలో భాగస్వామ్యం చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పుకొచ్చారు. మహిళా సంఘాల్లో 67 లక్షల మంది ఆడబిడ్డలు ఉన్నారని తెలిపారు. ఆడబిడ్డలతో పెట్టుకుంటే అధికారంలో ఉంటారా? అని ప్రశ్నించారు. తమ అక్కలు పెట్టిన వాతలతోనే కొందరు ఫామ్‌హౌస్‌లో పండుకున్నారని విమర్శించారు. ఉచిత బస్సుతో స్కూళ్లలో ఆడపిల్లల డ్రాపౌట్స్ తగ్గాయని అన్నారు. ఉచిత బస్సు పథకం కోసం రూ.10 వేల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. కడుపు నిండా మిగతా 2లో..

## ఉద్యోగుల జీతాల చెల్లింపులో జాప్యం

అధికారుల తీరుపై మండిపడ్డ సీఎం

హైదరాబాద్,జూన్9(ప్రజాజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల జీతాల చెల్లింపులో జాప్యంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. జీతాల ఆలస్యానికి బాధ్యులపై క్రమశిక్షణ చర్యలు తప్పవని వార్నింగ్ ఇచ్చారు. సీఎం ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల జీతాల చెల్లింపుపై ఆర్థిక శాఖ కీలక సర్క్యులర్ జారీ చేసింది. రెగ్యులర్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, హానరేరియం ఉద్యోగులందరికీ 1వ తేదీన వేతనాలు వేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఆలస్యమైతే హెడ్ ఆఫ్ డిపార్ట్‌మెంట్, డీడీఓలదే బాధ్యతని తెలిపారు. ప్రతి నెల 25వ తేదీలోపు జీతాల బిల్లులు ట్రెజరీకి సమర్పించాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. ఈ నెలాఖరులోపు బిల్లుల స్క్రూటినీ, ఆడిట్, అథరైజేషన్ పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి హుకుం జారీ చేశారు. బడ్జెట్ కొరత లేదా సాంకేతిక సమస్యలు ఉంటే ముందుగానే ÷నాన్స్ శాఖకు తెలియజేయాలని సూచించారు.

# నైరుతి ఆగమనంతో పలకరించిన తొలకరి

- హైదరాబాద్ నగరంలో ఉరుములతో భారీ వర్షం
- ఎప్పటిలాగే లోతట్టు ప్రాంతాలు జలమయం
- అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరిక

హైదరాబాద్,జూన్9(ప్రజాజ్యోతి): తొలకరి పలకరించింది. నైరుతి ప్రవేశంతో హైదరాబాద్ నగరంలో భారీ వర్షం కురిసింది. మంగళవారం సాయంత్రం హైదరాబాద్ నగరంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. నగరంలో పలు చోట్ల ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురు గాలుల తీవ్రతకు రామ్‌నగర్‌లోని వీఎస్టీ రోడ్డులో భారీ వృక్షం

మిగతా 2లో..



# ప్రజల సంక్షేమం కోసమే పనిచేస్తున్నాం

- ధనిక రాష్ట్రాన్ని అప్పులకుప్ప చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం
- పేదలకు సన్నబియ్యం ఇవ్వాలని బీఆర్ఎస్ ఆలోచించలేదు
- ఇచ్చిన హామీ మేరకు 76వేల ప్రభుత్వ ఉద్యోగాల కల్పన
- తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొంటున్న ఘనత మాదే
- జనగామ జిల్లా పర్యటనలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



జనగామ,జూన్ 9(ప్రజాజ్యోతి): ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర మంత్రివర్గం 18 గంటలు పనిచేస్తుంటే.. బీఆర్ఎస్ నేత హరీశ్ రావు ఏదో ఒక అభాండం వేస్తున్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. ధనిక రాష్ట్రాన్ని చేతిలో పెడితే అంతా ఖాళీ చేసిపోయారని మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతలు రాష్ట్రాన్ని దోపిడీ చేశారన్నారు. పేదలకు చెందాల్సిన సొమ్మును బీఆర్ఎస్ దోచుకుందని ఆరోపించారు. మంగళవారం నాడు జిల్లాలోని చిల్పూర్ మండలం పల్లగుట్టలో పర్యటించిన భట్టి.. 33/11కెవి సబ్ స్టేషన్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు పేదలకు సన్నబియ్యం ఎందుకివ్వలేదని ప్రశ్నించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా అభివృద్ధి, సంక్షేమం మిగతా 2లో..

# ధాన్యం కొనుగోళ్లపై కేంద్రం తిరకాసు

- మరోమారు కేంద్రానికి లేఖ రాస్తా..
- 8 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలు
- హమాలీల కొరత కూడా సేకరణలో అడ్డంకి
- ధాన్యం సేకరణలో ప్రతిపక్షాల విమర్శలు అర్థరహితం
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి బాధ్యతారాహిత్య విమర్శలు
- మేడిగడ్డలో నీళ్ల నింపితే కొట్టుకుపోతాయన్న ఎన్‌డీఎస్ఏ
- మీడియా సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి




హైదరాబాద్,జూన్9(ప్రజాజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలోని వడ్లకు ఇతర రాష్ట్రాల్లో డిమాండ్ లేదని పౌరసరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. అందుకే ఈ వడ్లను కేంద్రం కొనుగోలు చేయడానికి సుముఖంగా లేదన్నారు. మంగళవారం హైదరాబాద్ సచివాలయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకర్లతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో పండించిన 75 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు కొనుగోలు చేయాలని మరోసారి కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి లేఖ రాస్తానని ఆయన స్పష్టం చేశారు. ఇంకా రెండు లక్షల మెట్రిక్ టన్నుల ప్రోక్యూర్‌మెంట్ వచ్చే అవకాశం ఉందన్నారు. నాగర్ కర్నూల్ జిల్లాలో ఇంకా మిగతా 12లో..

## ప్రాజెక్టులకు అడ్డుపడ్డానని నిరూపిస్తావా

- నిరూపిస్తే వెంటనే రాజీనామా చేస్తా
- సీఎం రేవంత్‌కు కిషన్ రెడ్డి సవాల్



న్యూఢిల్లీ,జూన్9(ప్రజాజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో ప్రాజెక్టులను తాను అడ్డుకుంటున్నానని నిరూపిస్తే రాజీనామాకు సిద్ధమని సీఎం రేవంత్ రెడ్డికి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి సవాల్ విసిరారు. మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్రం సాధించినా తెలంగాణ ప్రజల బతుకులు మాత్రం మారలేదంటూ కిషన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు తెచ్చి సోకులు చేస్తున్నారంటూ గత బీఆర్ఎస్,

మిగతా 2లో..




# భావితరాల ఆకాంక్షలకు అనుగుణంగానే అడుగులు..

- స్థిరమైన, పర్యావరణహిత పారిశ్రామికవృద్ధికి ప్రాధాన్యం
- పారిశ్రామికవేత్తలు రాష్ట్ర ప్రగతిలో కీలక భాగస్వాములు
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు
- 'ఎఫ్ టీసీసీఐ ఎక్స్ లెన్స్ అవార్డ్స్ 2026' ప్రధానోత్సవం

హైదరాబాద్,జూన్9(ప్రజాజ్యోతి): భావితరాల ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా తీర్చిదిద్దేలా ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. భవిష్యత్తు కోసం ఎదురు చూడకుండా, దాన్ని నిర్మించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్(ఎఫ్ టీసీసీఐ) ఆధ్వర్యంలో మంగళవారం జూబ్లీహిల్స్ లోని జేఆర్సీ కన్వెన్షన్ మిగతా 12లో..

## మహిళలను మభ్య పెడుతున్న సీఎం

- ముందు అంగన్‌వాడీలకు జీతాలు చెల్లించండి
- ఎక్స్ వేదికగా హరీష్ రావు విమర్శలు

హైదరాబాద్,జూన్9(ప్రజాజ్యోతి): అంగన్‌వాడీలకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జీతాలు చెల్లించడం లేదంటూ బీఆర్ఎస్ నేత, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు మండిపడ్డారు. మహిళలను కోటీశ్వరులుగా చేస్తామని రేవంత్ మభ్యపెడుతున్నారని ఆగ్రహించారు. అంగన్‌వాడీలకు ముందు జీతాలు చెల్లించి మహిళలపై ముఖ్యమంత్రికి ఉన్న గౌరవాన్ని మిగతా 2లో..



# మహిళా సాధికారతకు మరో అడుగు

మొదటిపేజీ తరువాయి..

విషం పెట్టుకుని ఉచిత బస్సు పథకం ఆపాలని కొంతమంది చూశారని ధ్వజమెత్తారు. ఆటో డ్రైవర్లను రెచ్చగొట్టి రోడ్డుపైకి పంపారని సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహించారు. 27 వేల స్కూళ్ల నిర్వహణ బాధ్యత కూడా ఆడబిడ్డలకు అప్పగించామని తెలిపారు. మిడ్ డే మీల్ పథకం సరుకులు కూడా మహిళలే సరఫరా చేస్తున్నారని వెల్లడించారు. పెట్రోల్ బంకుల నిర్వహణ అప్పగించడంతో లక్షలు సంపాదిస్తున్నారని చెప్పుకొచ్చారు. 8 వేల స్త్రీ శక్తి భవనాలు ఒకేసారి పూర్తిచేస్తామని అన్నారు. కార్పొరేట్ ఆఫీస్‌ల కంటే మిన్నగా స్త్రీ శక్తి భవనాలు ఉంటాయని వివరించారు. హైటెక్ సిటీ దగ్గర మహిళలకు రూ.1000 కోట్ల భూమి కేటాయించామని ప్రస్తావించారు. 106 స్టాల్స్‌తో




అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో మాల్ నిర్మించామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులుగా మారుస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పునరుద్ఘాటించారు. దళారులు, దోపిడీదారులకు తమ ప్రభుత్వంలో చోటులేదని స్పష్టం చేశారు. 2034 వరకు ప్రజాప్రభుత్వం కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఆడబిడ్డలకు అండగా ఉండే బాధ్యత తమదని తెలిపారు. ఎవరెన్ని కుట్రలు చేసినా మహిళా సంఘాలను ఆదుకుంటున్నామని చెప్పుకొచ్చారు. రూ.60 వేల కోట్ల రుణాలతో ఆర్థికంగా నిలబెడుతున్నామని తెలిపారు. ఆడబిడ్డలు సంతోషంగా ఉండాలని మంచి చీరలు ఇస్తున్నామని వివరించారు. కేసీఆర్ హయాంలో ఇచ్చిన చీరలను ఎవరైనా కట్టుకున్నారా? అని ప్రశ్నించారు. ఆడబిడ్డల సంక్షేమానికి అన్నివేళలా కృషిచేస్తామని తెలిపారు. పంట మార్పిడి విషయంలో మహిళలు చొరవ చూపాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు.

మన సంస్కృతి, సంప్రదాయల్లో మహిళలకు ప్రత్యేక గుర్తింపు ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలోనే మహిళలకు గుర్తింపు ఉంటుంది. మహిళలకు ఇవ్వాల్సిన రూ.4వేల కోట్ల సున్నా వడ్డీ నగదును గత ప్రభుత్వం చెల్లించలేదు. మహిళలతో పెట్టుకున్న ఎవరైనా అధికారంలో ఉంటారా? మహిళలతో పెట్టుకున్నందుకే బీఆర్ఎస్ ప్రభుత్వం ఓడిపోయింది. మహిళల ఉచిత బస్సు ప్రయాణం కోసం ఆర్టీసీకి రూ.10,500 కోట్లు చెల్లించాం' అన్నారు. అందరికంటే ముందుంటామని మహిళలు నిరూపిస్తున్నారు. వ్యవసాయానికి ప్రాణవాయువు ఆడబిడ్డలు. ఆడబిడ్డ పుడితే.. మహాలక్ష్మి వచ్చిందని సంతోషపడే సంస్కృతి మనది. మన సంస్కృతి, సంప్రదాయాల్లో మహిళలకు ప్రత్యేక గుర్తిపు ఉంది. మహిళా శక్తిని ప్రపంచానికి చాటి చెప్పిన ఘనత ఇందిరాగాంధీకి దక్కుతుంది. మహిళలను స్ఫూర్తిగా తీసుకొని మేం పరిపాలన చేస్తున్నాం. అమెరికాలో మహిళలకు ఓటు హక్కు వచ్చేందుకు వందల ఏళ్లు పట్టింది. భారత్‌కు స్వాతంత్ర్యం రాగానే మహిళలకు ఓటు హక్కు ఇచ్చిన ఘనత నెహ్రూకే దక్కుతుందని రేవంత్ అన్నారు. స్థానిక ఎన్నికల్లో మహిళలకు రాజీవ్‌గాంధీ రిజర్వేషన్లు ఇచ్చారు. సోనియా గాంధీ 2013లో చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు ఇవ్వాలని బిల్లు ప్రవేశపెట్టారు. అంబానీ, ఆదానీలకు పోటీగా పెట్రోల్ బంకులు, సోలార్ విద్యుత్‌ను రాష్ట్ర మహిళలు నిర్వహిస్తున్నారు. త్వరలోనే మహిళా శక్తి భవనాలు నిర్మిస్తామని అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ఎదగాలని కాంగ్రెస్ సర్కార్ కోరుకుంటే బీఆర్ఎస్ ఏడుస్తోందని మంత్రి సీతక్క విమర్శించారు. మహిళలు ఎదిగితే బీఆర్ఎస్ ఓర్వలేకపోతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళల కోసం ఫ్రీ బస్ స్కీమ్ తీసుకొస్తే కళ్లలో నిప్పులు పోసుకుంటున్నారని బీఆర్ఎస్ పై ఫైర్ అయ్యారు. మంగళవారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ ప్రభుత్వం మహిళా శక్తి సభ నిర్వహించింది. మంత్రి సీతక్క ఈ సభకు హాజరై ప్రసంగించారు. రాష్ట్రంలోకి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలకు రూ.61 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చామని తెలిపారు. రూ.2 వేల కోట్ల వడ్డీ డబ్బులను ప్రభుత్వమే చెల్లింస్తుదని చెప్పారు. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా ఉపాధి కల్పిస్తున్నామన్నారు. మూడు వేలకు పైగా మహిళా సంఘాలకు ఐకేపీ సెంటర్లు ఇచ్చామని.. వీటి ద్వారా ఆడబిడ్డలకు గతేడాది రూ.159 కోట్ల ఆదాయం వచ్చిందని తెలిపారు. రాష్ట్రంలో చదువుకోని 12 లక్షల మంది మహిళలకు చదువు చెప్పిస్తున్నామన్నారు. 60 ఏళ్లు దాటిన మహిళలను కూడా మహిళా సంఘాల్లో చేర్చుతున్నామని తెలిపారు. గ్రామీణ మహిళలు స్వయంగా తయారు చేసే ఉత్పత్తులను ప్రపంచానికి చూపిస్తున్నామని అన్నారు.

## సంపాదకీయం

### ట్రంప్‌కు వీసా దెబ్బ !

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మహాశయుడికి ఎదురుగాలి వీస్తోంది. ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలపై దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తం అవుతూనే ఉన్నాయి. ఇప్పటికే ఇరాన్‌పై యుద్ధం చేయడాన్ని అమెరికా పౌరులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. వీధుల్లోకి వచ్చి నిరసనలు తెలిపారు. ఇక ప్రపంచమంతా కూడా ట్రంప్ యుద్ధ పిపాసపై మండిపడుతోంది. అనేక దేశాలు ఆర్థిక సంక్షోభంలో పడ్డాయి. ఇంధనం దొరక్క అనేక దేశాలు అల్లాడి పోతున్నాయి. ఈ తరుణంలో ట్రంప్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. తాజాగా విదేశీ వృత్తి నిపుణుల హెచ్1బీ వీసాలకు ట్రంప్ సర్కార్ విధించిన లక్ష డాలర్ల ఫీజు చట్టవిరుద్ధమంటూ అమెరికాలోని బోస్టన్ ఫెడరల్ కోర్టు ఇచ్చిన తీర్పుతో అనేక కంపెనీలకు ఊరట లభించినట్లయ్యింది. దీనిపై ప్రవాస భారతీయ సంఘాలు, డెమోక్రాట్లతో పాటు ట్రంప్ సొంత పార్టీ అయిన రిపబ్లికన్ నేతలూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరి ఈ పరిణామాలు వీసాల జారీపై ఎలాంటి ప్రభావం చూపిస్తాయన్న చర్చ జరుగుతోంది. అలాగే ఈ తీర్పుతో భారతీయులకు ప్రయోజనం ఎంతన్నది కూడా చర్చిస్తున్నారు. అమెరికా హెచ్-1బీ అనేది.. నాన్ ఇమిగ్రెంట్ వీసా. ప్రధానంగా ప్రత్యేక వృత్తుల్లో సాంకేతిక నైపుణ్యమున్న విదేశీయులను ఉద్యోగాల్లో నియమించుకోవటానికి యూఎస్ కంపెనీలను ఇది అనుమతిస్తుంది. అగ్రరాజ్యం ఏటా 65వేల మందికి ఈ వీసాలను జారీ చేస్తుంది. దీంతోపాటు అక్కడే మాస్టర్స్ చేసిన మరో 20వేల మందికి ఇవ్వాలనే నిబంధన ఉంది. అంటే మొత్తంగా ఏటా 85వేల హెచ్-1బీ వీసాలు జారీ అవుతుంటాయి. ఈ వీసాలు పొందినవారిలో దాదాపు 70శాతం మంది భారతీయులే ఉంటున్నారు. ఆ తర్వాత చైనా రెండో స్థానంలో ఉంది. సాధారణంగా వీసాల కోసం అయ్యే ఖర్చును కంపెనీలు భరిస్తాయి. గతంలో ఇందుకోసం 2 వేల నుంచి 5 వేల డాలర్ల వరకూ ఖర్చు కాగా.. గతేడాది సెప్టెంబరులో ఈ వీసా ఫీజును ట్రంప్ ఏకంగా లక్ష డాలర్లకు పెంచేసారు. విదేశీ ఉద్యోగులపై ఆధారపడకుండా కంపెనీలు అమెరికన్లను నియమించుకోవాలనే ఉద్దేశంతో ఈ ఫీజును పెంచారు. దీంతో భారతీయులపై పెను ప్రభావమే పడింది. ఈ స్థాయిలో ఫీజును భరించలేక చాలా కంపెనీలు హెచ్-1బీ నియామకాలను తగ్గించాయి. ఈ ఫీజును సవాల్ చేస్తూ పలు న్యాయస్థానాల్లో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ క్రమంలోనే హెచ్-1బీ వీసా ఫీజులపై విచారణ జరిపిన బోస్టన్‌లోని ఫెడరల్ కోర్టు.. అమెరికా కాంగ్రెస్ ఆమోదం తెలపనందున దానిని చట్టవిరుద్ధ పన్నుగా పరిగణిస్తున్నామని స్పష్టం చేసింది. ఈ ఫీజు చెల్లబోదంటూ కీలక తీర్పు వెలువరించింది. దీంతో అమెరికా కంపెనీలపై తక్షణ ఆర్థికభారం తగ్గినట్లయ్యింది. అయితే, తీర్పు నేపథ్యంలో ఈ ఫీజును పూర్తిగా ఎత్తివేస్తారా? అంటే కాదనే సమాధానమే వినిపిస్తోంది. బోస్టన్ కోర్టు తీర్పును ఉన్నత న్యాయస్థానాల్లో అప్పీల్ చేస్తామని వైట్‌హౌస్ వర్గాలు సూచనప్రాయంగా వెల్లడించాయి. అదే జరిగితే.. మరికొన్ని నెలల పాటు ఈ అంశం న్యాయస్థానాల్లో మగ్గనుంది. గతంలో కింది కోర్టు ఇచ్చిన తీర్పును ట్రంప్ సర్కారు అప్పీల్ చేసి గెలిచిన సందర్భాలూ ఉన్నాయి. దీన్నిబట్టి చూస్తే.. ఫీజు భారం నుంచి కంపెనీలకు పూర్తి మినహాయింపు దక్కనట్టే..! ఈ తీర్పు వల్ల ఏటా ఇచ్చే హెచ్-1బీ కోటాలో ఎలాంటి మార్పు ఉండదు. వీసా వస్తుందన్న గ్యారెంటీ కూడా లేదు. కాకపోతే.. ప్రస్తుతానికి ఫీజు భారం తగ్గడంతో ఈ అవకాశాన్ని అమెరికా కంపెనీలు సద్వినియోగం చేసుకునే వీలుంది. ఇప్పటికే వృత్తి నిపుణుల కొరతతో సతమతమవుతున్న కంపెనీలు.. మళ్లీ విదేశీ ఉద్యోగుల నియామకాలు పెంచుకునే వీలుంది. సాధారణంగా వీరిలో అత్యధిక అవకాశాలు భారతీయులకే దక్కుతాయి కాబట్టి.. మనవాళ్లకు కొంతమేర ఉపశమనం లభించినట్లేనని వృత్తి నిపుణులు భావిస్తున్నారు. అయితే అనేక వివాదాస్పద నిర్ణయాలతో ట్రంప్ ప్రజలను తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నారు. ఈ వీసా నిబంధనల కారణంగా అమెరికాకు వచ్చే వృత్తి నిపుణులకు కొరత ఏర్పడింది. ఈ క్రమంలో హెచ్-1బీ వీసా ఫీజుపై ట్రంప్ నిర్ణయాన్ని కొట్టివేస్తూ.. ఫెడరల్ కోర్టు ఇచ్చిన తీర్పుపై అమెరికా లోని ప్రవాస భారతీయ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న నిర్ణయం చట్టవిరుద్ధమని కోర్టు స్పష్టం చేసింది. ఫౌండేషన్ ఫర్ ఇండియా అండ్ ఇండియన్ దయాస్పోరా స్టడీస్ కి చెందిన చీఫ్ స్పందించారు. హెచ్-1బీ వీసా రుసుముపై ఫెడరల్ కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగ ఆధారిత వలసల వ్యవస్థపై స్థిరత్వాన్ని ఇది తిరిగి తీసుకొస్తుందన్నారు. అమెరికాలో సాంకేతిక, ఆరోగ్య సంరక్షణ, అధునాతన తయారీ రంగాల వృద్ధికి ప్రపంచంలోని ప్రతిభావంతులు అవసరమని ఇక్కడి నిపుణులు అభిప్రాయపడ్డారు. విధానపరమైన మార్పులు, చట్టబద్ధమైన అధికారం, ఆర్థిక గణాంకాలపై ఆధారపడి ఉండాలని అభిప్రాయపడ్డారు. ఇండియాస్పోరా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజీవ్ జోషిపురా కోర్టు తీర్పుపై హర్షాతిరేకాలు తెలియజేశారు. అయితే, ట్రంప్ యంత్రాంగం ఈ విషయాన్ని ఇంతటితో ముగుస్తుందా.. లేదా అనే దానిపై అనుమానం వ్యక్తంచేశారు. ట్రంప్ యంత్రాంగానికి, న్యాయవ్యవస్థలకు మధ్య ఇటీవల జరిగిన పలు వివాదాలను ప్రస్తావించారు. చట్టానికి విరుద్ధంగా.. విధానపరమైన అంశాలతో అమెరికా ప్రభుత్వం హెచ్-1బీ వీసాదారుల కు మరిన్ని అడ్డంకులు సృష్టించవచ్చని హెచ్చరించారు. హెచ్-1బీ వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ గతేడాది సెప్టెంబరులో ట్రంప్ తీసుకొన్న నిర్ణయం సంచలనం సృష్టించింది. ట్రంప్ నిర్ణయాన్ని యూఎస్ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌తో సహా పలు డెమొక్రటిక్ రాష్ట్రాలు కోర్టులో సవాల్ చేశాయి. ఈక్రమంలో బోస్టన్‌లోని ఫెడరల్ కోర్టు ట్రంప్ నిర్ణయం చట్టవిరుద్ధమైనదని ప్రకటించింది. అమెరికా కాంగ్రెస్ ఆమోదం లేకుండా అధ్యక్షుడు మాత్రమే దీనిపై నిర్ణయం తీసుకోలేరని స్పష్టం చేసింది. అయితే, ఈ తీర్పుపై ట్రంప్ యంత్రాంగం అప్పీల్ చేయనున్నట్లు తెలుస్తోంది.

## కాంగ్రెస్‌కు ఊహించని షాక్

మొదటిపేజీ తరువాయి..

పూర్తిగా వెల్లడించలేదనే కారణంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. నామినేషన్ల పరిశీలన సమయంలో బీజేపీ నాయకులు రిటర్నింగ్ అధికారికి అభ్యంతరం తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఒక కోర్టు కేసు వివరాలను మీనాక్షి నటరాజన్ తన అఫిడవిట్‌లో పేర్కొనలేదని బీజేపీ ఆరోపించింది. ఈ అభ్యంతరాన్ని పరిశీలించిన అనంతరం నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి తిరస్కరించారు. మీనాక్షి నటరాజన్ గతంలో లోక్‌సభ సభ్యురాలిగా పనిచేశారు. ప్రస్తుతం కాంగ్రెస్‌లో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మధ్యప్రదేశ్‌లో రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో ఇప్పటికే ఉద్రిక్తతలు నెలకొన్నాయి. కాంగ్రెస్ తమ ఎమ్మెల్యేలను కర్ణాటకకు తరలించి క్రాస్ ఓటింగ్‌ను అడ్డుకునే ప్రయత్నాలు చేస్తోంది. ఇక, మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ నిర్ణయాన్ని కాంగ్రెస్ సవాలు చేస్తుందా? లేదా ప్రత్యామ్నాయ వ్యూహంతో ముందుకు వెళ్తుందా? అన్నది ఆసక్తికరంగా మారింది. ఇదిలావుంటే మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్‌ను మధ్యప్రదేశ్ ఎన్నికల అధికారి తిరస్కరించడంపై ఆ పార్టీ స్పందించింది. బుధవారం కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తన ఎక్స్ ఖాతా వేదికగా స్పందించారు. మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్‌ను తిరస్కరించడం ప్రజాస్వామ్య పక్రియను దెబ్బతీయడానికి బీజేపీ చేసిన బహిరంగ ప్రయత్నమని ఆయన అభివర్ణించారు. ఆమె నామినేషన్‌లో ఏదైనా తప్పు లేదా వివరాలను వెల్లడించలేదనే ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవి, అవాస్తవమైనవని పేర్కొన్నారు. ఇది కాంగ్రెస్ పార్టీకి దక్కాల్సిన స్థానాన్ని లాక్కోవడానికి చేసిన నిరాశాజనకమైన ప్రయత్నం మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టి తమ వైపు తిప్పుకునే బీజేపీ కుట్రలు విఫలమవుతున్నాయని గ్రహించిన తర్వాత, వారు ఇంత దిగజారిపోయి మీనాక్షి నటరాజన్ నామినేషన్‌ను తిరస్కరించారని వివరించారు. ఇది రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై బీజేపీకి ఉన్న నిబద్ధత ఎంత బూటకమో మరోసారి నిరూపిస్తోందని తెలిపారు. ప్రతి దశలోనూ బీజేపీ ఏదో ఒక రూపంలో ఓట్ల చోరీ చేయడానికే ప్రయత్నిస్తుందని చెప్పారు. ప్రజాస్వామ్యాన్ని పట్టపగలు దోచుకునే ఈ చర్యను తాము ఎట్టి పరిస్థితుల్లోనూ సహించమని కరాకండిగా చెప్పారు. దీనిపై న్యాయపరంగా, రాజకీయంగా, ప్రజల మధ్యన గట్టిగా పోరాడుతామని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్ అన్నారు. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు.

## ఈ ఏడాదే పాలేరుకు గోదావరి జలాలు

మొదటిపేజీ తరువాయి..

చేశామని పేర్కొన్నారు. మంగళవారం నేలకొండపల్లి మండలం చెరువు మాదారంలో డీసీసీబీ బ్యాంక్ నూతన బ్రాంచ్ ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి తుమ్మల హాజరై మాట్లాడారు. అన్ని వ్యవసాయ పంటలు పండించే నియోజకవర్గం పాలేరు అని అభివర్ణించారు. నేడు పాలేరు ధనిక నియోజకవర్గమని ఉద్ఘాటించారు. నాగార్జునసాగర్ జలాలతో పాటు, భక్తరామదాసు, గోదావరి జలాలతో నియోజకవర్గం పునీతమవుతోందని మంత్రి తుమ్మల వ్యాఖ్యానించారు. ఈ పనుల కోసం రూ.4,900 కోట్లు కేటాయించామని వెల్లడించారు.రూ.20 వేల కోట్ల రుణమాఫీ చేశామని స్పష్టం చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రంలో ఎక్కడా రుణమాఫీ చేయలేదని.. అప్పులు చాలా ఉంటాయని అన్నారు. తమ ప్రభుత్వం పంటరుణాల వరకు రుణమాఫీ చేసిందని ప్రస్తావించారు. ఖజానాపై భారం ఉన్నప్పటికీ రూ.27 వేల కోట్లు రైతు భరోసా ఇచ్చామని స్పష్టం చేశారు. పక్క రాష్ట్రంలో మొక్కజొన్న కొనటం లేదని మంత్రి తుమ్మల తెలిపారు. పక్క రాష్ట్రాల రైతులు ఇక్కడ రైతుల పేరు మీద అమ్ముకుంటున్నారని చెప్పుకొచ్చారు. పనిచేసిన ప్రభుత్వాన్ని ఆశీర్వాదిస్తే ప్రజల బతుకులు బాగుంటాయని తెలిపారు. డీజిల్, యూరియా ఇచ్చేది కేందప్రభుత్వమేనని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం తప్పులు చేయదన్నారు. రైతులు బీఆర్ఎస్, బీజేపీ పార్టీలను నమ్మే పరిస్థితి లేదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలం

మొదటిపేజీ తరువాయి..

కేంద్రాలను కేంద్రం నిర్వహించదని, రాష్ట్రాలు కొనుగోలు చేసిన ధాన్యానికి కేంద్రమే రీయింబర్స్‌మెంట్ ఇస్తుందని స్పష్టంచేశారు. దేశవ్యాప్త ధాన్యం సేకరణలో దాదాపు 50 శాతం తెలంగాణ నుంచే జరిగినప్పటికీ కేంద్రంపై తప్పుడు ప్రచారం



చేస్తూ రైతులను తప్పుదారి పట్టిస్తున్నారని మండిపడ్డారు. రైతుల సమస్యలను పక్కనబెట్టి, వాస్తవాలను దాచిపెడుతూ ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతోందని విమర్శించారు. ఇదే క్రమంలో పాలమూరు?రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, మూసి ప్రక్షాళన ప్రాజెక్టులు సీఎం రేవంత్ రెడ్డికి 'ఏటీఎం'లుగా మారాయని రాంచందర్ రావు సంచలన ఆరోపణలు చేశారు. తాము మూసి ప్రక్షాళనకు వ్యతిరేకం కాదని, కేవలం 'గాంధీ సరోవర్' ప్రాజెక్టుకే తమ అభ్యంతరమని స్పష్టంచేశారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను పూర్తిగా అమలు చేసే వరకు బీజేపీ పోరాటం కొనసాగిస్తుందని, అలాగే కాళేశ్వరం అవినీతి అంశంలో కేసీఆర్‌ను కాపాడేందుకే ప్రభుత్వం కాలయాపన చేస్తోందని రాంచందర్ రావు ఆరోపించారు.

## నైరుతి ఆగమనంతో పలకరించిన తొలకరి



మొదటిపేజీ తరువాయి..

నేలకొరిగింది. అలాగే, హైదర్‌గూడలోనూ ఓ భారీ వృక్షం నేలకొరగడంతో ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. పలుచోట్ల రహదారులపై వర్షం నీరు చేరింది. ముషీరాబాద్‌లో ఈదురుగాలులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగింది. భాగ్యనగరంలో భారీ వర్షం కురుస్తోండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. సిటీలోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతోండటంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. రోడ్లపై భారీగా వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా లోతట్టు కాలనీలు, ప్రధాన రహదారులు, కూడళ్లలో నీరు చేరడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పంజాగుట్ట, ఖైరతాబాద్, బంజారాహిల్స్, యూసఫ్‌గూడ, టోలీచౌకి, ఫిలింనగర్, అమీర్‌పేట్, ఎస్సార్‌నగర్, ఎర్రగడ్డ, సనత్‌నగర్ తదితర ప్రాంతాల్లో వర్షం కురుస్తోంది. పలు ప్రాంతాల్లో వాహనాలు నెమ్మదిగా సాగుతుండగా, కొన్ని చోట్ల ట్రాఫిక్ జాం అయింది. కార్యాలయాలు, విద్యాసంస్థల నుంచి ఇళ్లకు వెళ్లే ప్రజలు వర్షం కారణంగా ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షాల నేపథ్యంలో జీహెచ్ఎంసీ సిబ్బంది అప్రమత్తమయ్యారు. నీరు నిలిచిన ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపడుతూ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయటకు రావాలని, వర్షపు నీరు నిలిచిన ప్రాంతాల్లో జాగ్రత్తగా ప్రయాణించాలని అధికారులు సూచిస్తున్నారు. వాతావరణ శాఖ అధికారులు మరికొన్ని గంటల పాటు నగరంలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, విద్యుత్ స్తంభాలు, చెట్లు, నీటితో నిండిన ప్రాంతాల వద్ద జాగ్రత్తలు పాటించాలని సూచించారు. భారీ వర్షాల ప్రభావంతో నగరంలోని పలు లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తెలంగాణలో బుధవారం కూడా పలుచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది. రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో నేడు అక్కడక్కడ భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు తెలిపింది. గంటకు 40 నుంచి 50కి.మీ వేగంతో ఈదురుగాలులతో వర్షాలు పడొచ్చని పేర్కొంది.

**CHANGE OF NAME**

I, SADIYA BEGUM W/O SHAIK ZAKIR HUSSAIN (old name) born on 07-07-1998 at Nirmal earlier was Holding Passport No. W1364209 DT: 24-05-2022 hereby changing my Name and henceforth in future I would be known as **SAYYED SADIYA W/O SHAIK ZAKIR HUSSAIN** (new name) H.No. 5-12/187/B/30 Gajulpet-504106 Telangana State.
Place: Nirmal
Date: 08-06-2026
DECLARANT
**SAYYED SADIYA**
W/O SHAIK ZAKIR HUSSAIN

## ప్రాజెక్టులకు అడ్డుపడ్డానని నిరూపిస్తావా

మొదటిపేజీ తరువాయి..

ప్రస్తుత రేవంత్ సర్కార్ తీరును ఆయన ఎండగట్టారు. హైదరాబాద్‌లో భూములు మిగిలే పరిస్థితి లేదన్నారు. మంత్రులతోపాటు అందరూ భూ దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ రంగం కుదేలయ్యిందని చెప్పారు. ఉద్యోగులకు వేతనాలు ఇచ్చే పరిస్థితి ప్రభుత్వానికి లేదన్నారు.సీఎం రేవంత్ రెడ్డి బెదిరింపులకు తాను భయపడే వ్యక్తిని కానన్నారు. సీఎం రేవంత్ పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సీఎం స్థాయిని మరిచి మాట్లాడుతున్నారంటూ రేవంత్‌రెడ్డిపై కిషన్ రెడ్డి నిప్పులు చెరిగారు. సీఎం రేవంత్ రెడ్డిలాగా తాను మాటకారిని కాను.. కానీ మాటపై నిలబడే వ్యక్తిని అని కిషన్ రెడ్డి కుండబద్దలు కొట్టారు. పదవులు, అధికారం కోసం మాటలు మార్చే వ్యక్తిని తాను కానని స్పష్టం చేశారు. చిల్లర రాజకీయాలు చేయడం తనకు అలవాటు లేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై ఎక్కడైనా తాను చర్చకు సిద్ధమని అధికార పార్టీ నేతలకు కిషన్‌రెడ్డి బహిరంగ సవాల్ విసిరారు. మీరిచ్చిన ఏ గ్యారంటీ అయినా అమలు చేశారా? అంటూ కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. తెలంగాణ ధనిక రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చారని వ్యంగ్యంగా అన్నారు. దోచుకోవడం, దాచుకోవడం, ప్రజలను వంచించడంలో.. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు దొందూ దొందేనని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారంటూ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. బీజేపీ నేతలను సీఎం రేవంత్ రెడ్డి బెదిరిస్తున్నారని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను గమనించాలంటూ తెలంగాణ సమాజానికి ఈ సందర్భంగా సూచించారు. సీఎం రేవంత్‌కు తాము గులాంలు కామన్నారు. తనకు సీఎం రేవంత్‌రెడ్డి సర్టిఫికెట్ అవసరం లేదని మంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు.

## మహిళలను మభ్య పెడుతున్న సీఎం

మొదటిపేజీ తరువాయి..

నిరూపించుకోవాలన్నారు. రెండు నెలలుగా జీతాలు అందక 62 వేల మంది అంగన్‌వాడీలు కష్టాలు పడుతున్నారని మాజీ మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఎమ్మెల్యే హరీశ్ రావు స్పందించారు. 'రెండు నెలలుగా జీతాలు రాకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న 62 వేల మంది అంగన్‌వాడీ సోదరీమణుల కష్టాలు మీకు కనిపించడం లేదా?. నెలల తరబడి జీతాలు ఇవ్వకుండా వేధిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి తప్పకుండా వారి ఉసురు తగులుతుంది. సాటి మహిళల కన్నీటి గోసను మహిళా మంత్రిగా ఉన్న సీతక్క అర్థం చేసుకోకపోవడం శోచనీయం. గత ప్రభుత్వంలో అంగన్‌వాడీల సేవలను గుర్తించిన కేసీఆర్ వారి గౌరవాన్ని పెంచారు. వారు వర్కర్లు కాదని, టీచర్లని పేర్కొంటూ హోదాను ఉన్నతీకరించారు. 2014 నాటికి అంగన్‌వాడీ టీచర్లకు కేవలం రూ.4,200, వారి సహాయకులకు రూ.2,200 వేతనం లభించేది.

## ప్రజల సంక్షేమం కోసమే పనిచేస్తున్నాం

మొదటిపేజీ తరువాయి..

ఆపడం లేదని డిప్యూటీ సీఎం వెల్లడించారు. 76 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామన్నారు. కేంద్ర ప్రభుత్వం వడ్లను ఎందుకు కొనుగోలు చేయడం లేదని ప్రశ్నించారు. కార్పొరేట్ శక్తుల దయాదక్షిణ్యాల కోసం రైతులు ఎదురు చూసేలా కేంద్రం చేస్తోందని విమర్శించారు. ఏ రాష్ట్రంలోనూ వడ్ల కొనుగోళ్లు జరగడం లేదన్నారు. తాము మొక్కజొన్నలు కూడా కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ ఉచిత విద్యుత్ ఇచ్చింది కానీ డిస్కమ్‌లకు డబ్బులు చెల్లించలేదన్నారు. కానీ ఇప్పుడు డిస్కమ్‌లకు డబ్బులు చెల్లిస్తున్నామని అన్నారు. ఎన్నికల సందర్భంగా నేను, సీఎం ఇక్కడి ప్రజలకు హామీలు ఇచ్చాం. ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నాం' అని భట్టి తెలిపారు. దేవాదుల ప్రాజెక్టును బీఆర్ఎస్ ప్రభుత్వం గాలికి వదిలేసిందని వ్యాఖ్యానించారు. దేవాదుల ప్రాజెక్టు పనులు త్వరలోనే పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. రైతులకు రుణమాఫీ చేయడంతో పాటు.. తడిసిన ధాన్యాన్ని కూడా కొంటున్నామన్నారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం ఒకప్పుడు వలసల ప్రాంతమని.. కానీ ఇప్పుడు అభివృద్ధి జరుగుతోందన్నారు. రఘునాథపల్లిలో 230ఐ÷ఎ సబ్ స్టేషన్ ఏర్పాటును పరిశీలిస్తామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రాష్ట్రంలో రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. తడిచిన ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు. 72 లక్షల టన్నుల ధాన్యం సేకరించి రూ.14వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశాం. రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన ధాన్యాన్ని కేంద్రం ఎందుకు కొనుగోలు చేయట్లేదు? రాష్ట్రం సేకరించిన మొక్కజొన్నను కూడా కేంద్రం కొనుగోలు చేయాలి. 30 లక్షల పంపుసెట్ల విద్యుత్తు బిల్లులు రూ.14వేల కోట్లు డిస్కమ్‌లకు చెల్లిస్తున్నాం. 53 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌కు రూ.5వేల కోట్లు చెల్లిస్తున్నాం. ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. గతంలో ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా అమలుచేస్తున్నాం. దేవాదుల ప్రాజెక్టును గత ప్రభుత్వం గాలికొదిలేసింది. దేవాదులకు నిధులు మంజూరుతో పనులు వేగంగా సాగుతున్నందున ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేస్తాం. రైతులకు రూ.22వేల కోట్ల రుణమాఫీ చేశాం అని వివరించారు.

## నెత్తురోడిన పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్

మొదటిపేజీ తరువాయి..

అయితే మృతుల సంఖ్య చాలా ఎక్కువగా ఉందని, పాక్ ప్రభుత్వం కావాలనే వివరాలను బయటకు రానివ్వడం లేదని కమిటీతో పాటు స్థానికులు ఆరోపిస్తున్నారు. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో పౌర సమాజ కూటమిగా ఏర్పడ్డ పీవోకేలో ఆర్థిక, రాజకీయాలకు సంబంధించిన విషయాలపై ప్రభుత్వాన్ని నిలదీస్తోంది. ముఖ్యంగా పీవోకేలో ఇంతకు ముందు జరిగిన హింసాత్మక ఘటనలు, ఇంటర్నెట్ నిలిపివేత, విద్యుత్ కొరత, ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, వనరుల దోపిడీ, రాజకీయ వివక్ష మొదలైన సమస్యలపై పోరాడుతోంది. ఈ క్రమంలోనే, జులై 27న పాక్ ఆక్రమిత కశ్మీర్ శాసనసభకు ఎన్నికలు నిర్వహించాలని పాక్ నిర్ణయించింది. అయితే ఈ శాసనసభలో ఉన్న మొత్తం 45 స్థానాల్లో 12 స్థానాలను పీవోకేకు చెందని పాక్ జాతీయులకు కేటాయిస్తూ (రిజర్వేషన్) చట్టం చేసింది. దీని వల్ల స్థానికుల హక్కులు దెబ్బతింటాయంటూ ఉద్యమిస్తోంది. ఈ క్రమంలో ఆ సంస్థకు ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్నాయని పాక్ ఆరోపించింది. అక్కడితో ఆగకుండా ప్రజాశాంతి, భద్రతకు ముప్పు ఉందనే కారణం చూపిస్తూ గతవారం జేఏఏసీ సంస్థను నిషేధించింది. దీనిని వ్యతిరేకిస్తూ స్థానికులు రోడ్లపైకి రావడంతో అల్లర్లు చెలరేగాయి. ఈ క్రమంలో గత శుక్రవారం రాత్రి సైన్యం జరిపిన కాల్పుల్లో ఒక వ్యాపారి మరణించాడు. దీనితో పీవోకేలో ఒక్కసారిగా ఉద్రిక్తతలు పెరిగాయి. ఆదివారం రావల్‌కోట్ నగరంలో సైన్యానికి, నిరసనకారులకు మధ్య ఘర్షణలు చెలరేగాయి. దీనిపై రావల్‌కోట్ కమిషనర్ సర్దార్ వహీద్ ఖాన్ ఓ ప్రముఖ న్యూస్ ఏజెన్సీతో మాట్లాడుతూ, "పోలీసుల కాల్పుల్లో మరణించిన వ్యాపారి మృతదేహాన్ని ఆసుపత్రి మార్చురీలో ఉంచాం. దీనిలో ఆ ఆసుపత్రి వెలుపల జేఏఏసీ మద్దతుదారులు భారీగా గుమిగూడారు. భద్రతా దళాలు వారిని చెదరగొట్టడానికి చూశాయి. దీనితో జేఏఏసీకు చెందిన కార్యకర్తలు ఆటోమేటిక్ రైఫిళ్లు, పెట్రోల్ బాంబులు, ఇతర ఆయుధాలతో దాడులకు దిగారు.

**డాక్యుమెంట్ పోయినది**

నేను అనగా మామిడి ప్రణీత రెడ్డి
రెడ్డిపల్లి గ్రామం నుండి హైదరాబాద్ వెళ్తుండగా రెడ్డిపల్లి ప్లమ్ స్ప్రింగ్స్ వెంచర్ లో గల సర్వే నెంబర్ 68/AA ప్లాట్ నంబర్ 424,
DC NO: 633/2008,చదరపు,333గజల ఒరిజినల్ డాక్యుమెంట్ తో కూడిన లింక్ డాక్యుమెంట్ పేపర్ పోయినవి.దొరికిన వాళ్ళు ఈ క్రింది నంబర్ కి ఫోన్ చేసి ఇవ్వగలరు. ఫోన్ నెంబర్ : 80086 94894

**ప్రకటన**

**ఓపెన్ ల్యాండ్ పత్రాలు పోయినవి**

నేను గాదం రజిత, భర్త కుమారస్వామి,
వయస్సు 42 సంవత్సరాలు, వృత్తి కురగాయల వ్యాపారం,
నివాసం: పరకాల పట్టణం, హనుమకొండ జిల్లా.
తేది: 10-01-2025న పరకాలలోని శ్రీనివాస కాలనీ నుండి మమత నగర్‌కు ఇంటి సామగ్రిని తరలించే సమయంలో నాయొక్క ఓపెన్ ల్యాండ్‌కు సంబంధించిన అసలు రిజిస్ట్రేషన్ పత్రాలు పోయినవి.
సంబంధిత డాక్యుమెంట్ నంబర్ 2927/2016.
ఈ పత్రాలు ఎవరికైనా దొరికిన యెడల దయచేసి క్రింది మొబైల్ నంబర్‌కు సంప్రదించి అందజేయగలరు.
సంప్రదించవలసిన వ్యక్తి: గాదం రజిత
మొబైల్ నంబర్: 83740 97618
పత్రాలు దొరికిన వారు సహకరించగలరని వినమ్రంగా కోరుచున్నాను.
ఇట్లు: గాదం రజిత, పరకాల, హనుమకొండ జిల్లా.

## కాగజ్‌నగర్‌లో మట్కా స్థావరంపై పోలీసుల దాడి - ఐదుగురు అరెస్ట్

– వారి వద్ద నుండి 4,910 నగదుతో పాటు 5 మొబైల్ ఫోన్లు స్వాధీనం

– కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నాం టౌన్ సిఐ ప్రేమ్ కుమార్



**జూన్ 8 సిర్పూర్ (టి) నియోజకవర్గ ప్రతినిధి ప్రజాజ్యోతి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నీతిక పంత్ ఆదేశాల మేరకు కాగజ్ నగర్ డీఎస్పీ వహీదుద్దీన్ పర్యవేక్షణలో టౌన్ సీఐ ప్రేమ్ కుమార్ ఆధ్వర్యం లో కాగజ్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గాంధి చౌక్ వద్ద మట్కా జూదం నిర్వహిస్తున్న వారిపై పోలీసులు ఆకస్మికంగా దాడులు నిర్వహించి ఐదుగురిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.4,910 నగదుతో పాటు 5 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. 1. లక్ష్మణ్ (60), లారీ డ్రైవర్, నదిగూడ, కాగజ్‌నగర్ రూరల్, 2:– గులాం జిలానీ (67), కూలీ, శివాపూర్, కాగజ్‌నగర్ రూరల్

3:– పిప్రే దేవాజీ (55), లారీ డ్రైవర్, వంజిరి, కాగజ్‌నగర్ రూరల్

4:– సయ్యద్ షబీద్దీన్ (51), లారీ డ్రైవర్, కౌసర్ నగర్, కాగజ్‌నగర్

5:–సెండే సురేష్ (36), కూలీ, కౌసర్ నగర్, కాగజ్‌నగర్ లను అరెస్టు అరెస్టు చేశామని పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తు న్నారు. అక్రమ జూదం, మట్కా కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు పోలీసులు తెలిపారు. ప్రజలు ఇటువంటి చట్ట విరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని కాగజ్ నగర్ టౌన్ సిఐ ప్రేమ్ కుమార్ సూచించారు.

## పేకాట స్థావరంపై దాడి

8 మందిపై కేసు నమోదు



**జన్నారం, జూన్ 9 (ప్రజాజ్యోతి) :** పేకాట స్థావరంపై దాడి చేసి 8 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గుర్రం ఉదయ్ కిరణ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం నమ్మదగిన సమాచారం మేరకు జన్నారం మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో శివారులో ఉన్న మామిడి తోటలో డబ్బులను పందంగా పెట్టి పేకాట ఆడుతున్నారని సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. పేకాట స్థావరంపై దాడి చేయగా పేకాట ఆడుతున్న వాసాల రవి, గోనె మురళి, కోల రాజేష్, భూక్య రాజు లను అదుపులోకి తీసుకోగా, సురమల్ల ప్రకాష్, పోతుగంటి వెంకటేష్, చింతల రాజకుమార్, గంధం విజయరావు లు పరారైనట్లు తెలిపారు. పట్టుబడిన వారి వద్ద నుండి రూపాయలు 7040,4 చరవానులను, ఒక ఆటో ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

## దుమ్ము కారణంగా ఉద్యోగులు అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు

– సమస్యను నివారించేందుకు రెగ్యులర్‌గా వాటర్ స్ప్రే ఏర్పాటు చేయాలి

– ఐఎన్‌టీయూసీ సీనియర్ కేంద్ర ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్ రావు





**మంచిర్యాల, 9,జూన్ (ప్రజా జ్యోతి) :** మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియా సీఎచ్‌పీ ప్రాంతంలో దుమ్ము కాలుష్యం కారణంగా ఉద్యోగులు అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటు న్నారని, ఈ సమస్యను నివారించేందుకు రెగ్యులర్‌గా వాటర్ స్ప్రే ఏర్పాటు చేయాలని ఐఎన్‌టీయూసీ సీనియర్ కేంద్ర ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్ రావు యాజమాన్యాన్ని కోరారు. డాక్టర్ బి. జనక్ ప్రసాద్, సెక్రటరీ జనరల్, ఐఎన్‌టీయూసీ, తెలంగాణ రాష్ట్ర మినిమం వేజెస్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆదేశాల మేరకు మంగళవారం నిర్వహించిన "బాయిబాట" కార్యక్రమంలో భాగంగా జెట్టి శంకర్ రావు శ్రీరాంపూర్ ఏరియా సీఎచ్‌పీ కార్మికులను కలిసి వారి సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. అనంతరం ఉద్యోగులతో ముఖాముఖి సమావేశం నిర్వహించి వారి సమస్యలపై సంబంధిత యాజమాన్య అధికారులతో చర్చించారు. సీఎచ్‌పీ ప్రాంతంలో అధికంగా వ్యాపిస్తున్న దుమ్ము వల్ల ఉద్యోగులు శ్వాసకోశ సంబంధిత సమస్యలతో పాటు ఇతర ఆరోగ్య ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని కార్మికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన జెట్టి శంకర్ రావు దుమ్ము నియంత్రణకు వెంటనే చర్యలు చేపట్టి రెగ్యులర్‌గా వాటర్ స్ప్రే నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా బెల్ట్ ఆపరేటింగ్ మిషన్ల వద్ద పనిచేసే ఆపరేటర్ల భద్రత కోసం అదనపు సేఫ్టీ గార్డులను ఏర్పాటు చేయాలని కోరారు. ఇటీవల ఆర్కే న్యూటెక్ గనిలో సర్ఫేస్ హాలర్ ఆపరేటర్‌కు జరిగిన ప్రమాదాన్ని ప్రస్తావిస్తూ, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు భద్రతా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మిషనరీల వద్ద ప్రత్యేక రక్షణ చర్యలు, క్రమం తప్పకుండా మెయింటెనెన్స్ పనులు, అధికారుల నిరంతర పర్యవేక్షణ ద్వారా ప్రమాదాలను నివారించాలని అన్నారు. ఉద్యోగులకు తగిన తాగునీటి సౌకర్యం కల్పించడంతో పాటు కన్వేయర్ బెల్ట్‌లు, వెహికల్ ట్రాన్స్‌పోర్ట్ ప్రాంతాలు, వ్యాగన్ లోడింగ్ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు మెరుగైన భద్రతా ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై ఐఎన్‌టీయూసీ నాయకులు ఇన్‌చార్జ్ డీజీఎం చంద్రలింగంను కలిసి విన్నవించగా, ఆయన సానుకూలంగా స్పందించి అవసరమైన రక్షణ చర్యలు వెంటనే చేపట్టి కార్మికుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ఉపాధ్యక్షులు గరిగ స్వామి, పిట్ కార్యదర్శి లతీఫ్, కేంద్ర నాయకులు శనిగరపు రవి, బ్రాంచ్ నాయకులు రాగం శ్రీనివాస్, తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందాలి

– విద్యార్థులందరికీ నాణ్యమైన ఆహారం, మెరుగైన వసతులు కల్పించాలి

– జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



**నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 9, (ప్రజాజ్యోతి) :** ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులందరికీ కార్పొరేట్ స్థాయి విద్యను అందించడంతోపాటు మెరుగైన వసతులు, నాణ్యమైన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. పాఠశాలలు త్వరలో పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో మంగళవారం విద్యాశాఖ అధికారులతో కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించే విధంగా విద్యాబోధన సాగాలని సూచించారు. ఇప్పటికే మండలాలకు పాఠ్యపుస్తకాల పంపిణీ దాదాపు పూర్తయిందని తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతి ఫలితాలను మరింత మెరుగుపర్చేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు.

అన్ని విద్యాసంస్థల్లో విస్తృత స్థాయిలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి పాఠశాలలు, వసతి గృహాలు, వంటశాలలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. విద్యార్థులకు ప్రతిరోజు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని పేర్కొన్నారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తిరిగి ప్రారంభమవుతున్నందున, వసతి గృహాల్లో నిల్వ ఉన్న ఆహార పదార్థాల గడువు తేదీలను పరిశీలించి, నాసిరకం లేదా గడువు ముగిసిన సరుకులు వినియోగించకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నాణ్యమైన భోజనాన్ని అందించడంలో మెస్ కమిటీ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొంటూ, విద్యార్థులను భాగస్వామ్యం చేస్తూ భోజన ప్రమాణాలు, ఆహార పదార్థాల నాణ్యతను మెస్ కమిటీ ద్వారా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. స్టోర్ రూమ్‌లలో కూరగాయలు, ఇతర వస్తువులను సక్రమంగా భద్రపరచాలని తెలిపారు. వంట సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా చూడాలని, తప్పనిసరిగా మాస్కులు, ఏప్రాన్‌లు, తల టోపీలు ధరించాలని ఆదేశించారు. వంట పాత్రలను ఎప్పటికప్పుడు శుభ్రపరచడంతో పాటు వంటశాలల్లో మిగిలిన ఆహారం, చెత్తాచెదారాన్ని వెంటనే తొలగించి పరిశుభ్ర వాతావరణం కల్పించాలని సూచించారు. ముఖ్యంగా వర్షాకాలంలో మరింత అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించేందుకు వసతి గృహాల్లో ఏఎన్‌ఎంలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖ అధికారులు దయానంద్, అంబాజీ, శ్రీనివాస్, ఎంఈఓలు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రైతులకు నాణ్యమైన విత్తనాలనే అందించాలి







– ఎరువులు, విత్తనాలపై అధిక ధరలు వసూలు చేయరాదు

– జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 9, (ప్రజాజ్యోతి) :** రైతులకు నాణ్యమైన విత్తనాలను మాత్రమే అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. సోమవారం సాయంత్రం సోన్ మండల కేంద్రంలోని బాలకిషన్ ఫర్టిలైజర్ దుకాణాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణంలోని ఎరువులు విత్తనాల స్టాక్, క్రయ విక్రయాల రిజిస్టర్లను తనిఖీ చేశారు. రిజిస్టర్ లలోని వివరాలను ఆన్లైన్ వివరాలతో సరిపోల్చారు. క్రయవిక్రయాలకు సంబంధించిన రికార్డులన్నీ పకడ్బందీగా నమోదు చేయాలన్నారు. రికార్డుల్లో తేడాలు ఉండరాదన్నారు. పలు కంపెనీల విత్తనాల లేబుళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులకు ఎట్టి పరిస్థితుల్లో నకిలీ విత్తనాలను అమ్మరాదని హెచ్చరించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు మాత్రమే అమ్మాలని అన్నారు. రైతుల నుంచి విత్తనాలు, ఎరువులకు నిర్దేశించిన ధర కన్నా ఎక్కువ డబ్బులు వసూలు చేయరాదని చెప్పారు. రైతులు కొనుగోలు చేసిన వాటికి తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలన్నారు. ఎరువులు విత్తనాల కృత్రిమ కొరత సృష్టించినా, నకిలీవి అమ్మినా, అధిక ధరకు అమ్మినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అంతకుముందు డిసిఎంఎస్ రైతు సేవా కేంద్రాన్ని తనిఖీ చేశారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను మాత్రమే అందివ్వాలని అన్నారు. ఈ తనిఖీలలో జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్, తహసిల్దార్ సంతోష్, వ్యవసాయ, రెవెన్యూ తదితర శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# శంకుస్థాపనలకే పరిమితం, పనుల్లో శూన్యం



**కుంటాల జూన్ 09(ప్రజాజ్యోతి) :** రోడ్డు లేదు బస్సు రాదు అంటున్న గ్రామస్తులు, కుంటాల మండల కేంద్రంలోని అంబుగం గ్రామస్తులు ఆవేదన, ప్రభుత్వలు మారుతున్న అంబుగాం గ్రామనకి మాత్రం రోడ్డు సమస్య తిరిడం లేదు. ఎన్నికల ముందు నాయకులు ఎక్కడ లేని హామీలు గుప్పించి ఓట్లు దండుకునే ప్రయత్నమే తప్ప గెలిచినా తరువాత కన్నెత్తి చూసే నాథుడే లేడని వాపోయారు, కుంటాల మండలం నుండి అంబుగాం గ్రామం వరకు రహదారి కోసం ప్రజాలు పాలకులను వేడుకున్న ఫలితం శూన్యమే అని ఆవేదన వ్యక్తం చేశారు, ఇదిగో వచ్చేసింది రోడ్డు అంటూ హడావిడి చేయడం శిలా పాలకలు నిర్మించుకొని పేర్లు రాయడం, కొబ్బరి కాయలు కొట్టి శాలువ సన్మానలు చేయడానికే, అంటూన్నారు గ్రామస్తులు, పదీ సంవత్సరల పాటు అధికారంలో ఉన్నా బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ విషయాన్ని పట్టించూకొకపొగ. కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా ఐనా పనులు జరుగుతయని ఆశిస్తే ప్రజలకు తీవ్ర నిరషే మిగిలిందని చెప్పుకోవచ్చు, ప్రజా పాలన అని చెప్పుకునే ప్రభుత్వం ప్రజల సమస్యలపై దృష్టి పెట్టడంలో పూర్తి విఫలమయ్యిందని గ్రామస్తులు విమర్శిస్తు న్నారు. మండలనికి వెళ్ళాలంటే నరకయాతనే స్కూల్ విద్యార్థులు రోజు కుంటాలకు వెళ్లి రావాలి రోడ్డు లేక ఇరవై నిముషాలు ప్రయణం,రహదారి బాలేక ఒక గంట వరకు వెళ్లాల్సి వస్తుంది ఇక ద్విచక్ర వాహన దారుల పరిస్థితి మరి దారుణం రోడ్డు మొత్తం గుంతలు కంకర రాళ్లు దారి పొడవున నరక ప్రయాణమే గర్భిణీ స్త్రీలు హాస్పిటల్ వెళ్లాన్న భయంతో వెళ్లల్సిన పరిస్థితి ఊరికి అంబులెన్సు రావాలన్న ఎక్కువ సమయం పడుతుంది గ్రామంలో ఎవరికైనా అనారోగ్యం బారిన పడితే ఇక అంతే సంగతులు వ్యవస్యానికి సంబందించిన ఎరువులు, యూరియా బస్తాలు అంబుగం గ్రామానికి తరలించాలన్న ఆటో చోదకూలు రోడ్డు బాలేదు అంటూ రావడానికి ససే మీరా అంటున్నారు, ఇక వర్షకాలం మొదలయింది, ప్రయాణం అంత నరకమే రోడ్డు మధ్యలో కంకర రాళ్లురోడ్డు ఇరు వైపులా బురద మాయం ముందుగు సంగలేం వెనక్కు వెళ్ళాలేం దిక్కు తోచని స్థితిలో ద్విచక్ర వాహనలు తోసుకుంటూ వెళ్ళాల్సిందే ప్రభుత్వం అధికారులు వచ్చి శంకుస్థాపన చేయడం కొబ్బరియాలు కొట్టడం కాకుండా రహదారి నిర్మించి ఇస్తే గ్రామస్థులం అందరం మా గుండెల్లో పెట్టుకుంటాం అని ఆవేదన వ్యక్తం చేశారు.



(మా గ్రామానికి రోడ్డు వేయండి, పవర్ జైసింగ్ అంబుగం గ్రామస్తుడు)

వృత్తి రీత్య పనుల కోసం రోజు కుంటాల మండలని వెళ్లి రావాలి ప్రయాణం ప్రమాదరంగా మారింది వేసవిలో తిప్పలు పడుతు పనులకు వెళ్లే వాళ్ళం ఇప్పుడు వర్షంకాలం మొదలయ్యింది ఇక అంతే సంగతి రోడ్డు మార్గంలో బుంగలు ఏర్పడి వాహనలు నడపలన్న భయమేస్తుంది,రోడ్డు మధ్యలో కంకర రాళ్లు రోడ్డు పక్కన లోతైనా గుంతలు అధికారులు వస్తున్నారు చూస్తున్నారు కానీ ఫలితం లేదు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అప్పట్లో మా గ్రామానికి వచ్చారు రోడ్డు పరిస్థితి చూసి పనులు ప్రారంభిసస్తాం అన్నారు కానీ ఇప్పటీ వరకు ఎలాంటి పనులు జరగలేదు మాకు రహదారి నిర్మించండి.

ఎలాంటి వేతనాలు లేకుండా నీస్వార్థంగా ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ..

# శ్రమిస్తున్న వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్





– ప్రతి ఒక వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు 50% ఫీజు రాయితీ ఇవ్వాలి

– కాగజ్నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లకు వర్కింగ్ జర్నలిస్టు లతో కలిసి వినతి పత్రం సమర్పించిన టిడబ్ల్యూజేఎఫ్ జర్నలిస్ట్ యూనియన్ జిల్లా అధ్యక్షులు వద్నాల వెంకన్న

**జూన్ 8 సిర్పూర్ (టి) నియోజకవర్గ ప్రతినిధి ప్రజాజ్యోతి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి)నియో జకవర్గంలోని సిర్పూర్ కాగజ్నగర్ లో వర్కింగ్ జర్నలిస్టులతో కలిసి జర్నలిస్ట్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ,జీతాలు లేని జర్నలిస్ట్ పిల్లలకు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో 50% ఫీజు రాయితీ కల్పించాలని కాగజ్నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్ల కు వినతి పత్రం సమ ర్పించిన టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షులు వద్నాల వెంకన్న ,ఎలాంటి వేతనాలు లేకుండా, ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా నిలిచి అహర్నిశలు శ్రమిస్తున్న వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ( టిడబ్ల్యూజె ఎఫ్)కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు వద్నాల వెంకన్న డిమాండ్ చేశారు. సోమవారం సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్ల కు యూనియన్ నాయకులతో కలిసి ఆయన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా టిడబ్ల్యూ జె ఎఫ్ జిల్లా అధ్యక్షులు వద్నాల వెంకన్న మాట్లాడుతూ జిల్లాలో దాదాపు 80 శాతం మంది జర్నలిస్టులు ఎలాంటి నెలవారీ జీతాలు లేక, నిత్యావసరాల ధరలు పెరిగి తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సమాజం కోసం నిరంతరం తపించే జర్నలిస్టులు ప్రజాస్వామ్యంలో నాలుగవ స్తంభం అయినప్పటికీ కార్పొరేట్ విద్యాసంస్థల్లో వేలాది రూపాయల ఫీజులు చెల్లించలేక తమ పిల్లల చదువులను సాగించలేని దుస్థితిలో ఉన్నారన్నారు. జర్నలిస్టుల కుటుంబాల దయనీయ ఆర్థిక పరిస్థితులను మానవీయ కోణంలో పరిశీలించి, ప్రతి ఒక్క జర్నలిస్టు పిల్లలకు రాబోయే 2026–27 విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే నాటికే 50 శాతం ఫీజు రాయితీ వర్తించేలా తక్షణమే ప్రత్యేక సర్క్యులర్ జారీ చేయాలని సబ్ కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు వద్నాల వెంకన్న తో పాటు ఈర్ల సునీల్ కుమార్, ఎండి నౌషాద్, కడారి శ్రీనివాస్, రాజనర్సయ్య, సిహెచ్ తరుణ్, అన్న బోయిన రాజు, వేల్పుల ప్రదీప్, జి వెంకటేష్, రమేష్ సోనాలె, హైమద్ పాషా జర్నలిస్టులు పాల్గొన్నారు.

## ఘోర రోడ్డు ప్రమాదం

– గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి..

– ఒకరికి తీవ్ర గాయాలు!





**నేరడిగొండ, జూన్ 09 (ప్రజా జ్యోతి) :** మండలంలోని లకంపూర్ సమీపంలో 44వ జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. గుర్తుతెలియని వాహనం ఆటోను ఢీకొట్టడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు మరియు పోలీసుల వివరాల ప్రకారం.. ఉదయం 10 గంటల ప్రాంతంలో నేరడిగొండ నుండి ఇచ్చోడ వైపు ఆటో వెళ్తుండగా, లకంపూర్ వద్దకు రాగానే వెనుక నుండి వచ్చిన ఒక గుర్తుతెలియని వాహనం ఆటోను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న మాడవి శేఖ్ రావు (తండ్రి: మాణిక్ రావు, వయస్సు 35 సంవత్సరాలు) తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. కాగా, కుమారి గ్రామానికి చెందిన ఆర్.ఎం.పి డాక్టర్ దేవిదాస్ (వయస్సు 60 సంవత్సరాలు)కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని తక్షణమే చికిత్స నిమిత్తం బోథ్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే దేవిదాస్ పరిస్థితి విషమంగా ఉండటం, సిటీ స్కాన్ చేయించాల్సి రావడంతో బోథ్ వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భౌతిక కాయాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోథ్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు నేరడిగొండ ఎస్సై ఇమ్రాన్ ఖాన్ తెలిపారు.

## రైతులు ఆందోళన చేద్దకండి ధాన్యం కొనుగోలు చెపడ్తాం

కుంటాల తహసీల్దార్ ఆడే కమల్ సింగ్



**కుంటాల జూన్ 09 (ప్రజాజ్యోతి) :** తడిసిన ధాన్యం కొనుగోలు చేపడ్తం రైతులు అధైర్యపడొద్దని కుంటాల తహసీల్దార్ ఆడే కమల్ సింగ్ అన్నారు, మండల కేంద్రంమైన కుంటాలతో పటు ఆయ గ్రామలలో, మంగళవారం అర్ధరాత్రి భారీ వర్షం కూరసిన నేపథ్యంలో, తహసీల్దార్ ఆడే కమల్ సింగ్, మంగళవారం కొనుగోలు కేంద్రలను తనిఖీ చేశారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు తడిసిన దాన్యన్ని సైతం కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు కొనుగోలు వేగవంతంగ చేపట్టెందుకు చర్యలు చేపట్టమని తెలిపారు అదే విధంగా రైతులు ఇబ్బందూలు ఎదుర్కొనే అవసరం లేదని హామీ ఇచ్చారు అంతే కాకుండా మండల కేంద్రమైన కుంటాలతో పటు ఆయ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రలను ఆయన తనిఖీ చేశారు అయన వెంట రెవేన్యూ, ఐకేపీ, సోసైటీ, అధికారులు పాల్గొన్నారు.

## గ్రామ సభలో సైబర్ నేరాలు, గంజాయి సాగు విక్రయాలు, వినియోగం

– రైతులకు నకిలీ విత్తనాల విగ్రహాలపై అవగాహన కల్పించిన సిర్పూర్ కాగజ్నగర్ డిఎస్పి వహీదుద్దీన్



**జూన్ 8, సిర్పూర్ (టి) నియోజకవర్గ ప్రతినిధి ప్రజాజ్యోతి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) నియో జకవర్గంలోని పెంచికల్పేట్ మండల కేంద్రంలోని చెడ్వాయి గ్రామంలో నిర్వహించిన గ్రామ సభకు డీఎస్పీ వహీదోద్దీన్ సీఐ, కుమారస్వామి, ఎస్సై అనిల్ కుమార్ లతో కలిసి పాల్గొన్నారు. ప్రజలకు పలు ముఖ్య అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ వహీదుద్దీన్ మాట్లాడుతూ.. మైనర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు నడపరాదని, తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అలాగే సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తెలియని వ్యక్తుల ఫోన్ కాల్స్, లింకులు, ఓటీపీలు మరియు బ్యాంకు వివరా లను ఎవరితోనూ పంచు కోవద్దని హెచ్చరించారు. వాట్సాప్ గ్రూపుల్లో రాజ కీయ పార్టీలు, అపరిచిత వ్యక్తుల గురించి అనుచిత వ్యాఖ్యలు చేయడం, వివాదాస్పద పోస్టులు పెట్టడం వల్ల చట్టపరమైన సమస్యలు తలెత్తే అవకా శం ఉందని తెలిపారు. సామాజిక మాధ్యమా లను బాధ్యతాయుతంగా వినియోగించాలనిసూచిం చారు. అదే విధంగా గ్రామాల్లో గంజాయి సాగు, విక్రయాలు లేదా వినియో గం గురించి సమాచారం తెలిసిన వెంటనే పోలీసు లకు తెలియజేయాలని కోరారు. అలాగే రైతులు నకిలీ విత్తనాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని,ఎక్కడైనా నకి లీ విత్తనాల విక్రయాలు జరుగుతున్నట్లు సమాచా రం ఉంటే వెంటనే అధికా రులకు తెలియజేయాలని సూచించారు. గ్రామ ప్రజల సహకారంతో నేరాల నివారణ, శాంతిభద్రతల పరిరక్షణ మరింత సమర్థ వంతంగా సాగుతుందని తెలిపారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను అధి కారుల దృష్టికి తీసుకు వచ్చారు. ఈ కార్యక్రమం లో సీఐ కుమారస్వామి, ఎస్సై అనిల్ కుమార్, సర్పంచ్ చౌదరి శ్రీనివాస్, ఉపసర్పంచ్ నానాజీ, వార్డ్ సభ్యులు, ప్రభుత్వ అధికారులు, గ్రామ పంచాయతీ సిబ్బంది పోలీస్ సిబ్బంది, గ్రామస్తు లు పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్కూళ్లలో ప్రీ-ప్రై మరీకి కొత్త ఊపు

- నియామక ప్రక్రియను పరిశీలించిన ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్
- అప్లికేషన్ కౌంటర్లను పరిశీలించిన ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్

మహబూబ్‌నగర్, జూన్ 08 ( ప్రజా జ్యోతి బ్యూరో ) : జిల్లాలో నూతనంగా ఏర్పాటు చేయనున్న 85 ప్రీ-ప్రైమరీ పాఠశాలల కోసం చేపడుతున్న ఇన్‌స్ట్రక్టర్, ఆయాల నియామక ప్రక్రియను జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి దుంకుడు శ్రీనివాస్ పరిశీలించారు. సోమవారం ప్రాథమిక పాఠశాల వెంకటేశ్వర కాలనీలో ఏర్పాటు చేసిన



అప్లికేషన్ స్వీకరణ కౌంటర్లను ఆయన తనిఖీ చేశారు. జిల్లా వ్యాప్తంగా ఎంఆర్సీలు మరియు పాఠశాలల వద్ద దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతోందని, జూన్ 12 చివరి తేదీ అని తెలిపారు. ప్రీ-ప్రైమరీ పాఠశాలల్లో చిన్నారులకు అనుకూల వాతావరణం కల్పించేలా అన్ని సదుపాయాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల కోసం సుమారు లక్ష రూపాయల విలువైన ఇండోర్, అవుట్‌డోర్ ఆట వస్తువులు అందించడంతో పాటు బాలా పెయింటింగ్‌లతో ప్రీ-ప్రైమరీ తరగతి గదులను ఆకర్షణీయంగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. ఇన్‌స్ట్రక్టర్ల ఎంపిక ఇంటర్ మార్కుల మెరిట్ ఆధారంగా జరుగుతుందని, ప్రీ-ప్రైమరీలో రెండేళ్ల శిక్షణ పొందిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఇస్తామని వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియంతో పాటు ప్రీ-ప్రైమరీ తరగతులు నిర్వహించనున్నందున తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీలు మొగులయ్య, గీత, శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోడౌన్ ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల జూన్ 09(ప్రజా జ్యోతి): జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమీపంలో ఉన్న ఈవీఎం గోడౌన్ ను ఈవీఎంల నెలవారి సాధారణ తనిఖీలో భాగంగా మంగళవారం కలెక్టర్





రిజ్వాన్ బాషా షేక్ పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి సందర్శించారు. ఈవీఎంలు,బ్యాలెట్ యంత్రాల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు,సిబ్బందికి సూచించారు.సందర్శనలో భాగంగా తనిఖీ రిజిస్టర్ లలో కలెక్టర్ సంతకాలు చేశారు.ఈ తనిఖీలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు మంజుల, గద్వాల తహసిల్దార్ హరికృష్ణ,వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు,ఎన్నికల విభాగం సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోదాం త్రైమాసిక తనిఖీ నిర్వహించిన జిల్లా కలెక్టర్

నారాయణపేట ప్రతినిధి జూన్ 09 (ప్రజా జ్యోతి) మంగళ వారం జిల్లా కలెక్టర్ ప్రియాంక జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న ఈవీఎం గోదాంను గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో త్రైమాసిక తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా గుర్తింపు పొందిన వివిధ రాజకీయ





పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోదాం సీల్ ను పరిశీలించారు. గోదాంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరు, అగ్నిప్రమాదాల నివారణ కోసం ఏర్పాటు చేసిన ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు, ఇతర భద్రతా పరికరాలను తనిఖీ చేశారు. అత్యవసర పరిస్థితులు తలెత్తిన సందర్భంలో అనుసరించాల్సిన భద్రతా చర్యలపై సంబంధిత సిబ్బందికి సూచనలు జారీ చేశారు. గోదాం వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తు, భద్రతా రిజిస్టర్లు, సందర్శకుల నమోదు పుస్తకాలను పరిశీలించారు. ఈవీఎంల భద్రత విషయంలో ఎటువంటి అలసత్వం ప్రదర్శించరాదని భద్రతా సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...
భారత ఎన్నికల సంఘం ఆదేశాలు, మార్గదర్శకాల మేరకు ఈవీఎంలు, వీవీప్యాట్ల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను నిర్ధారించేందుకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోదాం తనిఖీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈవీఎంల భద్రత విషయంలో ఎటువంటి రాజీ లేకుండా 24 గంటలు భద్రతా ప్రమాణాలను పకడ్బందీగా అమలు చేస్తున్నామని, గోదాంలోని భద్రతా ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు.
ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ జయ సుధ, తహసీల్దార్ అమరేంద్ర కృష్ణ, మున్సిపల్ కమిషనర్ శంకర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రాల్లో ఆహార పరిశుభ్రతకు ప్రాధాన్యం

- పిల్లలకు చిన్నప్పటి నుంచే పరిశుభ్రత అలవాట్లు నేర్పాలి
- కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి ప్రతినిధి, జూన్ 9 (ప్రజాజ్యోతి): అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు తీసుకునే ఆహారం విషయంలో ఎలాంటి కలుషితానికి తావు లేకుండా పరిశుభ్రత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మంగళవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రపంచ ఆహార భద్రత శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అంగన్వాడీ కేంద్రాల్లో వంట చేసే ఆయాలు పరిశుభ్రంగా ఉండటంతో పాటు చేతులు శుభ్రంగా కడుక్కొని ఆహార పదార్థాలు, వంట సామగ్రిని ఉపయోగించాలని సూచించారు. కూరగాయలను బాగా కడిగి వాడటం, పాత్రలను సబ్బుతో శుభ్రపరిచి వేడి నీటితో కడగడం, నిల్వ గదుల్లో తగిన గాలి, వెలుతురు ఉండేలా చూడాలని తెలిపారు. సరిగా ఉడకని ఆహారం, ముఖ్యంగా మాంసాహార పదార్థాలు గర్భిణులు తీసుకుంటే తల్లి, గర్భస్థ శిశువు



ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. చిన్నారులకు చిన్నప్పటి నుంచే చేతులు శుభ్రంగా కడుక్కోవడం వంటి పరిశుభ్రత అలవాట్లపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆహార భద్రత, పరిశుభ్రత అంశాలపై శిక్షకుడు నవీన్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సుధారాణి, జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ కరుణాకర్, డీసీపీఓ రాంబాబు, సీడీపీఓలు, సూపర్వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## అర్హులైన రైతులు, విద్యార్థులకు రుణాల మంజూరులో చొరవ చూపాలి

- జిల్లాకు రూ.5,990 కోట్ల వార్షిక రుణ ప్రణాళిక విడుదల
- వ్యవసాయం, స్వయం ఉపాధి, ఎంఎస్‌ఎంఈలకు విస్తృతంగా రుణాలు: కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి ప్రతినిధి, జూన్ 9 (ప్రజాజ్యోతి): రైతులు, విద్యార్థులు, ఎంఎస్ఎంఈ యూనిట్లు, స్వయం ఉపాధి లబ్ధిదారులకు రుణాల



మంజూరులో బ్యాంకులు మరింత చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ (డీసీసీ), డిస్ట్రిక్ట్ లెవల్ రివ్యూ కమిటీ (డీఎల్ఆర్సీ) సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రూ.5,990 కోట్ల జిల్లా వార్షిక రుణ ప్రణాళిక పుస్తకాన్ని కలెక్టర్ విడుదల చేశారు. సిబిల్ స్కోర్‌ను మాత్రమే ప్రాతిపదికగా తీసుకుని అర్హులైన రైతులు, విద్యార్థులు, స్వయం ఉపాధి లబ్ధిదారుల రుణ దరఖాస్తులను తిరస్కరించవద్దని బ్యాంకర్లకు సూచించారు. ప్రభుత్వ పథకాల కింద రుణాల మంజూరులో వెనుకబడిన బ్యాంకులు తమ పనితీరును మెరుగుపరచుకోవాలని ఆదేశించారు. ప్రధానమంత్రి విశ్వకర్మ, ముద్ర, స్వనిధి, ఉపాధి కల్పన పథకాల కింద అర్హులైన లబ్ధిదారులకు నిర్ణీత గడువులో రుణాలు అందించాలని కోరారు. విద్యా రుణాల మంజూరులో ఆలస్యం చేయకుండా ఉన్నత విద్య, విదేశీ విద్య కోసం అవసరమైన రుణాలను పరిశీలించాలని సూచించారు. స్వయం సహాయక సంఘాలకు లక్ష్యాలకు మించి రుణాలు మంజూరు చేసిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూకో బ్యాంక్ ప్రతినిధులను కలెక్టర్ అభినందించి మెమెంటోలు అందజేశారు. గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ప్లంబింగ్,
కుకింగ్, ఏసీ రిపేర్ వంటి డిమాండ్ ఉన్న కోర్సులను ప్రవేశపెట్టాలని సూచించారు. లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ శివకుమార్ మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంలో రూ.5,339 కోట్ల లక్ష్యానికి గాను రూ.4,943 కోట్ల రుణాలు మంజూరు చేసి 92.58 శాతం లక్ష్యాన్ని సాధించినట్లు తెలిపారు.
సమావేశంలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, ఆర్బీఐ, నాబార్డ్, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## గిరిజన యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ

- ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి : జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి ఛత్రు నాయక్

మహబూబ్‌నగర్, జూన్ 09 ( ప్రజా జ్యోతి బ్యూరో ) : గిరిజన యువతి, యువకులకు నైపుణ్యాభివృద్ధి ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి ఛత్రు నాయక్ తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ట్రైకార్ ద్వారా నిర్వహిస్తున్న నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పన కార్యక్రమాలపై అవగాహన కల్పించే ఉద్దేశంతో మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టరేట్‌లో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఛత్రు నాయక్ మాట్లాడుతూ గిరిజన యువతకు ప్రభుత్వం ఉచిత నైపుణ్య శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తోందని తెలిపారు. యువతలో నైపుణ్యాలను పెంపొందించి ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో లభించే ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకునేలా చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉద్యోగ అవకాశాలు పొందాలంటే సాంకేతిక పరిజ్ఞానం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసం, వృత్తిపరమైన శిక్షణ ఎంతో అవసరమని అన్నారు. గిరిజన యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని సూచించారు.
కార్యక్రమంలో పాల్గొన్న యువతి, యువకులకు నిపుణులైన కౌన్సెలర్లు రవి శంకర్, పి.రాం బాబు, నేహా డాలీ మోటివేషన్ శిక్షణ అందించారు.
ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత వసతి, భోజన సదుపాయాలతో పాటు వివిధ ట్రేడ్లలో అందించే నైపుణ్య శిక్షణలు, వాటి ద్వారా లభించే ఉద్యోగ అవకాశాలపై వివరించారు. ఎస్ఎస్సీ, ఇంటర్మీడియట్, డిగ్రీ పూర్తి చేసిన 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు గల నిరుద్యోగ గిరిజన యువతి, యువకులకు హైదరాబాద్‌లోని మెగా స్కిల్ సెంటర్‌లో మూడు నుంచి ఆరు నెలలపాటు శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజన సదుపాయాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు.





డొమైన్, నాన్-డొమైన్ అంశాల్లో శిక్షణ అందించబడుతుందని తెలిపారు. టూరిజం, హోటల్ మేనేజ్‌మెంట్, బ్యూటీషియన్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ వంటి కోర్సులతో పాటు సాఫ్ట్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్, కమ్యూనికేషన్ స్కిల్స్, ప్రాథమిక కంప్యూటర్ నైపుణ్యాల్లో కూడా శిక్షణ అందించనున్నట్లు వివరించారు.
ఈ కార్యక్రమంలో డీఆర్వో నిర్మల, కౌన్సిలింగ్ నిపుణులు, డీటిడివో అధికారులు, గిరిజన యువతి, యువకులు పాల్గొన్నారు.

## భరోసా సెంటర్ సేవల మెరుగుదలకు అన్ని శాఖల సమన్వయం అవసరం: న్యాయమూర్తులు,ఎస్పీ

గద్వాల జూన్ 9(ప్రజా జ్యోతి ప్రతినిధి): మహిళలు,చిన్నారులు,ఇతర బాధితులకు భరోసా సెంటర్ ద్వారా అందించే సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని న్యాయమూర్తులు.జిల్లా ఎస్పీ సూచించారు.జోగులాంబ గద్వాల జిల్లా పోలీసు కార్యాలయంలో






నిర్వహించిన భరోసా సెంటర్ కన్వర్జెన్స్ సమావేశంలో ఫస్ట్ అదనపు జిల్లా & సెషన్స్ కోర్టు ఇన్‌చార్జ్ న్యాయమూర్తి ఎస్.రవికుమార్,ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి-కమ్-సెక్రటరీ,జిల్లా న్యాయ సేవా సంస్థ (డీఎల్ఎస్ఏ)ఎ.నాగరాజ్,జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు పాల్గొని పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా న్యాయమూర్తి ఎస్.రవికుమార్ మాట్లాడుతూ, మహిళలు,చిన్నారులు,ఇతర బాధితులకు అవసరమైన సేవలను ఒకే వేదికపై అందించడంలో భరోసా సెంటర్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు.బాధితులకు న్యాయ సహాయం,వైద్య సేవలు,కౌన్సెలింగ్,పునరావాస సేవలు సకాలంలో అందేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.న్యాయమూర్తి ఎ.నాగరాజ్ మాట్లాడుతూ,బాధితుల పట్ల సున్నితంగా వ్యవహరించి,వారికి అవసరమైన సహాయాన్ని త్వరితగతిన అందించేందుకు ప్రతి శాఖ బాధ్యతా యుతంగా వ్యవహరించాలన్నారు.కేసుల పురోగతిని నిరంతరం సమీక్షిస్తూ బాధితులకు త్వరిత న్యాయం అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు.జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ,మహిళలు,చిన్నారులపై జరిగే నేరాల కేసుల్లో వేగవంతమైన దర్యాప్తు నిర్వహించి బాధితులకు పూర్తి న్యాయం జరిగేలా పోలీసు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు.భరోసా సెంటర్ సేవలపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించడంతో పాటు,బాధితులకు అవసరమైన సహాయాన్ని అందించడంలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు.సమావేశంలో కేసుల పురోగతి, బాధితులకు అందుతున్న సేవలు,పునరావాస చర్యలు,శాఖల మధ్య సమన్వయం, ఎదురవుతున్న సమస్యలు,వాటి పరిష్కార మార్గాలపై విస్తృతంగా చర్చించారు. సేవలను మరింత మెరుగుపరిచేందుకు అవసరమైన సూచనలు,సలహాలను అధికారులు పంచుకున్నారు.ఈ సమావేశంలో డీఎస్పీ వై. మొగిలయ్య,పబ్లిక్ ప్రాసిక్యూటర్లు,చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు,జిల్లా సంక్షేమ శాఖ అధికారులు,వైద్య ఆరోగ్య శాఖ ప్రతినిధులు,జిల్లా సర్కిల్ ఇన్స్పెక్టర్లు,జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్ల ఎస్సైలు,భరోసా సెంటర్ సిబ్బంది,ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పోలీసు వాహనాల పాత విడిభాగాల వేలం విజయవంతం

- రూ.82,600కు విక్రయం - వ్యాపారుల నుంచి విశేష స్పందన

వనపర్తి, జూన్ 9 (ప్రజాజ్యోతి): జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో పోలీసు వాహనాలకు సంబంధించిన పాత టైర్లు, బ్యాటరీలు, ఇతర విడిభాగాల బహిరంగ వేలంపాట మంగళవారం విజయవంతంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ సునీతారెడ్డి, ఐపీఎస్ ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ రాజేష్ మీనా, ఐపీఎస్, వీఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి పర్యవేక్షణలో జిల్లా సాయుధ దళ పోలీసు కార్యాలయంలో వేలంపాటను పారదర్శకంగా





నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వ్యాపారులు, కొనుగోలుదారులు ఉత్సాహంగా పాల్గొని పోటాపోటీగా బిడ్లు దాఖలు చేశారు. పోలీసుశాఖ వినియోగంలో లేని పాత టైర్లు, బ్యాటరీలు, ఇతర వాహన విడిభాగాలు మొత్తం రూ.82,600కు విక్రయించబడ్డాయి. వేలంపాట ప్రక్రియను ప్రభుత్వ నిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. పాల్గొన్న వ్యాపారులు కూడా నిర్వహణ విధానంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు వాహనాల అధికారి (ఎంటీఓ) రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, పోలీసుశాఖ ఆస్తుల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనానికి ప్రాధాన్యం ఇస్తూ వేలంపాటను విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రిజర్వ్ సబ్‌ఇన్‌స్పెక్టర్లు వినోద్, మగ్దూమ్ బారి, కొనుగోలుదారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## కొత్తకోట రైస్ మిల్లులో భారీ అవకతవకలు వెలుగులోకి

- శ్రీ సాంబశివ ఆగ్రో ఇండస్ట్రీస్‌లో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు
- 2.5 కోట్ల సీఎంఆర్ ధాన్యం పక్కదారి బట్టబయలు
- సీఎంఆర్ ధాన్యం అక్రమ రవాణాపై చట్టపరమైన చర్యలు తప్పవు

వనపర్తి ప్రతినిధి, జూన్ 9 (ప్రజాజ్యోతి): వనపర్తి జిల్లా కొత్తకోట మండలం మీరాస్పల్లి గ్రామంలోని శ్రీ సాంబశివ ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్లులో రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ బృందం, హైదరాబాద్ అధికారులు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారుల ఆధ్వర్యంలో మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.



తనిఖీల సందర్భంగా 25,426 బస్తాల సీఎంఆర్ (కస్టమ్ మిల్ల్డ్ రైస్) ధాన్యం పక్కదారి పట్టినట్లు అధికారులు నిర్ధారించారు. ఈ ధాన్యం విలువ సుమారు రూ.2.5 కోట్లు ఉంటుందని వెల్లడించారు. అనంతరం అధికారుల సమక్షంలో పంచనామా నిర్వహించి, మిల్లులో మిగిలి ఉన్న ధాన్యాన్ని భద్రతా పరిరక్షణ చర్యల్లో భాగంగా ఎంఎస్ ఏకేఆర్ ఇండస్ట్రీస్, రాయినిపేట యాజమాన్యానికి అప్పగించారు. ఈ వ్యవహారానికి సంబంధించిన పూర్తి నివేదికను, మిల్లు యజమానిపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు అదనపు కలెక్టర్ కు సమర్పించినట్లు అధికారులు తెలిపారు. ఉన్నతాధికారుల తదుపరి ఆదేశాల మేరకు సంబంధిత మిల్లర్‌పై చట్టరీత్యా తగిన చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

## మల్దకల్ మండలంలో పశువులకు ఉచిత జబ్బ వాపు,గొంతువాపు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం

మల్దకల్ జూన్ 9(ప్రజా జ్యోతి): జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలంలోని పెద్దపల్లి గ్రామంలో మంగళవారం పశువులకు ఉచిత జబ్బ వాపు (బ్లాక్ క్వార్టర్), గొంతువాపు (హెమరాజిక్ సెప్టిసీమియా) వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ శిరీష రాజశేఖర్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా పాల్వాయి పశు వైద్యాధికారి డా.ఉష మాట్లాడుతూ,వర్షాకాలంలో పశువులకు ప్రధానంగా వచ్చే వ్యాధుల్లో గేదెలలో గొంతువాపు,గోజాతి పశువుల్లో జబ్బవాపు ముఖ్యమైనవని తెలిపారు.గొంతువాపు వ్యాధిని గురక



వ్యాధి అని కూడా పిలుస్తారని పేర్కొన్నారు.గొంతువాపు వ్యాధి లక్షణాలుగా 104 నుంచి 106 డిగ్రీల ఫారెన్‌హీట్ వరకు జ్వరం,కళ్ళ ఎర్రబారడం,కళ్ల నుంచి నీరు కారడం,గొంతు పైభాగం మరియు మెడ కింద వాపు రావడం,శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఎదురుకావడం వంటివి ఉంటాయని వివరించారు.జబ్బ వాపు వ్యాధి ప్రధానంగా బలంగా,ఆరోగ్యంగా ఉన్న గోజాతి పశువుల్లో ఎక్కువగా కనిపిస్తుందని తెలిపారు.ఈ వ్యాధిలో జబ్బలు,తొడ కండరాలపై వాపు కనిపిస్తుందని చెప్పారు. పశుపోషకులు ముందస్తు జాగ్రత్త చర్యగా వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని సూచించారు.సర్పంచ్ శిరీష రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ,పశువులకు వచ్చే సీజనల్ వ్యాధులపై పశు యజమానులు అప్రమత్తంగా ఉండి,వ్యాధుల బారిన పడకుండా తమ పశువులను సంరక్షించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మొత్తం 52 గోజాతి పశువులు,20 గేదెలకు టీకాలు వేశారు.కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది మధు,ఉపసర్పంచ్ లక్ష్మీనరసింహ,గ్రామ ప్రజలు,పశుపోషకులు పాల్గొన్నారు.

## ఇండియన్ ఆర్మీలో సెలక్షన్ అయిన నవదీక్షిత్ సన్మానించిన సిపిఎం నాయకులు




**బచ్చన్నపేట జూన్ 09 ప్రజా జ్యోతి :** భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ బచ్చన్నపేటమండల కమిటీ సభ్యులు నాచగోని నవదీక్షిత్ ఆర్మీలో సెలక్షన్ అయిన సందర్భంగా సన్మానం చేసిన సిపిఎం జిల్లా కార్యదర్శి మోకు కనకా రెడ్డి సిపిఎం బచ్చన్నపేటమండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేష్, పార్టీ మండల కమిటీ సభ్యులు మినాలాపురం ఎల్లయ ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి మోకు కనకా రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి సమస్యలపై అనేక ఉద్యమాలు పోరాటాలు నిర్వహించినటువంటి నాచగోని నవదీక్షిత్ ఆర్మీలో సెలెక్ట్ కావడం ప్రజల కోసం దేశం కోసం ప్రాణ త్యాగాలను సైతం లెక్కచేయకుండా తన వంతు బాధ్యతను నిర్వహిస్తారని విద్యార్థి సంఘాలలో పనిచేస్తున్నటువంటి ఇటువంటి నాయకులు దేశ సేవ కోసం ప్రజల శ్రేయస్సు కోసం పనిచేయాలని అన్నారు ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి దండగుల మురళీకృష్ణ, రవి, అఖిల్, రాజేష్, చరణ్ తేజ, శ్రీధర్,హరి, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

## డీజీపీసీ.వి.ఆనంద్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన పరుపాటి శ్రీనివాస్ రెడ్డి




**రాయపర్తి జూన్ 9 ప్రజాజ్యోతి :** ఇటీవల తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(డిజిపి)గా బాధ్యతలు స్వీకరించిన సీ.వి. ఆనంద్ ను శ్రీ రాజ రాజేశ్వర ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి మంగళవారంహైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి డీజీపీకి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు. అలాగే జ్ఞాపికను బహూకరించి, ఆయన పదవీకాలంలో తెలంగాణ పోలీసు శాఖ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. డీజీపీ సీ.వి. ఆనంద్ కూడా ఫౌండేషన్ చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలను అభినందించి, ప్రజా సేవలో మరింత ముందుకు సాగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, పార్టీ నాయకులు మరియు ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వర్గీయ బెల్లంకొండ మల్హార్ రావు 37వ వర్ధంతి.!



**మల్హార్, ప్రజాజ్యోతి, జూన్ 09 :** మండల మాజీ ఎంపిపి,మావోయిస్టుల చేతిలో హతమార్చిన ప్రజానాయకుడు స్వర్గీయ బెల్లంకొండ మల్హార్ రావు 37వ వర్ధంతి వేడుకలు మండలం కొయ్యూర్ మంగళవారం బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మాజీ జెడ్పిటిసి గొనె శ్రీనివాసరావు తోపాటు పలువురు నాయకులు మల్హార్ రావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా మాట్లాడారు నిరంతరం ప్రజల కోసం అతనే ఒక సైన్యంల పోరాడిన వ్యక్తిని, ప్రజల అవసరాల కోసం ఎవరినైనా ఎదిరిస్తానన్న నాయకుడు మల్హార్‌రావుని కొనియాడారు.మండల అభివృద్ధికి బాటలు వేసిన మహనీయుడు,మన ముందు తరాలకు ఆయన చరిత్ర గొప్ప స్ఫూర్తినివ్వాలని, ఆయన ఆకాంక్ష,ఆశయాలను ప్రతి ఒక్కరు కొనసాగించాల న్నారు. సర్పంచ్‌గా మల్హార్‌రావు మండల అభివృద్ధికి బీజం వేశారని గుర్తు చేశారు.నాగులమ్మ ఆలయం నుంచి మల్లారం తాడిచర్ల వరకు రోడ్లు నిర్మాణం కోసం అధికారులను ఎదిరించారని,జల్ జంగల్ జమీన్ అనే నినాదంతో పోరాటం చేసిన కొమురంభీం స్ఫూర్తితో మల్హార్‌రావు ఈ ప్రాంత అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని,అడవులు అడ్డంగా ఉన్నా రోడ్ల నిర్మాణం చేయించిన గొప్ప నాయకుడని కొనియాడారు.ఈ కార్యక్రమంలో మండల యూత్ అధ్యక్షుడు జాగరి హరీష్ తోపాటు బిఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు

## 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలి

**– టీడబ్ల్యూజెఏప్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుమార్ యాదవ్**



**మల్హార్, ప్రజాజ్యోతి, జూన్ 09 :** రాష్ట్రంలో పనిచేస్తున్న జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ విద్యాసంస్థల్లో 50 శాతం ఫీజు రాయితీ కల్పిం చాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు పెడరేషన్ (టీడబ్ల్యూజెఏప్) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చింతల కుమార్ యాదవ్ రాష్ట్ర విద్యాశాఖ రాష్ట్ర ఉన్నతాధికారులకు మంగళవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు ఎలాంటి వేతనాలు లేకుంటే వర్కింగ్ జర్నలిస్టులు నిత్యం ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకపోయి పరిస్కారం అయ్యేలా కృషి చేస్తున్నట్లుగా తెలిపారు. అక్రిడిటేషన్ కమిటీ మెజార్టీ సభ్యుల తీర్మానం మేరకు అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు, హెల్త్ కార్డులు, బస్ పాసులు అందజేయాలని కోరారు.

# విద్యార్థుల భవిష్యత్తు కోసం వైన్ షాపులు గ్రామానికి దూరంగా తరలించాలి

**గ్రామస్తుడు తుంగ రవిందర్**



**పర్వతగిరి, జూన్ 09 (ప్రజాజ్యోతి) :** పర్వతగిరి మండల కేంద్రంలోని బస్టాండ్, పాఠశాలల పరిసరాల్లో కొనసాగు తున్న వైన్ షాపులు, బెల్ట్ షాపులను తక్షణమే గ్రామానికి దూరంగా తరలించాలని తుంగ రవిందర్ తోపాటు గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యావేత్తలు పలువురు గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు. పాఠశాలలు పునఃప్రా రంభమవుతున్న ఈ సమయంలో విద్యార్థుల భవిష్యత్తు, వారి విద్యాభ్యాసం మరియు నైతిక విలువలను దృష్టిలో ఉంచు కుని ఈ అంశంపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొంటున్నారు. గ్రామంలోని ప్రధాన కూడళ్లు, బస్టాండ్, విద్యాసంస్థల సమీపంలో మద్యం విక్రయ కేంద్రాలు ఉండటం వల్ల విద్యార్థులు, యువతపై ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. ముఖ్యంగా పాఠశాలలకు వెళ్లే చిన్నారులు ప్రతిరోజూ మద్యం దుకాణాల వద్ద గుమిగూడే వాతావరణాన్ని చూడాల్సి రావడం సమాజానికి శ్రేయస్కరం కాదని గ్రామస్తులు భావిస్తున్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి ... ప్రతి ఒక్కరి బాధ్యత. అందుకే గ్రామ పరిధికి కనీస దూరంలో మద్యం విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయాలని, అలాగే అక్రమంగా కొనసాగుతున్న బెల్ట్ షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. గ్రామాభివృద్ధి అంటే కేవలం రహదారులు, భవనాలు నిర్మించడం మాత్రమే కాదు. యువతను సన్మార్గంలో నడిపించడం, విద్యార్థులకు ఆరోగ్యకరమైన సామాజిక వాతావరణాన్ని కల్పించడం కూడా అంతే ముఖ్యమైన అంశం. భవిష్యత్ తరాల శ్రేయస్సు కోసం గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు సమిష్టిగా ఆలోచించి తగిన నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉంది. నేటి విద్యార్థులే రేపటి భారత పౌరులు. వారి భవిష్యత్తును కాపాడటం మన అందరి సామాజిక బాధ్యత. విద్యకు ప్రాధాన్యతనిస్తూ, మద్యం ప్రభావం లేని ఆరోగ్యకరమైన గ్రామ వాతావరణం కోసం అందరూ కలిసి కృషి చేయాలి అని గ్రామస్తులు పిలుపునిచ్చారు.

# ప్రతి పాఠశాలలో 10 శాతం విద్యార్థుల ప్రవేశాల పెరుగుదల సాధించాలి







**– జీరో పాఠశాలల్లో విద్యార్థుల నమోదుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలి**

**– 12 మంది నుంచి 120 మందికి పెరిగిన చిన్న బోయినపల్లి పాఠశాల నమోదు ఆదర్శనీయం**

**– పాఠశాలల పునః ప్రారంభానికి ముందే అన్ని సౌకర్యాలు సిద్ధం చేయాలి**

**– ములుగు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవ రావు**

**ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజాజ్యోతి) :** ప్రతి పాఠశాలలో 10 శాతం విద్యార్థుల ప్రవేశాల పెరుగుదల సాధించాలని, జీరో విద్యార్థుల పాఠశాలల్లో విద్యార్థుల నమోదుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని,12 మంది విద్యార్థుల నుండి 120 మంది విద్యార్థులకు పెరిగిన చిన్నబోయినపల్లి పాఠశాల నమోదు ఆదర్శనీయమని, పాఠశాలలపునఃప్రారంభానికి ముందే అన్ని సౌకర్యాలు సిద్ధం చేయాలి జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవ రావు అధికారులను ఆదేశించారు. 2026-27 విద్యాసంవత్సరంలో విద్యార్థుల నమోదు పెంపు, విద్యా నాణ్యత మెరుగుదల, ఎఫ్ఎల్ఎన్ మిషన్,ఎఫ్ఆర్ ఎస్.హాజరు, బడిబాట కార్యక్రమం నిర్వహణ, పాఠశాలల పునఃప్రారంభ ఏర్పాట్లపై మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవ రావు పాఠశాల, ఇంటర్, డిగ్రీ విద్యాశాఖ అధికారులతో సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా లోని ప్రతి పాఠశాలలో 10 శాతం మేర విద్యార్థుల ప్రవేశాలు పెరిగేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు.ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య,మెరుగైన సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేస్తూ బడిబాట కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించాలని సూచించారు.జిల్లాలోని జీరో పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించి విద్యార్థుల నమోదుకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల వారీగా పాఠశాల వయస్సు పిల్లలను గుర్తించి వారందరినీ పాఠశాలల్లో చేర్పించేందుకు ఉపాధ్యాయులు,విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతి నిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మండలాల వారీగా పాఠశాలల్లో ఉన్న విద్యార్థుల సంఖ్య,కొత్తగా నమోదైన విద్యార్థుల వివరాలు,బడి బాట కార్యక్రమం పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు.ప్రవేశాల పెంపు కోసం ప్రతి పాఠశాల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించు కోవాలని తెలిపారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గ దర్శకాలను ప్రతి పాఠశాలలో తప్పనిసరిగా అమలు చేయాలని,విద్యా ప్రమాణాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ మిషన్‌ను సమర్థ వంతంగా అమలు చేసి విద్యార్థుల్లో ప్రాథమిక చదవడం,రాయడం,గణిత నైపుణ్యాలను పెంపొందిం చాలని సూచించారు.జిల్లా లోని ప్రతి పాఠశాలను విద్యా శాఖ అధికారులు క్రమం తప్పకుండాపర్యవేక్షించాలని, బోధన,హాజరు,మౌళిక సదుపాయాల పరిస్థితిని సమీక్షించాలని ఆదేశించారు. ఉపాధ్యాయులు విధుల నిర్వహణలో సమయపాలన పాటించాలని,నిర్లక్ష్యం వహించిన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.పాఠశాలలు పునఃప్రారంభం అయ్యేలోపు తాగునీరు,మరుగుదొడ్లు, పారిశుద్ధ్యం,శానిటేషన్, విద్యుత్,ఫర్నిచర్,పరిశు భ్రత తదితర అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. విద్యార్థులకు సురక్షితమైన, పరిశుభ్రమైన విద్యా వాతావరణం కల్పించాలని అన్నారు.చిన్నబోయినపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను 12 మంది నుండి 120 మందికి పైగా పెంచడంలో విశేష కృషి చేసిన కానిస్టేబుల్ ధూపాటి సతీష్,గ్రామసర్పంచ్‌ను జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించి నమోదు సంఖ్యను గణనీయంగా పెంచడం అభినంద నీయమని పేర్కొన్నారు.వారి కృషి జిల్లాలోని ఇతర పాఠశాలలకు ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు. విద్యార్థుల నమోదు పెంపు, విద్యానాణ్యత అభివృద్ధి, పాఠశాలల సమగ్రఅభివృద్ధికి ప్రతి అధికారి బాధ్యతా యుతంగా పనిచేయా లని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా పాఠశాల విద్యాశాఖ అధికారి సిద్ధార్థ రెడ్డి,ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కొప్పుల మల్లేశం, డిఎంహెచ్ఓ గోపాలరావు, మున్సిపల్ కమిషనర్ సంపత్, డిఐఈఓ,అన్ని మండలాల ఎం ఈఓలు, ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అటవీ శాఖ, జనగామ జిల్లా ఆధ్వర్యంలో

# రఘునాథపల్లి దొడ్డిగుట్టపై ట్రెక్కింగ్





**రఘునాథపల్లి, జూన్ 9 (ప్రజాజ్యోతి) :** 99 రోజుల ప్రజాపాలన ప్రగతి కార్యక్రమంలో భాగంగా అటవీ శాఖ, జనగామ జిల్లా ఆధ్వర్యంలో రఘునాథ పల్లి మండలంలోని దొడ్డిగుట్టపై ట్రెక్కింగ్ కార్యక్రమం ఘనంగా నిర్వహించ బడింది. ప్రకృతి పరిరక్షణ, పర్యావరణ అవగాహన పెంపొందించడం మరియు యువతలో ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో రఘునాథపల్లి గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, గ్రామ పెద్దలు, గ్రామస్తులు, ప్రకృతి ప్రేమికులు, ఔత్సాహిక యువకులు మరియు అటవీ శాఖ అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దొడ్డిగుట్ట పరిసర ప్రాంతాల్లోని సహజసిద్ధమైన ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ పాల్గొన్నవారు ట్రెక్కింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బొల్లం ఉమారాణి మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, చెట్లను నరికివేయకుండా వాటిని సంరక్షించాల్సిన అవసరం ఉందని తెలిపారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంర క్షించాలని సూచించారు. గ్రామంలో ఇలాంటి ప్రకృతి, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ భాస్కర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి కార్యక్రమంలో భాగంగా ఈ ట్రెక్కింగ్ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. ప్రకృతికి దగ్గరగా ఉండటం వల్ల మానసిక ప్రశాంతతతో పాటు శారీరక ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. అడవులు, వన్యప్రాణులు మరియు సహజ వనరుల పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని వివరించారు. అనంతరం పాల్గొన్న వారికి పర్యావరణ పరిరక్షణ, అటవీ సంపద సంరక్షణ, జీవవైవిధ్య ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ప్రకృతిని ప్రేమించడం, అడవులను కాపాడడం ద్వారా పర్యావరణ సమతుల్యతను పరిరక్షించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్లు రమేష్, జావేద్ హుస్సేన్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ శోభారాణి, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు అంజయ్య, రమేష్ నాయక్, రవి, ధర్మరాజు అటవీ శాఖ సిబ్బంది, గ్రామస్తులు మరియు ప్రకృతి ప్రేమికులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై మరింత అవగాహన పెంపొందించడంతో పాటు ప్రకృతితో మమేకమయ్యే అవకాశాలు కల్పించబడుతున్నాయి.

# ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం

**– సందర్శించిన డిఎంహెచ్ఓ గోపాల్ రావు**





**ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజాజ్యోతి) :** ములుగు జిల్లా కేంద్రంలోని జనరల్ హాస్పిటల్ లో జరుగుతున్న ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం -10 సంవత్సరాల ఉత్సవాల సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాల్ రావు మంగళవారం సందర్శించారు.ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాల్ రావు మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం 10 ఏళ్ళలో నిపుణులైన డాక్టర్లతో నాణ్య మైన వైద్య సేవలతో,గర్భిణీ స్త్రీ నుండి ప్రసవం వరకు సేవలు అందించడంతో మాతృత్వ మరణాల నిష్పత్తిలో 43 పాయింట్లు తగ్గుదల జరిగిందని,ఈ 10 సంవత్సరాలలో 7.5 కోట్లకు పైగా గర్భిణులకు ప్రసూతి పూర్వ వైద్య పరీక్షలు పొందారని, 1.2 కోట్ల అధిక ప్రమాద గర్భధారణలను గుర్తించి మెరుగైన వైద్య సేవలు అందించామని తెలిపారు. ఆరోగ్యకరమైన, బలమైన తల్లులు-శక్తివంత మైన భారతదేశం అనే నినాదంతో ఈ సంవత్సరం కార్యక్రమం జరుగుతుందని, ఈకార్యక్రమం పట్ల గ్రామాల్లో ఆరోగ్య కార్యకర్తలు,ఆశా కార్యకర్తలతో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.గర్భధారణ అయిన 12 వారాల లోపే నమోదు చేసుకొని రెండవ, మూడవ ట్రైమిస్టర్ల వైద్య సేవలో నిపుణులైన డాక్టర్లతో వైద్య పరీక్షలను నిర్వహించి, వారికి అల్ట్రాసౌండ్ పరీక్షలు అధిక ప్రమాద గర్భధారణ గుర్తించి హై రిస్క్ గర్భిణీల వ్యక్తిగత పర్యవేక్షణ సురక్షిత ప్రసవం వరకు ఆరోగ్య కార్యకర్తలతో ఆశా కార్యకర్తలతో ఫాలోఅప్ చేస్తున్నామని,ప్రసవ సమయంలో గర్భిణీ స్త్రీలకు రవాణా సౌకర్యాన్ని కల్పించి సురక్షిత ప్రసవం అయ్యేటట్లు చూస్తున్నామని డిఎంఅండ్ హెచ్ఓ తెలిపారు.జిల్లా తల్లి ఆరోగ్యం,పోషకాహార ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ..ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం ప్రతి నెల 9న అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు,సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రులలో నిర్వహిస్తున్నామని, గర్భిణీ స్త్రీలు నమోదైన వెంటనే వారికి అవసరమైన అన్ని రకాల రక్త,మూత్ర పరీక్షలు నిర్వహించి వారికి ఐఎఫ్ఏ మాత్రలు, కాల్షియం సప్లమెంటరీ మందులు పంపిణీ చేసి వారికి టీటీ టికాను ఇచ్చి వారికి పోషకాహారం, సమతుల్య ఆహారం, కుటుంబ నియంత్రణపై ఆరోగ్య కార్యకర్తలు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంపై విస్తృతంగా గ్రామాలలో ఆరోగ్య సిబ్బందితో కార్యక్రమాలు నిర్వహించుటకు ప్రణాళికలను తయారు చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ మెటర్నటీ డాక్టర్లు డాక్టర్ శ్వేత,డాక్టర్ నీత,డాక్టర్ మలిహ,ఆర్ఎం ఓ ప్రేమ్ సింగ్,జిల్లా మాస్ మీడియా ఆఫీసర్ సంపత్ ఆరోగ్య కార్యకర్త రవీందర్, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణీల ఆరోగ్యమే లక్ష్యం

**: డాక్టర్ రుబీనా**



**భీమదేవరపల్లి జూన్ 09 (ప్రజా జ్యోతి) :** ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ 10వ వార్షికోత్సవం సంద ర్భంగా మండలంలోని వంగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం గర్భిణీలకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహిం చినట్లు వైద్యాధికారి డాక్టర్ రుబీనా తెలిపారు. ఈ సంద ర్భంగా రక్తపరీక్షలు, రక్తపోటు, బరువు తదితర పరీక్షలు నిర్వహించి అధిక ప్రమాద గర్భిణీలను గుర్తించారు. రక్తహీ నత ఉన్న గర్భిణీలకు ఐరన్ సుక్రోస్ ఇంజెక్షన్లు అందజే శారు. గర్భధారణ సమయంలో ప్రసూతి పూర్వ పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని, సమతుల్య పోషకాహారం తీసుకోవడంతో పాటు ప్రమాద సూచనలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని డాక్టర్ రుబీనా సూచించారు. అనంతరం గర్భిణీలకు పండ్లు పంపిణీ చేసి తల్లి-శిశు ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పర్యవేక్ష కురాలు వాణి, నర్సింగ్ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

## 14వ వార్డు డ్రైనేజీ సమస్యల పరిష్కారానికై వినతి

**వర్షాకాలానికి ముందే పనులు పూర్తి చేస్తామని కమిషనర్ హామీ**



**పరకాల, జూన్ 09, (ప్రజాజ్యోతి) :** పరకాల మున్సి పాలిటీ పరిధిలోని 14వ వార్డులో నెలకొన్న డ్రైనేజీ సమస్య లను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ వార్డు కౌన్సిలర్ కొక్కిరాల దీప్తి రాకేష్‌రావు మున్సిపల్ కమిషనర్ పోతరాజు పవన్‌కు వినతిపత్రం సమర్పించారు. వార్డులో పలు వీధుల్లో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక మురుగునీరు రోడ్లపైకి చేరుతోందని, రానున్న వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని ఆమె వివరించారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ కాకుండా ముందస్తు చర్యలు చేపట్టడంతో పాటు మురుగు కాల్వలకు అవసరమైన మరమ్మతులు చేపట్టాలని కోరారు. సమస్యలపై కమిషనర్ సానుకూలంగా స్పందించి వర్షాకాలం ప్రారంభానికి ముందే యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పాడి భగవాన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఇంగిలి వీరేష్‌రావు, నాగరాజు, కృపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అడవి ముత్తారం నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన రమేష్




**మహాముత్తారం జూన్ 09 ప్రజాజ్యోతి :** మహాముత్తారం నూతన ఎస్సైగా గొర్ల రమేష్ మంగళవారం బాధ్యతలు స్వీక రించారు. భూపాలపల్లి ఎస్సైగా విధులు నిర్వహించిన ఆయన జిల్లాలో ఎస్ఐల బదిలీల్లో భాగంగా అడవి ముత్తారం ఎస్సైగా బదిలీ అయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో ప్రతి ఒక్కరూ శాంతి భద్రతలకు సహకరించాలని పేర్కొన్నారు. వారికి పలువురు స్వాగతం పలుకుతూ శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఇందిరమ్మ ఇల్లు రాలేదని కాంగ్రెస్ పార్టీ కార్యకర్త ఆవేదన



**మహాముత్తారం జూన్ 09 ప్రజాజ్యోతి :** మహాముత్తారం మండలం వజినపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త మొగిలి రాజబాపుకు ఇందిరమ్మ ఇల్లు రాకపోవడంతో కుటుంబం బోరున విలపించింది. మొదటి లిస్టులో పేరు ఉండి ఫైనల్ లిస్టులో తొలగించారని, ముగ్గురు ఆడపిల్లలు ఉండి, ఒక చేయి మిషన్‌లో పడి కట్ అయినా పట్టించుకో లేదని ఆవేదన వ్యక్తం చేశారు. భారీ వర్షాలు, గాలులకు పూరి గుడిసెలో పరదాలు కట్టుకొని జీవిస్తున్నామని వాపో యారు. ఇల్లు ఉన్న కాంగ్రెస్ లీడర్లకే మళ్లీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, పేదవాడినైన తనకు లీడర్లే అడ్డుపడ్డారని రాజబాపు ఆరోపించారు. ప్రభుత్వం ఆదుకొని ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

# స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై అవగాహన సమావేశం

మోత్కూరు, జూన్ 9 (ప్రజా జ్యోతి): మండలంలోని పాటిమట్ల చౌరస్తా లో మంగళవారం నిర్వహించిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ అవగాహన సమావేశంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు మేడబోయిన యాదగిరి పాల్గొని మాట్లాడారు. భారత ఎన్నికల సంఘం ప్రతి 20 సంవత్సరాలకు ఒకసారి చేపడుతున్న సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో బి ఎల్ ఏ-2లు చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.



అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించే లక్ష్యంతో బి ఎల్ ఓ లతో సమన్వయం చేసుకుంటూ ఇంటింటికి వెళ్లి ఓటర్లకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. అలాగే మరణించిన వారి పేర్లు, ద్వంద్వ (డబుల్) నమోదులు ఉన్న ఓట్లను గుర్తించి తొలగించే ప్రక్రియలో భాగస్వాములు కావాలని కోరారు. ఓటరు జాబితాపై ఏవైనా అభ్యంతరాలు లేదా ఫిర్యాదులు ఉంటే సంబంధిత ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ ఈ ఆర్ ఓ లేదా అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఏ ఈ ఆర్ ఓ)లకు తెలియజేయవచ్చని వివరించారు. అదే విధంగా, ఒక పోలింగ్ బూత్‌లో ఓటర్ల సంఖ్య 1200 దాటినట్లయితే, ఓటర్ల సౌకర్యార్థం కొత్త పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రతిపాదించవచ్చని తెలిపారు. బి ఎల్ ఓ లతో సమన్వయంగా పనిచేస్తూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ఖచ్చితమైన, పారదర్శకమైన, సమగ్ర ఓటరు జాబితా తయారీనే లక్ష్యంగా చేసుకొని పని చేయాలని మేడబోయిన యాదగిరి పేర్కొన్నారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు గుదే మధుసూదన్ యాదవ్, మండల ఉపాధ్యక్షులు రాధారపు మల్లేశం, గుంటి సతీష్, నార్సింగ్ మహేష్, బండ నరసింహ, ఇట్టబోయిన ఆంజనేయులు, నాయిని ఉపేందర్, బత్తిని సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## పెంచిన ఎరువుల ధరలను తగ్గించాలి

మోత్కూరు, జూన్ 9 (ప్రజా జ్యోతి): మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలోని కెఆర్ భవన్ లో మోత్కూర్ మండల రైతు సంఘం నాల్గవ మహాసభ మొగుళ్ళ తిరుపతిరెడ్డి అధ్యక్షతన మంగళవారం జరిగినది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా రైతు సంఘం కార్యదర్శి జక్క దయాకర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ




పెంచిన ఎరువుల ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా రైతులకు సకాలంలో రైతు బంధు అందించాలని, రెండు లక్షల రుణమాఫీ ఏక కాలంలో మాఫీ చేయాలని, మార్కెట్లో ఉన్న వడ్లను తక్షణమే ఎగుమతి చేయాలని, వర్షా కాలం సీజన్ వస్తున్న తరుణంలో రైతులందరి ధాన్యం కొనుగోలు చేయాలని, సకాలంలో బిల్లులు చెల్లించాలని కోరారు. ఇటీవల పెంచిన మద్దతు ధరలను పున: పరిశీలించాలని, స్వామినాథన్ కమిషన్ సిఫారసు మేరకు మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి అనేపు వెంకట్, సహాయ కార్యదర్శి పులకరం మల్లేష్ పాల్గొన్నారు. తదనంతరం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా మొగుళ్ల తిరుపతిరెడ్డి, ఉపాధ్యక్షులు పైల సత్తిరెడ్డి, ప్రధాన కార్యదర్శి దొండ ఎల్లయ్య, సహాయ కార్యదర్శి కొడమంచి వీరస్వామి, కోశాధికారి కొమ్ము రాములు, కళ్లెం నరసయ్య, కొల్లు లక్ష్మయ్య, ఎర్రబాబు, బుష్పాక అంజయ్య, కట్కూరి జగన్మోహన్ రెడ్డి, మదూరి సోమిరెడ్డి, పంగ శ్రీహరి, నిల్గొండ అశోకు తదితరులను ఎన్నుకోవడం జరిగింది.

## సామాన్య ప్రజల మద్దతు కోల్పోయిన బిజెపి ప్రభుత్వం

### ఎన్నేళ్లు పరిపాలించిన పేదలకు అన్యాయమే

### సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు

హుజూర్ నగర్ జూన్ 09 (ప్రజా జ్యోతి): కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఎన్నేళ్లు పరిపాలించిన కార్పొరేట్ శక్తులకే మేలు



జరుగుతుందని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు.బుధవారం సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ లో నేడు జరిగే కలెక్టరేట్ ఆందోళన కార్యక్రమ కరపత్రాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సిపిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పెంచిన పెట్రోల్ డీజిల్ వంట గ్యాస్,ఎరువుల ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు.కేంద్రంలో పేద ప్రజల సమస్యలను పట్టించుకోని ప్రభుత్వం అధికారంలో ఉండేందుకు సామాన్య ప్రజలా మద్దతు లేదన్నారు.కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యల్లావుల రాములు,పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు,నాయకులు యల్లావుల రమేష్,మామిడి వెంకయ్య,ఇందిరాల వెంకటేశ్వర్లు, జక్కుల రమేష్,జడ వెంకన్న, జక్కుల రమణ తదితరులు పాల్గొన్నారు.

# మెదడులో అరుదైన కొలాయిడ్ సిస్టును విజయవంతంగా తొలగించిన మలక్ పేట యశోద వైద్యులు

**ఆరోగ్యంగా ఇంటికి చేరిన మహిళ**

**అత్యాధునిక వైద్యంతో అరుదైన వ్యాధిపై విజయం సాధించిన మలక్ పేట యశోద ఆసుపత్రి**

**వివరాలు వెల్లడించిన వైద్యులు**

తుంగతుర్తి, జూన్ 9,(ప్రజా జ్యోతి): మెదడులో అత్యంత అరుదుగా కనిపించే కొలాయిడ్ సిస్టు తో బాధపడుతున్న మద్దిరాల మండల పరిధిలోని రెడ్డిగూడెం గ్రామానికి చెందిన అంకటి విజయ (46) కు మలక్ పేట వాంతులు, తల తిరగడం వంటి సమస్యలు తలెత్తినట్లు వైద్యులు తెలిపారు.

సదరు మహిళ కొంతకాలంగా తీవ్ర తలనొప్పితో బాధపడుతుండగా వైద్య పరీక్షల్లో మెదడులో కొలాయిడ్ సిస్టు ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. అనంతరం న్యూరో సర్జరీ నిపుణుల బృందం ఎండోస్కోపిక్ విధానంలో శస్త్రచికిత్స చేసి సిస్టును పూర్తిగా తొలగించినట్లు తెలిపారు.ఈ ప్రక్రియతో మెదడులోని ద్రవ ప్రవాహం సాధారణ స్థితికి చేరిందని వైద్యులు వెల్లడించారు. కొలాయిడ్ సిస్టులు అరుదుగా కనిపించినప్పటికీ, చికిత్స ఆలస్యమైతే ప్రాణాపాయం కలిగించే అవకాశముంటుందన్నారు. తలనొప్పి, చూపు మందగించడం, జ్ఞాపకశక్తి సమస్యలు, నడకలో అసమతుల్యత వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే నిపుణులను సంప్రదించాలని సూచించారు. రోగి




యశోద ఆసుపత్రి వైద్యులు అత్యాధునిక ఎండోస్కోపిక్ శస్త్రచికిత్స నిర్వహించి కొత్త జీవితం ప్రసాదించారు. మంగళవారం మండల కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో మలక్ పేట యశోద సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సీనియర్ కన్సల్టెంట్ న్యూరో సర్జన్ డాక్టర్ శ్రీనివాస్ బోట్ల, న్యూరో ఫిజీషియన్ డాక్టర్ సూరిశెట్టి భరత్ కుమార్ విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు.మెదడు మధ్య భాగంలో ఏర్పడిన ఈ సిస్టు కారణంగా సెరెబ్రో స్పైనల్ ఫ్లూయిడ్ ప్రవాహానికి ఆటంకం ఏర్పడి, తీవ్రమైన తలనొప్పి, ప్రస్తుతం పూర్తిగా కోలుకుని సాధారణ జీవితాన్ని కొనసాగిస్తున్నట్లు యశోద ఆసుపత్రి వైద్య బృందం తెలిపారు. యశోద సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ప్రపంచ స్థాయిలో న్యూరో మరియు న్యూరో సర్జరీ సేవలను అత్యాధునిక సదుపాయాలతో అందిస్తున్నామని తెలిపారు. క్లిష్టమైన నాడీ సంబంధిత వ్యాధులకు కూడా సురక్షితమైన, సమర్థవంతమైన వైద్యం అందించడంలో తమ ఆసుపత్రి కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మలక్ పేట యశోద ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బి.ఆర్.ఎస్ నాయకులు అవగాహన లేకుండా మాట్లాడటం సిగ్గుచేటు

మోత్కూరు, జూన్ 9 (ప్రజా జ్యోతి): అసంపూర్తిగా ఉన్న మోత్కూరు – భువనగిరి మెయిన్ రోడ్డు విషయంలో బి ఆర్ ఎస్ నాయకులు అవగాహన లేకుండా



మాట్లాడడం సిగ్గుచేటు అని మోత్కూరు మున్సిపల్ ఛైర్పర్సన్ గడ్డం స్వప్న సోమనర్సయ్య, జిల్లా కాంగ్రెస్ మాజీ ఉపాధ్యక్షులు పైళ్ళ సోమిరెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గుండగొని రామచంద్రు గౌడ్ అన్నారు. మంగళవారం స్థానిక ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు.

బి ఆర్ ఎస్ ప్రభుత్వంలో సి 5 కాంట్రాక్ట్ సంస్థ కేటీఆర్ బంధువులకు రూ.5.25 కోట్లకు టెండర్ అప్పజెప్పి ప్రభుత్వం మారాక కాంట్రాక్టర్ పనులు చేయకుండా తప్పించుక పోయిన విషయం డి ఆర్ ఎస్ నాయకులు కప్పి పుచ్చుకొని స్థానిక ఎమ్మెల్యే మందుల సామెల్ పై తప్పుడు ప్రచారం చేస్తూ అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. అర్హత లేని వారు స్థాయికి మించి ఎమ్మెల్యేని విమర్శిస్తే చూస్తూ ఊరుకునేది లేదని, తగిన బుద్ధి చెబుతామని అన్నారు. బి ఆర్ ఎస్ పదేళ్ల పాలనలో ఇసుక మాఫియా , ప్రశ్నిస్తే కేసులు, హత్యలు, దాడులు, ఎన్నో అరాచకాలు చేసిన బి ఆర్ ఎస్ నాయకులను 52 వేల ఓట్ల మెజార్టీ తో ఓడగొడితే మోత్కూరు లో ఏదో అలజడి సృష్టించాలని కొందరు చూస్తున్నారని అన్నారు. ప్రజాపాలన నడిపిస్తూ తుంగతుర్తి నియోజకవర్గంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతియుత పాలన, సంక్షేమం, అభివృద్ధి చేస్తున్న ఎమ్మెల్యే మందుల సామెలు అన్నారు. మోత్కూరు అభివృద్ధి లో రోడ్డు వెడల్పు తో మోత్కూరు మున్సిపాలిటీని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన ఘనత ఎమ్మెల్యే సామేలుకు దక్కుతుందని అన్నారు. గత ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ కమిషన్ల కోసం నాసిరకపు డివైడర్, చెరువు కట్ట (మినీ ట్యాంక్ బండ్) పేరుతో దోచుకున్న ఘనుడని విమర్శించారు.

ఈ సమావేశంలో కౌన్సిలర్ కారుపోతుల వెంకన్న, యూత్ కాంగ్రెస్ జిల్లా మాజీ కార్యదర్శి మందుల సురేష్, మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు ముద్దం జయశ్రీ, అన్నెపు పద్మ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎడ్ల శ్రీను, కుర్మిల్ల రాములు, సోషల్ మీడియా కన్వీనర్లు పాలోజు శేఖర చారి, బందెల రవి తదితరులు ఉన్నారు.

# అభివృద్ధి, అవినీతిపై బహిరంగ చర్చకు సిద్ధం

**మాజీ ఎమ్మెల్యే ఆరోపణలు అవాస్తవం**

**ఆరోపణలు రుజువు చేస్తే రాజకీయ సన్యాసం చేస్తాం**

**మాజీ ఎమ్మెల్యే వ్యాఖ్యలను ఖండించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు**

**పిసిసి డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి**

**జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు**

కోదాడ టౌన్,జూన్ 09 (ప్రజా జ్యోతి): వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పిసిసి డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి అన్నారు. మంగళవారం కోదాడ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా గ్రంధాలయ చైర్మన్ వంగవీటి రామారావు,మాజీ సర్పంచ్ పారా సీతయ్యలతో కలిసి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే బొల్లం పరిపాలనలో ప్రజలు ఎన్ని ఇబ్బందులు పడ్డారో నియోజకవర్గ ప్రజలు అందరికీ తెలుసునన్నారు. గంజాయి,ఇసుక,మట్టికి గుడిబండ షాడో ఎమ్మెల్యే తో టోకెన్లు పెట్టించి మరి ప్రజల నుంచి అక్రమంగా వసూలు చేసిన సంగతి నిజం కాద అని ప్రశ్నించారు. ఆఖరికి దళిత బంధు పేరుతో దళితులను మోసం చేసిన నువ్వు నీతులు



మాట్లాడడం సరికాదన్నారు. వేల కోట్ల నిధులు తీసుకువస్తూ ఎక్కడ కూడా అవినీతికి ఆస్కారం లేకుండా రెండు నియోజక వర్గాల అభివృద్దే ధ్యేయంగా పనిచేస్తున్న తమ నాయకులు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి లపై మరొకసారి నిరాధారమైన ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చింతలపాటి శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ షేక్ బషీర్,ఎడవల్లి బాల్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు కందుల కోటేశ్వరరావు, తూనం కృష్ణ, ఎలమందల నరసయ్య, పాశం శ్రీను, సైది బాబు, పిల్లుట్ల శ్రీను, బాగ్దాద్, పిడతల శ్రీను,గంధం యాదగిరి, చింతా బాబు, పాలూరి సత్యనారాయణ, ఉప్ప గండ్ల శ్రీను,శోభన్ తదితరులు పాల్గొన్నారు.

## సాయిబాబా గుడి వద్ద యూటర్న్ ఏర్పాటు చేయాలంటూ కమిషనర్ కు వినతి

మిర్యాలగూడ, జూన్ 09,( ప్రజాజ్యోతి ): మిర్యాలగూడ పట్టణంలోని హనుమాన్ పేట సాయిబాబా గుడి, ఎల్ఐసి ఆఫీస్ వద్ద యు టర్న్ సదుపాయము కల్పించాలని కోరుతూ బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ కమీషనర్ నర్రా శ్రీజా రెడ్డి కి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఉన్న యూటర్న్ మూసివేసి డివైడర్లు ఏర్పాటు చేయడంతో ప్రజలకు భక్తులకు ఇబ్బందికరంగా మారిందని అన్నారు.ఈ కార్యక్రమం లో 21 వార్డు కౌన్సిలర్ వెలుగు ఇందిరా నాగరాజు, బీజేపీ రాష్ట్ర దార్మిక సెల్ కో కన్వీనర్ చిలుకూరి శ్యామ్,పులి రామచంద్రు,మేకల రవి,అంకసాని శ్రీను,పులి శ్రీనివాస్, మేకల నందు, హరీష్ లు పాల్గొన్నారు.




# మల్లన్న.. మీ ఐదేళ్ల పాలనపై ప్రజల ముందే చర్చకు సిద్ధమా?

**అవినీతి అక్రమాలపై ప్రజల ముందే చర్చిద్దాం: రాయపూడి వెంకటనారాయణ సవాల్**

కోదాడ టౌన్, జూన్ 09 (ప్రజాజ్యోతి): మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య (మల్లన్న) ప్రస్తుత కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డిపై విమర్శలు చేసే ముందు తన ఐదేళ్ల పాలనలో జరిగిన వ్యవహారాలపై ప్రజలకు సమాధానం చెప్పాలని ఉమ్మడి నల్గొండ జిల్లా మలిదశ ఉద్యమకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకుడు రాయపూడి వెంకటనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారంకోదాడలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మాజీ ఎమ్మెల్యే మల్లన్న ఇటీవల చేస్తున్న వ్యాఖ్యలు రాజకీయ నిరాశ, అసహనానికి నిదర్శనమని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నుంచి తనకు టికెట్ వస్తుందో లేదో అన్న అనిశ్చితి నేపథ్యంలోనే ఆయన ఇలాంటి ఆరోపణలకు దిగుతున్నారని ఆరోపించారు.ప్రజల ముందు బహిరంగ వేదికపై చర్చకు సిద్ధమైతే, తన హయాంలో జరిగిన ప్రతి అంశాన్ని చర్చించేందుకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని వెంకటనారాయణ స్పష్టం చేశారు. దళిత బంధు అమలులో చోటుచేసుకున్న



అక్రమాలు, మట్టి తవ్వకాల వ్యవహారం, గంజాయి కేసులు సహా ప్రజల్లో చర్చకు వచ్చిన అంశాలపై సమగ్రంగా మాట్లాడేందుకు సిద్ధమా అని మల్లన్నను ప్రశ్నించారు.ప్రస్తుత ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి ప్రజలకు అందుబాటులో ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. మహిళా ప్రజాప్రతినిధిని లక్ష్యంగా చేసుకుని అనుచిత వ్యాఖ్యలు చేయడం రాజకీయ సంస్కృతికి విరుద్ధమని అన్నారు. అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా సాగుతుండటాన్ని జీర్ణించుకోలేకనే వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని ఆరోపించారు. అలాగే, నిజాయితీగా పనిచేస్తున్న అధికారులపై ఆధారాలు లేకుండా విమర్శలు చేయడం వారి మనోధైర్యాన్ని దెబ్బతీసే చర్యగా అభివర్ణించారు. ప్రజాస్వామ్యంలో విమర్శలు సహజమే అయినప్పటికీ, అవి వాస్తవాల ఆధారంగా ఉండాలని సూచించారు. రాబోయే ఎన్నికల్లో కూడా కోదాడ ప్రజలు అభివృద్ధి, పారదర్శకతకే పట్టం కడతారని, వ్యక్తిగత ఆరోపణలు, నిరాధార విమర్శలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని వెంకటనారాయణ పేర్కొన్నారు.పద్మావతి రెడ్డి అభివృద్ధితో ముందుకెళ్తుంటే, మల్లన్న విమర్శలతో వెనక్కి లాగాలని చూస్తున్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. ఆరోపణలు కాకుండా ఆధారాలతో మాట్లాడాలి" అని ఆయన అన్నారు.

# గంజాయి ముఠా అరెస్ట్

**1.5 కిలోల గంజాయి,ఒక స్కూటీ, 4 మొబైల్ ఫోన్లు స్వాధీనం..**

హుజూర్ నగర్ జూన్ 09 (ప్రజా జ్యోతి) పట్టణ శివారులోని లక్ష్మీనరసింహస్వామి దేవాలయం సమీపంలో గంజాయి విక్రయానికి వచ్చిన ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు హుజూర్ నగర్ సిఐ చరమందరాజు తెలిపారు. మంగళవారం హుజూర్ నగర్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రిక సమావేశంలో తెలిపిన వివరాల ప్రకారం సోమవారం మధ్యాహ్నం సమయంలో ఎస్ఐ చలికంటి నరేష్ కు అందిన




నమ్మదగిన సమాచారంతో ఆయన సిబ్బందితో కలిసి అక్కడ మాటు వేసి దాడి నిర్వహించారు.ఈ సందర్భంగా ఆరుగురు నిందితులను పట్టుకొని, వారి వద్ద నుండి సుమారు 1.5 కిలోల గంజాయి హోండా డియో స్కూటీ మరియు నాలుగు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో ప్రధాన నిందితుడు కొప్పుల శ్రీకాంత్



అలియాస్ పండు (23), గోవిందాపురం, హుజూర్నగర్‌కు చెందినవాడిగా గుర్తించారు. అతను గత నాలుగు సంవత్సరాలుగా అరకు ప్రాంతం నుండి రైలులో గంజాయి తెచ్చి ఖమ్మం మరియు హుజూర్నగర్ ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు వెల్లడైంది.. అతనిపై ఇప్పటికే రెండు గంజాయి కేసులు, రెండు దొంగతనం కేసులు నమోదై ఉన్నట్లు తెలిపారు.. శ్రీకాంత్ ఖమ్మం జిల్లాకు చెందిన కాసాని సాయికృష్ణ (24), దూరు సందీప్ (24)లకు గంజాయి సరఫరా చేసి, వారు కూడా ఇతరులకు విక్రయిస్తూ అక్రమంగా డబ్బులు సంపాదిస్తున్నట్లు తెలిపారు. హుజూర్నగర్‌కు చెందిన దేరంగుల వాసు (19), గంగాధరి అభిరామ్ అలియాస్ అభి (20), సాతి అరవింద్ సింగ్ (22)లకు అమ్మేందుకు తీసుకువచ్చిన సమయంలో పట్టుబడ్డారు. శ్రీకాంత్‌కు గంజాయి సరఫరా చేసిన అరకు ప్రాంతానికి చెందిన మోహన్ మరియు మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వారిని పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పట్టుబడిన నిందితులను కోర్టులో రిమాండ్ చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై నరేష్, సిబ్బంది శంబయ్య, నాగరాజు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏక్లాస్‌పూర్ గ్రామంలో

# వివో బిల్డింగ్ నిర్మాణానికి భూమి పూజ



**కోటగిరి, జూన్ 9, ప్రజా జ్యోతి.**
కోటగిరి మండలంలోని ఎక్లాస్పూర్ గ్రామంలో వివో బిల్డింగ్ నిర్మాణానికి భూమి పూజ మంగళవారం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలో డ్వాక్రా సంఘ సభ్యులకు వివో బిల్డింగ్ను నిర్మాణం చేయడంఈరోజు ఎక్లాస్పూర్ గ్రామంలో వివో బిల్డింగ్ కి భూమి పూజ నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఇర్వంత్ రావు, ఎంపీడీవో విష్ణు,ఏఈపిఆర్ నవదీష్ గౌడ్, గ్రామ పెద్దలు, మహిళా సంఘ లీడర్లు, ఇతర గ్రామస్తులు పాల్గొనడం జరిగింది. జరుగుతుందన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఇర్వంత్ రావు, ఎంపీడీవో విష్ణు, ఏఈపిఆర్ నవదీష్ గౌడ్, గ్రామ పెద్దలు, మహిళా సంఘ లీడర్లు, ఇతర గ్రామస్తులు తదితరులు పాల్గొనడం జరిగింది.

ఎస్సై సుమలత సేవలు

# ప్రజలకు ఆదర్శంగా నిలవాలని సర్పంచ్ కిషన్



**ఇందల్వాయి( ప్రజా జ్యోతి) జూన్. 9**
ఇందల్వాయి మండల కేంద్రంలోని తీర్మానపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు బాలకృష్ణ గ్రామ సర్పంచ్ కిషన్ ఆధ్వర్యంలో నూతనంగా విధుల్లో చేరిన ఎస్సై . సుమలతను మర్యాదపూర్వకంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కిషన్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి సమర్థవంతమైన పోలీస్ సేవలు అందించాలని ఆకాంక్షిస్తూ ఎస్సై సుమలతకు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగల్వాయి మాజీ చైర్మన్ గోపాల్ సొసైటీ చైర్మన్ సిహెచ్ గోవర్ధన్ రెడ్డి తిరుమనపల్లి ఉపసర్పంచ్ రవి గ్రామ పెద్దలు శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. నూతన బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ సుమలతకు వారు శుభాకాంక్షలు తెలియజేస్తూ శాంతి భద్రతల పర్యవేక్షణలో విజయవంతం కావాలని ఆకాంక్షించారు

విజ్ఞాన్ ప్రెస్ అసోసియేషన్

# ఆధ్వర్యంలో ఎస్సైకి పాత్రికేయులు సన్మానం



**కోటగిరి, జూన్ 9, ప్రజా జ్యోతి.**
కోటగిరి మండల కేంద్రంలో బదిలీపై వచ్చిన ఎస్సై శ్రీనివాస్ కి విజ్ఞాన్ ప్రెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షులు ఎన్ ,శ్రీనివాసరావు శాలువాతో మంగళవారం రోజు సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీనివాస్ మాట్లాడుతూ కోటగిరి, పోతంగల్ ఉమ్మడి మండలంలో నేర నియంత్రలను శాంతి భద్రలు కాపాడుతామని ఆయన వివరించారు, అక్రమ రవాణా ఇసుక, అక్రమంగా మొరం రవాణా ను అడ్డుకుంటామని ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు విజ్ఞాన్ ప్రెస్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్ శ్రీనివాసరావు, వడ్డే నర్సింలు, ప్రధాన కార్యదర్శి మూడో జీవన్ , పాత్రికేయులు సమీర్, తదితరులు పాల్గొన్నారు.

బచ్చు పురుషోత్తం గుప్త

# సేవ ఫౌండేషన్ విద్యార్థులకు సన్మానం



**సిరికొండ (ప్రజా జ్యోతి)జూన్ 9**
సిరికొండ మండలంలో తాళ్ల రామడుగు బచ్చు పురుషోత్తం సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ చైర్మన్ పురుషోత్తం గుప్త ఆధ్వర్యంలో పురుషోత్తం గుప్తా కళ్యాణ వేదికలో ప్రభుత్వ పాఠశాలలో ఎస్ఎస్సి లో టాపర్లుగా నిలిచిన 15 జడ్పీహెచ్ స్కూల్లోని విద్యార్థులకు సన్మాన కార్యక్రమం మేమంటూ ఇవ్వడం జరిగింది ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డి ఈ ఓ అశోక్ గుప్తా గారు సిరికొండ ఎస్సై రామకృష్ణ ఎంఈఓ రాములు నాయక్ గారుగారు ఆర్యవైశ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు మోటూరి మురళి అన్నగారు లాబి శెట్టి శ్రీనివాస్ మహంకాళి విజయ్ సేవ ఫౌండేషన్ కోఆర్డినేటర్ బండారి నరేష్ రామడుగు సర్పంచ్ వరలక్ష్మి సంతోష్ విద్యార్థుల తల్లి ంద్రులు టీచర్లు పాల్గొనడం జరిగింది అన్ని స్కూళ్ల ప్రిన్సిపల్స్ స్టూడెంట్ పేరెంట్స్ పాల్గొనడం జరిగింది.

# పూరి గుడిసె లేని జిల్లాగా గుర్తించాలి

– జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్





**రామారెడ్డి జూన్ 09(ప్రజా జ్యోతి)**
రామారెడ్డి మండల కేంద్రంలో మంగళవారం జిల్లా కలెక్టర్ పర్యవేక్షించడం జరిగింది. పూరిగుడిసెల్లో నివసిస్తున్న అర్హులను గుర్తించి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలి. అని అన్నారు.

**పూరి గుడిసెలేని జిల్లాగా తీర్చిదిద్దాలి..!**

జిల్లాలో ఒక్క పూరిగుడిసె కూడా లేకుండా "పూరిగుడిసెలు లేని జిల్లాగా" కామారెడ్డిని తీర్చిదిద్దేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సూచించారు. వడ్డెర కాలనీ సందర్శించి పూరి గుడిసెల్లో నివసిస్తున్న అర్హులైన కుటుంబాలను గుర్తించి వారికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు.కుటుంబాల పరిస్థితిని పరిశీలించిన జిల్లా కలెక్టర్, గృహ సౌకర్యం లేని అర్హుల వివరాలను క్షేత్రస్థాయిలో సేకరించి ప్రభుత్వ నిబంధనల మేరకు వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు.రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి పూరి గుడిసెలో ఉన్నవారిని గుర్తించి వారికి ఇళ్లు మంజూరు చేయాలని, పేమెంట్ సమస్యలు తలెత్తితే ఏపీఎం ద్వారా రుణాలు మంజూరు చేయాలని అన్నారు.నిజమైన లబ్ధిదారులను గుర్తించడంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా గ్రామస్థాయిలో సమగ్ర సర్వే నిర్వహించాలని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబం ప్రభుత్వ గృహ పథకాల ప్రయోజనం పొందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న అంశాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ పనులు వేగవంతం చేయాలని, లబ్ధిదారులకు అవసరమైన సాంకేతిక, పరిపాలనా సహకారం అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పిడి హౌసింగ్ విజయపాల్ రెడ్డి, తాసిల్దార్ ఉమలత, సర్పంచ్ బండి ప్రవీణ్, ఉప సర్పంచ్ నవీన్, ఎంపీడీవో నాగేశ్వర్ గుప్తా, ఎంఈఓ ఆనంద్ రావు, గ్రామ పాలకవర్గం సభ్యులు సంబంధిత శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

దేశంలో ఎక్కడలేని విధంగా

# తెలంగాణలో పథకాలు ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి








**ఇందల్వాయి(ప్రజా జ్యోతి) జూన్. 9**
ఇందల్వాయి మండల కేంద్రంలోని మహిళా సమాఖ్యకు ఆర్టీసీ బస్సులు సీఎం చేతుల మీదుగా బస్సులు అందుకునేందుకు బయలుదేరిన మహిళలు ఇందల్వాయి టోల్ ప్లాజా నుండి జెండా ఊపి ప్రారంభించిన ఎమ్మెల్యే మహిళలను కోటీశ్వరులను చేసే దిశగా ప్రభుత్వం కృషిఒక్కో బస్సు రూ . 36లక్షలు,నియోజకవర్గంలో 7 ఆర్టీసీ బస్సులు కోటిమంది మహిళలను కోటీశ్వరులు చేయాలన్న బృహత్తర లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి అన్నారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ పరిధిలోని 7 మండలాల మహిళా సమాఖ్యలకు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన ఆర్టీసీ బస్సులను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అందుకోనున్నారు. ఈ నేపథ్యంలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మహిళలు 7 బస్సుల్లో హైదరాబాద్ కు బయలుదేరగా.. మంగళవారం ఇందల్వాయి టోల్ ప్లాజా వద్ద ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ మేరకు ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడలేని విధంగా తెలంగాణలో మహిళా సాధికారత దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. అందులో భాగంగానే మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు, వ్యాపారాలు విస్తరించేందుకు ఒక్కో బస్సు పై రూ.6 లక్షలు మహిళా సంఘాల కాంట్రిబ్యూషన్ రూ. 30లక్షల బ్యాంకు లింకేజీ ద్వారా వడ్డీలేని రుణాలతో నియోజకవర్గ పరిధిలో 7 బస్సులు జిల్లా మొత్తంగా 28 బస్సులను ఈరోజు సీఎం చేతుల మీదుగా అందజేయడం జరుగుతుందన్నారు. అటు మహిళలకు వడ్డీలేని రుణాలు అందించడం .. మహిళలు తయారు చేసే వస్తువులకు మార్కెటింగ్ కల్పించడం కోసం హైదరాబాద్ శిల్పారామంలో ప్రత్యేకంగా స్టాళ్లు ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. ఇలా మహిళా సంక్షేమార్థం రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నవీన్ గౌడ్, మాజీ ఐడీసీఎంఎస్ చైర్మన్ సాయరెడ్డి, పొలసాని శ్రీనివాస్, ఉమ్మాజి నరేష్,బాగా రెడ్డి,ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు మోపాల్ సాయిరెడ్డికి, బాల్ రాజు, సర్పంచ్ ఫోరం మండలాల అధ్యక్షులు వాసు, జలందర్ రెడ్డి, శ్రీనివాస్, శ్యాంసన్, ఆయా గ్రామాల సర్పంచులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎంఎల్‌బికప్ (అండర్-11)

# ఇండియా పోటీలకు తొర్లికొండ జట్టు

– అభినందించిన గ్రామ సర్పంచ్ పద్మ నాగరాజు, మండల విద్యాధికారి మూడెడ్ల శ్రీనివాస్



**బాల్కొండ ఆర్ సి ప్రజాజ్యోతి జులై 9**
ఏప్రిల్ 23 నుండి 26 వరకు ఆర్మూర్ మినీ స్టేడియం క్రీడా మైదానంలో జరిగిన ఎం ఎల్ బి తెలంగాణ రీజినల్ పోటీలలో తొర్లికొండ జట్టు పాల్గొని గ్రూప్-ఏలో ప్రథమ స్థానంలో నిలిచి, ఈ నెల 10 నుండి 14 వరకు కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో జరగనున్న ఎం ఎల్ బి (మేజర్ లీగ్ బేస్‌బాల్) అండర్-11 ఇండియా కప్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ మర్కంటి గంగా మోహన్ తెలిపారు.గత పది రోజులుగా పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన ప్రత్యేక శిక్షణ శిబిరంలో పాల్గొన్న క్రీడాకారులు ఈరోజు బెంగళూరుకు బయలుదేరుతున్న సందర్భంగా అభినందన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా హాజరైన పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు జక్రాన్‌పల్లి మండల విద్యాధికారి మూడెడ్ల శ్రీనివాస్ క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ, "చిన్న వయసులోనే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం గొప్ప విషయం. క్రీడలు పిల్లల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు మరియు జట్టు స్ఫూర్తిని పెంపొందిస్తాయి. తొర్లికొండ విద్యార్థులు ఫిజికల్ డైరెక్టర్ మర్కంటి గంగా మోహన్ శిక్షణలో ఎంతో పట్టుదలతో సాధన చేసి ఈ స్థాయికి చేరుకోవడం అభినందనీయం. బెంగళూరులో జరిగే ఇండియా కప్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు, గ్రామానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నాను. భవిష్యత్తులో మరింత మంది విద్యార్థులు క్రీడల్లో రాణించేలా ప్రోత్సహిస్తామన్నారు, అనంతరం జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అభినందించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గ్రామ సర్పంచ్ పద్మ నాగరాజు మాట్లాడుతూ, "మన గ్రామానికి చెందిన చిన్నారులు జాతీయ స్థాయి క్రీడా వేదికపై తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశం పొందడం ఎంతో ఆనందంగా ఉంది. క్రీడలు పిల్లలలో ఆరోగ్యకరమైన జీవనశైలిని, ఆత్మవిశ్వాసాన్ని, పోటీతత్వాన్ని పెంపొందిస్తాయి. తొర్లికొండ జట్టు బెంగళూరులో జరిగే ఇండియా కప్ పోటీలలో అత్యుత్తమ ప్రదర్శన చేసి గ్రామానికి, మండలానికి, రాష్ట్రానికి గౌరవం తీసుకురావాలని కోరుకుంటున్నాను. క్రీడల అభివృద్ధికి గ్రామ పంచాయతీ తరఫున ఎల్లప్పుడూ సహకారం అందిస్తాము" అని తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను అభినందించారు. ప్రత్యేకత ఏమిటంటే బెంగళూరులో జరుగుతున్న ఈ పోటీలలో దేశంలోని బెంగళూరు, ఢిల్లీ, పూణే, ముంబై తదితర నగరాల నుండి మొత్తం 12 జట్లు పాల్గొంటుండగా, వాటిలో 11 ప్రైవేట్ పాఠశాలలకు చెందిన జట్లే కావడం విశేషం. నిజామాబాద్ జిల్లా నుండి ఎంపికైన రెండు జట్లలో తొర్లికొండ ప్రభుత్వ పాఠశాల జట్టు ఒకటిగా నిలవడం జిల్లా క్రీడా రంగానికి గర్వకారణంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ గంగా జమున మనోహర్, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు గంగాధర్, ప్రధాన కార్యదర్శి భూమేశ్వర్, ఉపాధ్యాయులు సాయిలు, రామకృష్ణ, డాక్టర్ నరసింహారావు, కృష్ణ, ఓఎస్ లలిత మరియు క్రీడాకారుల ఎం ఎల్ బి ఇండియన్ కప్ పోటీలకు ఎంపికైన తొర్లికొండ జట్టుతో ఎంఈఓ మూడేళ్ల శ్రీనివాస్ గ్రామ సర్పంచ్ పద్మా నాగరాజ్ తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ జట్టుకు హెడ్ కోచ్‌గా పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ మర్కంటి గంగా మోహన్, అసిస్టెంట్ కోచ్‌గా సీనియర్ క్రీడాకారుడు సాయికుమార్ వ్యవహరిస్తున్నారు.

# కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుని ఏకగ్రీవంగా ఎన్నిక

– గ్రామ అధ్యక్షుడిగా సున్నాల సాయిలు

**సదాశివనగర్, జూన్ 09(ప్రజాజ్యోతి)**
సదాశివనగర్ మండలం ధర్మారావుపేట్ కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షునిగా సున్నాల సాయిలు ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు మండల అధ్యక్షులు నల్ల మహిపాల్ రెడ్డి. ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ గ్రామ కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షునిగా నియమించేందుకు ఎమ్మెల్యే మదన్మోహన్ రావు. ఆదేశానుసారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అందరికి సమక్షంలో ముఖాముఖి నిర్వహించగా సున్నాల సాయిలు ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భాస్కర్ రెడ్డి. మాజీ గ్రామ అధ్యక్షుడు సంజీవరెడ్డి. సీనియర్ నాయకులు సంతోష్ రెడ్డి. నవీన్ రావు. ఎండి గౌస్. నాగరాజు. కార్యకర్తలు పాల్గొన్నారు.



తొండకూర్‌లో

# మహిళా భవనం భూమిపూజ



**ప్రజాజ్యోతి, నందిపేట్**
డొంకేశ్వర్ మండలం తొండకూర్ గ్రామంలో మహిళల అభివృద్ధి, సామాజిక కార్యక్రమాల నిర్వహణ కోసం నిర్మించనున్న మహిళా భవనం భూమిపూజ కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ సక్కా రెడ్డి భూమిపూజ నిర్వహించి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, మహిళా సంఘ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు. మహిళల సమావేశాలు, అవగాహన కార్యక్రమాలు, స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలకు మహిళా భవనం ఉపయోగపడుతుందని సర్పంచ్ తెలిపారు.

# విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసిన కలెక్టర్

– జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్







**రామారెడ్డి జూన్ 09 (ప్రజా జ్యోతి)**
రామారెడ్డి మండల కేంద్రంలో జిల్లా కలెక్టర్ మంగళవారం సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్ పొందిన విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ జిల్లాలో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచడం, ప్రతి చిన్నారికి విద్యను అందుబాటులోకి తీసుకురావడం లక్ష్యంగా నిర్వహిస్తున్న బడి బాట కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పాల్గొన్నారు. ఎస్సీ కాలనీ లో నిర్వహించిన బడి బాట కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించి, ఇంటింటి ప్రచారం ద్వారా పాఠశాల వయస్సు కలిగిన పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే కార్యక్రమాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా నాలుగు సంవత్సరాలు పూర్తి చేసిన చిన్నారులకు ప్రీ-ప్రైమరీ తరగతుల్లో, అలాగే ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో అడ్మిషన్లు నమోదు చేయడం జరిగింది. ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్న విద్యార్థులను కూడా గుర్తించి నమోదు చేపట్టడం జరిగిందని అన్నారు.అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో జిల్లా కలెక్టర్ సమావేశమై ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన విద్య, మెరుగైన మౌలిక సదుపాయాలు, సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు.పాఠశాల వయస్సు కలిగిన ప్రతి చిన్నారి తప్పనిసరిగా పాఠశాలలో చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.అలాగే డ్రాప్‌అవుట్ విద్యార్థులను గుర్తించి తిరిగి పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా అడ్మిషన్ పొందిన విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులను పంపిణీ చేశారు. విద్యార్థులు తమ జీవిత లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. విద్యే సమాజాభివృద్ధికి పునాదిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, మధ్యాహ్న భోజన పథకం, త్వరలో ప్రారంభం కానున్న అల్పాహార పథకం, డిజిటల్ విద్యా సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలలకు పంపించి వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు,సర్పంచ్ బండి ప్రవీణ్, ఉప సర్పంచ్ నవీన్, తశిల్దార్ ఉమ లత, ఎంఈఓ ఆనంద్ రావు,వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఉద్యమ కారులనే గుర్తించండి

**- ఎంపిక పారదర్శకంగా ఉండాలి**
**- సమావేశం విజయవంతం చేయండి**
**- జెఏసి సమన్వయ కమిటి పిలుపు**

**మెదక్ (ప్రజాజ్యోతి ) జూన్ 09:**
రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారుల ను గుర్తించడానికి కే. కేశవరావు ఆధ్వర్యంలో కమిటీని నియమించడం జరిగింది. ఈ నేపథ్యంలో మెదక్ జిల్లాలో తెలంగాణ ఉద్యమకారులను గుర్తించడం కోసం బుధవారం సాయంత్రం టీఎన్జీవో భవన్ మెదక్ లో సమావేశాన్ని నిర్వహిస్తు న్నట్టు జె ఏ సి సమన్వయ కమిటీ పిలుపునిచ్చింది . మంగళవారం జిల్లా కేంద్రం గుల్షన్ క్లబ్ లో విలేకరులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమ కారులను గుర్తించడంలో 1. తెలంగాణ ఉ ద్యమంలో ప్రాణాలు కోల్పోయిన, 2 .శారీరక వికలాంగులైన, 3. కేసులు నమోదైన ,4 జైలు నిర్బంధించబడిన వారిని,రాష్ట్ర ప్రభుత్వం గుర్తించడానికి ఏర్పాటు చేసుకున్న ప్రాతిపదిక. కానీ తెలంగాణ మలి దశ ఉద్యమంలో ఉద్యోగులు, ఉ పాధ్యాయులు ,కార్మికులు సబ్బండ వర్గాల ప్రజలు పాల్గొని తెలంగాణ సాధించుకున్నారు. మెదక్ జిల్లాలో జరిగిన అన్ని కార్యక్రమాలలో క్రియాశీల కంగా పాల్గొన్న వారందరి ని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలని నేడు జరిగే సమావేశంలో మెదక్ మండలం మరియు పట్టణం,హవేలీ గణాపుర్,పాపన్నపేట, కొల్చారం, వెల్దుర్తి, మండలాలలో పనిచేసిన ఉద్యమకారులందరూ



సాయంత్రం జిల్లా కేంద్రం లోని టీఎన్జీవో భవన్లో జరిగే సమావేశంలో పాల్గొనవల సిందిగా మెదక్ జిల్లా ఉద్యమ జేఏసీ సమన్వయ కమిటీ పిలుపునిచ్చింది. సడిమెల యాదగిరి, శంకర్ దయాల్ చారి, బొందుగుల నాగరాజు, పీడీ ఆనందం, భూపాల్ రెడ్డి, కుమార్ మామిడి, బొమ్మల మైసయ్య, ఆకుల పెంటయ్య, కంది శ్రీనివాస్ రెడ్డి, సత్యం మనోహర్ రెడ్డి, బి కొండల్ రెడ్డి లు ఉన్నారు.

# 95 శాతం ధాన్యం కొనుగోలు పూర్తి

**- జిల్లా వ్యాప్తంగా 84,531 మంది రైతుల నుంచి 3,85,122.080 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు**
**- 66,900 మంది రైతులకు 708,04 కోట్ల రూపాయలు చెల్లింపులు**
**- జిల్లా వ్యాప్తంగా 311 కొనుగోలు కేంద్రాలు మూసివేత**
**- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



**మెదక్ (ప్రజాజ్యోతి) జూన్ 09:**
జిల్లాలో 95 శాతం ధాన్యం కొనుగోలు పూర్తి అయినట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు.జిల్లా వ్యాప్తంగా 84,531 మంది రైతుల నుంచి 3,85,122.080 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి,66,900 మంది రైతులకు 708,04 కోట్ల రూపాయలు చెల్లింపు జరిపామన్నారు. జిల్లా వ్యాప్తంగా 311 కొనుగోలు కేంద్రాలు మూసివేశామ న్నారు. రైతులు అకాల వర్షాలకు అప్రమత్తంగా ఉ ండాలని , రైతులు అధైర్య పడొద్దు ప్రభుత్వం అండగా ఉంటుందని మంగళవారం ఒక ప్రకటన తెలిపారు.

# మహిళా సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

**- తొగుట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చెరుకు విజయ్ రెడ్డి**
**- తొగుట మహిళా సమాఖ్యకు ప్రభుత్వం బస్సు కేటాయింపు**



**తొగుట, జూన్ 09 (ప్రజాజ్యోతి):**
మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని తొగుట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చెరుకు విజయ్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో జరిగే సభలో మహిళా సమాఖ్యల బస్సుల పంపిణీ కార్యక్రమానికి బయలుదేరిన మహిళా సమాఖ్య సభ్యుల బస్సును దుబ్బాక నియోజకవర్గ ఆత్మా కమిటీ చైర్మన్ గాంధారి నరేందర్ రెడ్డి తో కలిసి మార్కెట్ కమిటీ చైర్మన్ చెరుకు విజయ్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళల ఆర్థిక స్వావలంబన, సాధికారత కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని కొనియాడారు. మహిళా సమాఖ్యలకు బస్సుల పంపిణీ ద్వారా వారి కార్యకలాపాలు మరింత విస్తరించి, గ్రామీణ మహిళల అభివృద్ధికి తోడ్పడతాయన్నారు. మహిళలకి ప్రోత్సాహాలు ఇవ్వడం ద్వారా మహిళా సాధికారిత జరిగి ప్రభుత్వం అందిస్తున్న పతాకాలు సద్వినియోగం చేసుకోవడమే కాకుండా ఆర్థికంగా బలపడి వారి ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుచుకొనే అవకాశం ఉంటుందని తెలిపారు. హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమంలో పాల్గొంటున్న మహిళా సమాఖ్య సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తొగుట సర్పంచ్ పాగాల శోభ కొండల్ రెడ్డి, ఏపిఎం బాబురావు, భరత్ తేజ, మహిళా సమాఖ్య నాయకురాలు, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# యాసంగి ధాన్యం కొనుగోళ్లకు ప్రత్యామ్నాయ గోదాం ఏర్పాటు

**- మార్కెట్ కమిటీ చైర్మన్ ఐలాపురం కనకయ్య**



**దౌల్తాబాద్, జూన్ 09 : (ప్రజా జ్యోతి)**
యాసంగి సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లు కొనసాగుతున్న నేపథ్యంలో హైమద్ నగర్ మిల్లులో స్టోరేజ్ సామర్థ్యం పూర్తిగా నిండిపోవడంతో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు.దీని భాగంగా రాయపోల్ మండలం రామారం శివారులోని మహాదేవ్ ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్లులో తాత్కాలిక గోదాం ఏర్పాటు చేసి ధాన్యం దిగుమతి చేసుకునే ఏర్పాట్లు చేశారు. ఈ నిర్ణయంతో దౌల్తాబాద్, రాయపోల్ మండలాల రైతులు తమ ధాన్యాన్ని సులభంగా విక్రయించుకునే అవకాశం కలిగిందని తెలిపారు. రైతులు ఈ సదుపాయాన్ని వినియోగించుకుని ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి అంతరాయం లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఐలాపురం కనకయ్య యాదవ్, వైస్ చైర్మన్ మద్దెల స్వామి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పడాల రాములు, మాచిన్‌పల్లి సర్పంచ్ నాగరాజు, గణేష్ పంచమి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బాలశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థుల ఉజ్వల భవిష్యత్

**- విద్య రంగంలో జిల్లాను మొదటి స్థానంలో నిలపాలి**
**- విద్యార్థులు ఐఐఐటి వైపే కాకుండా దేశంలో ఉన్నత విద్యా సంస్థలైన**
**- ఎయిమ్స్ లాంటి ఉత్తమమైన వైద్య కళాశాలలో ప్రవేశాలు పొందడానికి ప్రయత్నించాలి: కలెక్టర్**
**- జిల్లా వ్యాప్తంగా 100 శాతం ఉ త్తీర్ణత సాధించిన 91 పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, సన్మానాలు**
**- లో 560 ఆ పై మార్కులు సాధించిన ఉత్తమ ప్రతిభావంతులైన విద్యార్థులకు సన్మాన సత్కార ప్రశంసలు**
**- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**





**మెదక్( ప్రజాజ్యోతి ) జూన్ 09:**
విద్య రంగం లో మెదక్ జిల్లాను మొదటి స్థానంలో నిలపాలనీ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు.మంగళవారం కలెక్టరేట్లోని మీటింగ్ హాల్లో గత సం: పదవ తరగతిలో ఎక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులను సన్మానించా రు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. విద్యారం గంలో జిల్లా ఉన్నత స్థానంలో ఉండాలని సూచించారు.సమాజంలో వ్యక్తినీ ఉన్నతమైన స్థాయిలో నిలపాలంటే విద్య ద్వారానే సాధ్యం అయితుందన్నారు . విద్యార్థులు ఐ.ఐ.ఐ.టి వైపే కాకుండా దేశంలో ఉన్నత విద్యా సంస్థలైన ఐఐటి లలో స్థానాన్ని పొందడానికి, ఎయిమ్స్ లాంటి ఉత్తమమైన వైద్య కళాశాలలో ప్రవేశాలు పొందడానికి ప్రయత్నించా లన్నారు.విద్యార్థులు ఉ న్నతమైన శిఖరాలు అధిరోహించి భవిష్యత్తులో మంచిస్థాయిలో ఉండాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా 100 శాతం ఉత్తీర్ణత సాధించిన 91 పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, 560 ఆపై మార్కులు పొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రాన్ని, ఎగ్జిక్యూటివ్ ఫైల్ , డిక్షనరీ మరియు పెన్స్ ని అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రాజు, ఏఎం ఓ సుదర్శన మూర్తి, కరుణాకర్, కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి రాజు , సహాయ గణాంక అధికారి నవీన్ , ఎంఈఓ లు, కాంప్లెక్స్ హెచ్ఎంలు, ఎమ్మార్పీలు , విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.















# కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో సమీకృత భవనాలు

**- మూడు నెలల ముందు ఎంపిడిఓ కార్యాలయం అద్దె భవనంలో ఉండేది**
**- రైతు వేదిక నుంచే పాలన సాగిస్తున్న అధికారులు - అధికారుల నోట్లో పచ్చి ఎలక్కాయ - అద్దె భవనంలో పోలీస్ స్టేషన్**
**- ప్రభుత్వ పాఠశాలలో తాసిల్దార్ కార్యాలయం**







**మనోహరాబాద్, జూన్ 09( ప్రజా జ్యోతి )**
కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో సమీకృత భవనాలు రైతు వేదిక నుంచే అధికారుల పాలన సాగింపు. ఇదంతా చూస్తుంటే అధికారుల నోట్లో పచ్చి ఎలక్కాయ తిన్నట్లుగా ఉంది. అద్దె భవనంలో పోలీస్ స్టేషన్ ప్రభుత్వ పాఠశాలలో తాసిల్దార్ కార్యాలయం మనోహరాబాద్ పై ప్రభుత్వం చిన్న చూపు చూడటంతోనే మండల అభివృద్ధి రోజురోజుకు దిగజారి పోతుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వంలో సమీకృత భవనాలు ఏర్పాటు కోసం మాజీ మంత్రి హరీష్ రావు, శంకుస్థాపన చేసి ఏనుగుడుస్తున్న ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందని పలువురు అటు అధికారులపై ఇటు ప్రభుత్వంపై మండిపడుతూ కాంట్రాక్టర్ల నిర్లక్ష్యమే ఎక్కువగా కనిపిస్తుందా అనే అంశాలపై పలువురిలో సందేశాలు మొదలయ్యాయి. అద్దె భవనాల్లో కార్యాలయాలు ఏర్పాటు చేసి అభివృద్ధి చేయాల్సిన ఆదాయంతో అద్దెలు చెల్లిస్తూ అధికారులు ప్రభుత్వానికి ఎలాంటి సిఫారసు చేయడం లేదని సమీకృత భవనాలు నిర్మిస్తున్న కాంట్రాక్టర్లు వాపోతున్నారు. అధికారులు ఇష్టగోష్ తో కార్యాలయాలు ఎక్కడుంటే అక్కడే పాలన సాగిస్తున్నారని దీంతో ప్రజాధనం దుర్వినియోగం అవుతున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం మరొక విశేషమని పలువురు విమర్శలు చేస్తున్నారు. నూతన మండలాలు ఏర్పాటయి సంవత్సరాలు గడిచిన అభివృద్ధి మాత్రం కనబడడం లేదని ఓట్లు రాగానే నాయకుల మాత్రం పండుగ వాతావరణం లాగా ముందుండి ఓటు వేయాలంటూ అభ్యర్థిస్తార తప్ప అభివృద్ధిపై నాయకులకు కూడా సోయ లేకుండా పోతుందని పలువురు విమర్శిస్తున్నారు. విలువైన అధికారం ఉన్న నాయకులు మనోరాబాదులో ఉండి లేని సమానంగా మండలంలో ఏర్పడుతుందని పలువురు ఇటు అధికారులపై అటు పాలనపై మండిపడుతున్నారు. సమీకృత భవనంలో గడ్డి వేయడానికి పనికొస్తుందే తప్ప ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయడానికి పనికి రాకుండా పోతుందని రైతు వేదికలో అధికారుల పాలన కొనసాగిస్తూ ఈ కార్యాలయం ఎక్కడ ఉందో తెలియక ప్రజలు తర్జనభజన పడుతున్నారని పలువురు వాపోతున్నారు. అద్దె భవనంలో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసి ముమ్మాటికి ఇండ్లు గడుస్తున్న సంవత్సరం చొప్పున ఆదాయం కొల్లగొట్టినట్లయితే ఇప్పటివరకు చూస్తే వేలాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగం చేసినట్లే అని పలు విమర్శలు వినిపిస్తున్నాయి. గత మూడు నెలల ముందు ఎంపీడీవో కార్యాలయం అద్దె భవనంలోనే ఉ ండేది ఇప్పుడు అక్కడి నుంచి రైతు వేదికకు మార్చడంతో అన్ని శాఖలు ఒకే రైతు వేదికలో ఉండటంతో ఏ శాఖ ఎవరిని సంప్రదించాలో తెలియక ప్రజల సతమతమవుతున్నారు.

# సీఎం సహాయనిధి నిరుపేదలకు వరం

**- బిజెపి మండల పార్టీ అధ్యక్షులు దేవుడి లావణ్య నరసింహారెడ్డి**

**దౌల్తాబాద్, జూన్ 09: ( ప్రజా జ్యోతి)**
సీఎం సహాయనిది నిరుపేదలకు వరమని బిజెపి మండల పార్టీ అధ్యక్షులు దేవుడే లావణ్య నరసింహారెడ్డి అన్నారు. మంగళవారం మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు ఆదేశాల మేరకు లింగరాజు పల్లి గ్రామానికి చెందిన పోతుల నాగరాజుకు 45 వేల రూపాయలు పోతుల లక్ష్మికి 19500 రూపాయలలు ముత్యంపేట గ్రామానికి చెందిన బండి అంజయ్య కు 9500 రూపాయలు, అహ్మద్ నగర్, గ్రామానికి చెందిన షేక్ మోయిన్ కు 7500 రూపాయల సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశామన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు సీఎం సహాయనిది ద్వారా ఎంతోమంది నిరుపేద కుటుంబాలు లబ్ధి పొందుతున్నారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కరుణాకర్, మండల ఉపాధ్యక్షులు స్వామి, సీనియర్ నాయకులు కనకరాజు, మాజీ భూత అధ్యక్షులు గణేష్, స్వామి తో పాటు తదితరులు పాల్గొన్నారు.





## నవజత శిశువుల సంరక్షణ చికిత్సకు సిద్దిపేటలో పెద్దపీట

**సిరి హాస్పిటల్‌లో డిఎమ్ నియోనాటాలజిస్ట్ 24 గంటలు సేవలు**

**సిద్దిపేట అర్బన్, జూన్ 9(ప్రజాజ్యోతి):-**
నవజాత శిశువులకు ఆరోగ్య సమస్యలు పరిష్కరించడానికి సిద్దిపేట జిల్లా కేంద్రంలోని సిరి చిల్డ్రన్స్ హాస్పిటల్ లో నిపుణులైన డిఎం నియోనాటాలజిస్ట్ సేవలు 24 గంటలు అందుబాటులో ఉన్ననున్నట్లు వైద్యులు సాయిరాం, రమేష్ నాయక్ లు తెలిపారు. మంగళవారం సిద్దిపేటలో వారు మాట్లాడుతూ పుట్టుకతో తక్కువ బరువు ఉన్న పిల్లలు, వారాల కంటే ముందు జన్మించిన శిశువులు, నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ సేవలు, అవసరమైన పిల్లలకు చికిత్సలు అందించడానికి సిద్దిపేట సిరి చిల్డ్రన్స్ హాస్పిటల్ లో అనుభవజ్ఞులైన డిఎం నియోనోటాలజిస్ట్ వైద్యులు జి అనిల్ 24 గంటలు అందుబాటులో ఉంటూ శిశువులకు అత్యుత్తమ వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. సిద్దిపేట జిల్లా పరిసర ప్రాంత ప్రజలు చిన్నపిల్లలకు మెరుగైన వైద్యం కోసం సిద్దిపేట సిరి చిల్డ్రన్స్ ఆస్పత్రిని సద్వినియోగపరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఎండీ ఇమ్రాన్, వైద్య బృందం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మోమిన్‌పేట్‌లో విత్తనాలు, ఎరువుల దుకాణాలపై టాస్క్‌ఫోర్స్ ఆకస్మిక తనిఖీలు

– నాణ్యత, నిల్వలు, రైతులకు అందుబాటుపై అధికారుల ప్రత్యేక దృష్టి



**మోమిన్‌పెట్ జూన్ 9 (ప్రజజ్యోతి) :** రాతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపడుతున్న నేపథ్యంలో మంగళవారం నాడు మోమిన్‌పేట్ మండలంలో టాస్క్‌ఫోర్స్ బృందం విత్తనాలు మరియు ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేసింది. ఈ సందర్భంగా దుకాణాల్లో ఉన్న విత్తనాల నాణ్యత, నిల్వలు (స్టాక్), ఎరువుల లభ్యత, విక్రయ రికార్డులు, లైసెన్సుల నిర్వహణ తదితర అంశాలను అధికారులు పరిశీలించారు. రైతులకు నాసిరకం విత్తనాలు లేదా ఎరువులు విక్రయించకుండా నిబంధనలను కచ్చితంగా పాటించాలని వ్యాపారులకు సూచించారు. వ్యవసాయ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా చూడాలని, ఏవైనా అక్రమాలు లేదా నిబంధనల ఉల్లంఘనలు గుర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఈ తనిఖీల్లో మండల తహసీల్దార్ రవీందర్ మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ రెడ్డి, పోలీస్ ఇన్‌స్పెక్టర్ భరత్ భూషణ్ తో పాటు సంబంధిత శాఖల అధికారులు జీపీఓ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

## తలారి హరికృష్ణ ముదిరాజ్ ది ముమ్మాటికీ హత్యే

– నిందితులను గుర్తించి వెంటనే అరెస్ట్ చేయాలనీ ప్రజాసంఘాల డిమాండ్

– నిందితులను గుర్తించి అరెస్టు చేయకపోతే

11 జూన్ నాడు ఆర్డీవో ఆఫీస్ ముందు ధర్నా

– ముదిరాజ్ దళిత మైనార్టీ ప్రజాసంఘాల పిలుపునిచ్చారు



**బషీరాబాద్ జూన్ 09 ప్రజా జ్యోతి :** బషీరాబాద్ మండలం జీవన్గి గ్రామానికి చెందిన యువకుడు తలారి హరికృష్ణ ముదిరాజ్ మృతి కేసులో నిందితులను వెంటనే గుర్తించి అరెస్ట్ చేయాలని ముదిరాజ్ సంఘం, దళిత, మైనార్టీ, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. అధికార రాజకీయ నాయకుల అండతోనే పోలీసులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. ఘటన నేపథ్యం తలారి హరికృష్ణ తండ్రి టి. నర్సిములు ఏప్రిల్ 29, 2026న పని నిమిత్తం రుద్రారం గ్రామానికి వెళ్లగా, అదే రోజు మధ్యాహ్నం అనుమానాస్పద స్థితిలో మరణించారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినా, వారు సరైన రీతిలో స్పందించలేదని, ఆధారాలు సేకరించడంలో విఫలమవ్వడమే కాకుండా, నిందితులను కాపాడే విధంగా వ్యవహరిస్తున్నారని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు ముదిరాజ్ సంఘం మరియు ప్రజా సంఘాల సహకారంతో పోరాటం కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు. మంగళవారం తాండూరులో జరిగిన విలేకరుల సమావేశంలో నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఒకవేళ నిందితులను వెంటనే అరెస్టు చేయకపోతే జూన్ 11న తాండూర్ ఆర్డీవో కార్యాలయం ముందు భారీ ధర్నా నిర్వహిస్తామని ప్రజాసంఘాల నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రమేష్ ముదిరాజ్ తాండూర్ పట్టణ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు, కే. శ్రీనివాస్ సీఐటీయూ ప్రధాన కార్యదర్శి, అబ్దుల్ వాహెబ్ టి ఎస్ ఎం ఎస్ పి ఎస్ రాష్ట్ర అధ్యక్షులు, కే. చంద్రయ్య ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు, గుమ్మడి రత్నం కెవిపిఎస్ నాయకులు, మొహమ్మద్ సాధిఖ్ టి ఎస్ ఎం ఎస్ పి ఎస్ తాండూర్ పట్టణ ఇంచార్జ్, బలరాం ఎం ఆర్ పి ఎస్ తాండూర్ టౌన్ ప్రెసిడెంట్, మంతట్టి రాజు ముదిరాజ్, శానప్ప ముదిరాజ్, శ్రీకాంత్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## సర్కార్ పాఠశాలల్లో సరైన మౌలిక వసతులు కల్పించాలి.!

– విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి

– ప్రైవేట్ పాఠశాలల ఫీజులపై నియంత్రణ చర్యలు ఉండాలి

– విద్యాశాఖ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలి

– డిఈఓను కలిసిన ఏబీవీపీ జిల్లా నాయకులు



**ఇబ్రహీంపట్నం జూన్ 9 ప్రజాజ్యోతి :** సర్దార్ పాఠశాలలో సరైన మౌలిక వసతులు కల్పిస్తూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఏబీవీపీ నాయకులు డీఈవోను కోరారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల సమస్యల పరిష్కారం, ప్రైవేట్ పాఠశాలల ఫీజుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి ఏబీవీపీ రాష్ట్ర, జిల్లా నాయకులు, రంగారెడ్డి జిల్లా డిఈఓను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ సాయి చరణ్ మాట్లాడుతూ... జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో సరైన మౌలిక వసతులు లేకపోవడం వల్ల విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ రేటు కూడా క్రమంగా తగ్గుముఖం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలను పటిష్ఠపరచి, అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేలా చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్-టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రైవేట్ పాఠశాలలు విద్యను వ్యాపారంగా మార్చి విద్యార్థుల తల్లిదండ్రులపై అధిక ఆర్థిక భారం మోపుతున్నాయని విమర్శించారు. యూనిఫాంలు, బస్ ఫీజులు, స్పెషల్ ఫీజులు, పుస్తకాల ఫీజులు మరియు వివిధ బ్రాండ్ల పేర్లతో వేల నుంచి లక్షల రూపాయల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారని తెలిపారు.

ముఖ్యంగా ఎల్‌కేజీ నుంచి ఉన్నత తరగతుల వరకు చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రైవేట్ పాఠశాలల ఫీజులపై ప్రభుత్వం కఠిన నియంత్రణ చర్యలు తీసుకొని, విద్యాశాఖ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని కోరారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వీరపట్నం జిల్లా కన్వీనర్ పయ్యంశెట్టి జగదీష్ పటేల్, ఎబివిపి ఎల్.బి నగర్ జిల్లా కన్వీనర్ వినయ్, నగర కార్యదర్శి నితిన్ పాల్గొనారు..

# ఉపాధి హామీ కూలీల పెళ్లి సందడి





– అడవి పూలు కూరగాయల దండలు

– 31 సంవత్సరాల వెళ్లి వేడుకలు

– శుభాకాంక్షలు చెప్పిన తోటి కూలీలు

**తాండూరు జూన్ 9 ప్రజా జ్యోతి :** వికారాబాద్ జిల్లా తాండూరు మండలం అంతారం గ్రామానికి చెందిన ఉపాధి కూలీల ఓ జంట 31 వ పెళ్లి వేడుకను ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం రోజు ఉదయం ఎప్పటి మాదిరిగానే ఉపాధి హామీ పని కోసం వెళ్లిన కూలీలు ఎవరి పనిలో వాళ్ళు నిమగ్నమై పనులు పూర్తి చేసుకున్న తదుపరి అందులో పనిచేసే ఓ జంటది వివాహ వేడుక ఉన్నట్లు తెలుసుకున్న తోటి కూలీలు పెళ్లిరోజు వేడుకలు సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన జంగని సుగుణమ్మ, మొగులయ్య దంపతుల 31వ వివాహ వేడుక ఉన్నట్లు గుర్తించిన తోటి ఉపాధి హామీ కూలీలు అక్కడే లభించిన అడవి పువ్వులు సేకరించి ఓ పొడవాటి సొరకాయ దండను ఏర్పాటు చేసి వివాహ వేడుక జరిపించారు. ఇద్దరు దంపతులను కూర్చోబెట్టి సాంప్రదాయబద్ధంగా అడవి పూలతో పెళ్లి తంతు ముగించారు. ఇదంతా జరుగుతుండగా అక్కడి కూలీలు సంతోషం వ్యక్తం చేసి పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఇలాంటి వేడుకలు మరెప్పుడు జరగలేదేమో అనే విధంగా చర్చించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీలు తదితరులు ఉన్నారు.

# ఓట్ చోర్ నియంత్రణకు ఇదే సరైన సమయం







– సర్ ప్రక్రియ పూర్తి అయ్యేవరకు కాంగ్రెస్ మద్దతి స్తుంది

– బిఎల్ఎల శిక్షణ శిక్షణ శిబిరం సక్సెస్

– ఒక్కరికి ఒక్క ఓటు కాంగ్రెస్ పార్టీ నినాదం అమలు చేద్దాం

– శిక్షణ శిబిరంలో సర్ రాష్ట్ర కన్వీనర్, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

– తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి

**తాండూరు జూన్ 9 ప్రజా జ్యోతి :** ఓట్ చోర్ నియంత్రణకు ఇదే సరైన మార్గమని కాంగ్రెస్ పార్టీ సర్ రాష్ట్ర కన్వీనర్, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి, వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దారాసింగ్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మంగళవారం నాడు తాండూరు పట్టణంలోని శ్రీ వినాయక కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన బిఎల్ఏల శిక్షణ శిబిరానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్) ఓటు సవరణ ప్రక్రియ కార్యక్రమానికి మద్దతుగా తాండూరు నియోజకవర్గ వ్యాప్తంగా బిఎల్ఏ లను ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్లు (బిఎల్ఏ)ల ప్రత్యేక శిక్షణ శిబిరం నిర్వహించడం జరిగిందని చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్ ప్రక్రియకు మద్దతుగా ఉండేందుకు టీపీసీసీ నియమించిన ప్రత్యేక ట్రైనర్ వెంకట రమణ సర్ నియోజకవర్గ కన్వీనర్ పురుషోత్తం రావు, మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ బాల్ రెడ్డిలు సర్ విధివిధానాలు, ఓటరు జాబితా, సవరణ ప్రక్రియ, బిఎల్ఏల బాధ్యతలు వంటి వాటిపై అవగాహన కల్పించారు. భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి ప్రాణాధారం అని పేర్కొన్నారు. సర్ ప్రక్రియ ప్రజాస్వామ్యానికి ముప్పు వాటిల్లే అవకాశం ఉందని హెచ్చరించారు. 1951 నుంచి 2004 వరకు దాదాపు 8 పర్యాయాలు ఓటరు విశ్లేషణ జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కూడ సర్ ప్రక్రియ జరిగిందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చెప్పేదొకటి చేసేది మరొకటి అన్న విధంగా సర్ ప్రక్రియ కొనసాగే అవకాశం ఉందన్నారు. దీంతో అలర్ట్ అయిన టి పి సి సి ప్రజాస్వామ్యం బలపడేట్లు సర్ ప్రక్రియకు కాంగ్రెస్ ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ మద్దతునిస్తుందన్నారు. కేంద్రం లోని బీజేపీ ప్రభుత్వం కనుసైగలో ప్రజాస్వామ్యానికి ముప్పు తేచ్చే విధంగా సర్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. సర్ ప్రక్రియలో ముఖ్యంగా నకిలీ ఓట్లు, డబుల్ ఓట్లు తొలగించడం వంటివి పారదర్శకంగా జరగాలన్నదే కాంగ్రెస్ లక్ష్యమన్నారు. ఇప్పటికే సర్ ప్రక్రియ జరిగిన బీహార్, పశ్చిమ బెంగాల్ తో పాటు పలు రాష్ట్రాలను గమనిస్తే అక్కడ నకిలీ ఓట్లు, డబుల్ ఓట్లు తొలగించడం ప్రక్కన పెడితే బీజేపీ వ్యతిరేక ఓట్లను తొలగించడం పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. రాజ్యాంగ బద్ధంగా కేంద్రం ఎన్నికల సంఘం పరివేక్షణలో జరిగే సర్ ప్రక్రియ బీజేపీ ప్రభుత్వం కనుసైగలో జరుగుతుందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బిఎల్ఏ ( బ్లాక్ లెవెల్ ఏజెంట్ )లు దానికి అడ్డు కట్టవేయడానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ నెల జూన్ 25 నుండి జూలై 24 వరకు బి ఎల్ ఏ లు ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలు స్వీకరిస్తారని చెప్పారు. నెల రోజుల వ్యవది అనేది మనకి చాల ముఖ్యమైనదని ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా కాంగ్రెస్ పార్టీ ఏర్పాటుచేసిన బిఎల్ఏలు కలిసి పని చేయాల్సిన అవసరం ఉంటుందన్నారు. మీ పై పూర్తి నమ్మకం ఉంచిన కాంగ్రెస్ పార్టీ బిఎల్ఏలు గా మీకు అవకాశం కల్పించిందన్నారు. ఓటరు జాబితా పరిశీలనలో డూప్లికేట్ ఓట్ల గుర్తింపు, అర్హులైన ఓటర్ల నమోదు, చిరునామా మార్పు అనేది పూర్తిగా పార్టీ పరంగా మీరు భాధ్యత తీసుకోవాలన్నారు. ఒక్కరికి ఒక్క ఓటు మాత్రమే అనే నినాదాన్ని గట్టిగా నమ్మాలని పిలుపునిచ్చారు. ఇక్కడ నేర్చుకున్న ప్రతి అంశంపై ఓటర్లకు తేలియపర్చాలన్నారు. సర్ ప్రక్రియపై గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత మీపైన ఉందన్నారు. ఓటర్ల నమోదు డబుల్ ఓట్ల తొలగింపుకు అవసరమైన డాక్యుమెంట్స్, పత్రాలు సిద్ధం చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో తాండూర్ నియోజకవర్గంలోని బూత్ స్థాయి బి ఎల్ ఓ లు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజ్ కుమార్, మహిపాల్ రెడ్డి, మహిపాల్, నాగరాజు, వివిధ గ్రామాలకు చెందిన సర్పంచులు, తాండూరు మున్సిపల్ చైర్మన్ నీరజ బాల్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్లు, ప్రజా ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# బషీరాబాద్‌లో సినిమా సందడి

– లివింగ్ లెజెన్స్ సినిమా షూటింగ్ – విద్యార్థి కిడ్నాప్ సన్నివేశం చిత్రీకరణ – శ్రీ వరదరాజుదర్శకత్వంలో







**బషీరాబాద్ జూన్ 09 ప్రజా జ్యోతి :** బషీరాబాద్ మండల కేంద్రంలో మంగళవారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది లీవింగ్ లెజెన్స్ సినిమా చిత్రీకరంలో భాగంగా పాఠశాల నుంచి ఇంటికి తిరిగి వెళుతున్న ఓ విద్యార్థిని వ్యాన్ లో కొందరు వ్యక్తులు ముసుకు వేసుకొని కిడ్నాప్ చేసే సన్నివేశాన్ని చిత్రీకరించారు. ఈ షూటింగ్ స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట పాటు మండల కేంద్రంలో ఓల్డ్ ఎమ్మార్వో పురాతన ఇంట్లో ఒక సన్నివేశాన్ని నిర్వహించారు. షూటింగ్ తిలకించేందుకు స్థానికులు యువత పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సినిమా యూనిట్ చిత్రీకరణ సహజత్వానికి దగ్గరగా తెరకెక్కించడంతో ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. ఈ సందర్భంగా దర్శకుడు శ్రీ వరదరాజు మాట్లాడుతూ కథకు కీలకమైన సన్నివేశాలను బషీరాబాద్ పరిసర ప్రాంతాల్లో జీవన్గి గ్రామంలో కూడా చిత్రీకారిస్తామని తెలిపారు. సినిమా షూటింగ్ కారణంగా కొంత సేపు ఆ ప్రాంతంలో సందడి వాతావరణం నెలకొనగా చిత్ర బృందం సహకరించిన స్థానిక ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు షూటింగ్ ప్రశాంతంగా ముగిసింది అని అన్నారు.

# మహిళలను కోటీశ్వరులుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యం

– రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

– శంషాబాద్ మండల సమైక్య తరఫున ఆర్టీసీ బస్సును ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్







**రాజేంద్రనగర్, జూన్ 09 (ప్రజా జ్యోతి) :** మహిళలను కోటీశ్వరులుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యంగా పనిచేస్తుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం మహిళా సమైక్యకు సంబంధించిన ఆర్టీసీ బస్సును రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మంగళవారం శంషాబాద్ ఏపీఎం కొండయ్య, ఎంపీడీవో మున్నితో కలిసి బస్సుకు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళల అభివృద్ధి కొరకు అనేక సంక్షేమ పథకాలు తీసుకువచ్చారన్నారు. రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారన్నారు. మహిళల కొరకు ప్రభుత్వం ఏర్పడ్డ తొలి రోజుల్లోనే మహాలక్ష్మి పథకంలో ఆర్టీసీ బస్సులో రాష్ట్రమంతా ఉచిత ప్రయాణాన్ని ప్రారంభించారన్నారు. అంతేకాకుండా మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు ఇచ్చి మహిళా సంఘాలను ప్రోత్సహించడం జరిగిందన్నారు. మహిళలు వ్యాపార రంగంలో రాణించేందుకు ఆర్టీసీ రంగంలో కూడా వారికి ఆర్టీసీ బస్సులను ఇచ్చి ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం ఇచ్చే రుణాలను మహిళా సంఘాలలోని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళా సాధికారత కొరకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో శంషాబాద్ తహసిల్దార్ అమర్ లింగం గౌడ్, ఎంపిఓ రమేష్ గౌడ్, శంషాబాద్ మండల మహిళ సమాఖ్య అధ్యక్షురాలు లలిత, ప్రధాన కార్యదర్శి దేవి, శంషాబాద్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్, నార్సింగి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దూడల వెంకటేష్ గౌడ్, పిఎసిఎస్ చైర్మెన్ దవనాకర్ గౌడ్, నాయకులు నీరటీ రాజు ముదిరాజ్, దండు ఇస్త్రారి, మహేందర్ రెడ్డి, జగన్ గౌడ్, ఆయిల్ కుమార్, ప్రసాద్, ప్రభాకర్, రమేష్ యాదవ్, శ్రీకాంత్ గౌడ్, మేకల వెంకటేష్, రామ్ నాథ్, మల్చలం లింగం, జుర్కి రమేష్, సుభాష్, మహిళల సంఘాల నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## తొలి క్రియేటర్ ఎకానమీ సమ్మిట్ విజయవంతం



**హైదరాబాద్, జూన్ 09 (ప్రజాజ్యోతి) :** భారత్ డీఎంఎఫ్, ఆర్‌టీఐహెచ్, ఏపీఐఎస్ సంయుక్తంగా అమరావతి సమీపంలోని చినకాకానిలో నిర్వహించిన 'క్రియేటర్స్ జోన్ డిజిటల్ సమ్మిట్-2026' విజయవంతమైనట్లు నిర్వాహకులు మంగళవారం నగరంలో విడుదల చేసిన ఒక ఘటనలో పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 200 మందికి పైగా డిజిటల్ క్రియేటర్లు, ఇన్‌ఫ్లుయెన్సర్లు, స్టార్టప్ వ్యవస్థాపకులు, విద్యార్థులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో కంటెంట్ సృష్టి, ఏఐ, క్రియేటర్ మోనిటైజేషన్, ఐపీఆర్, బ్రాండ్ భాగస్వామ్యాలపై నిపుణులు సెషన్లు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా 'క్రియేటర్స్ జోన్ ఎక్సలెన్స్ అవార్డ్స్-2026' ప్రదానం చేశారు. భారత్ డీఎంఎఫ్ చైర్మన్ విశ్వ సీఎం, ఉపాధ్యక్షులు విపిన్ ఉన్ని, ఏపీఐఎస్-ఆర్‌టీఐహెచ్ సీఈఓ ధాత్రి రెడ్డి, ట్రూజోన్ సోలార్ బై సన్‌టెక్ సీఈఓ జక్కుల శ్రీనివాస్, తెనాలి డబుల్ హార్స్ ఎండీ శ్యామ్ ప్రసాద్ పాల్గొని ప్రసంగించారు. క్రియేటర్ ఎకానమీ ద్వారా యువతకు ఉపాధి, వ్యాపార అవకాశాలు పెరుగుతున్నాయని వారు పేర్కొన్నారు.

## మానవ మనుగడకు మొక్కలే ఆధారం

– ఛైర్మన్ జాం రవి





**శామీర్ పేట్, జూన్ 09, (ప్రజాజ్యోతి) :** మానవ మనుగడకు మొక్కలే ప్రధాన అధారమని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని మూడు చింతలపల్లి మున్సి పాలిటీ ఛైర్మన్ జాం రవి అన్నారు. మంగళవారం వన మహోత్సవం దినోత్సవాన్ని పురస్కరించుకుని మూడుచింతలపల్లి మున్సిపల్ పరిధిలో కమిషనర్, కౌన్సిలర్‌లతో కలిసి పల్లె ప్రకృతి వనంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....పచ్చదనం పెంపొందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, చెట్లు లేకపోతే మానవ మనుగడ కష్టతరమవుతుందన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ తమ వంతు కృషి చేయాలన్నారు. మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ లు పెద్దిరెడ్డి శ్రీలత, రాజిగళ్ల లత, గొంది శ్రీవాణి, మూడవత్ నవీన్, ముద్దం పాపి రెడ్డి, మెరుపాటి గోవర్ధన్ రెడ్డి మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దోసకాయల వెంకటేష్, నాయకులు శ్రీనివాస్ గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, మంద స్వామి, బస్వా రెడ్డి నర్సింహులు, మున్సిపల్ అధికారులు డిఈ స్పూర్తి, మేనేజర్ ఉషా, మోహన్ సింగ్, మల్లిఖార్జున్, బిల్ కలెక్టర్లు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## నూతన ఎమ్మార్వో కు శుభాకాంక్షలు తెలిపిన పాపి రెడ్డి నగర్ బస్తి అధ్యక్షుడు ఊట్ల చంద్ర రెడ్డి



**కూకట్ పల్లి, జూన్ 09 (ప్రజా జ్యోతి) :** కూకట్ పల్లి మండల తహశీల్దార్ (ఎమ్మార్వో) గా బాధ్యతలు చేపట్టిన అశోక్ కుమార్ కు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. శేరిలింగంపల్లి నియోజకవర్గం, వెంకటేశ్వర నగర్ డివిజన్ పాపిరెడ్డి నగర్ బస్తి అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి పలువురు బస్తి నేతలతో కలిసి మంగళవారం అశోక్ కుమార్ ను కలిసి పుష్పగుచ్ఛలను అందిస్తూ శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం బస్తి లోని సమస్యలను ఎమ్మార్వో కు వివరించారు. కార్యక్రమంలో శంకర్ రెడ్డి, రెడ్డి సత్యనారాయణ రెడ్డి, యాదగిరి , లక్ష్మణ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## నాగోల్ సర్కిల్‌లో పర్యటించిన జోనల్ కమిషనర్ శ్రీ వికాస్ మహతో





**అబ్దుల్లాపూర్ మెట్టు జూన్ 09(ప్రజాజ్యోతి) :** మల్కాజ్ గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎల్బీనగర్ జోన్ జోనల్ కమిషనర్ శ్రీ వికాస్ మహతో మంగళవారం ఎల్బీన గర్ జోన్ పరిధిలోని నాగోల్ సర్కిల్లో ఎల్బీనగర్ జోన్ ఎల క్ట్రికల్ డిప్యూటీ ఈఈ పావనితో కలిసి పర్యటించారు. కుం ట్లూరు పెద్ద చెరువు వద్ద వీధి స్తంభాలు, లైట్ల కోసం నూతన ప్రతిపాదనలకు సంబంధించిన పనుల కోసం ఆయన పరిశీలించారు. నూతనంగా ఏర్పాటు అవుతున్న కాలనీలలో వీధి దీపాలు లేని ప్రాంతాల్లో కాలనీవాసుల ఇబ్బందులను తొలగించేందుకు అవసరమైన వీధి దీపాలను ఆయన మంజూరు చేయడం జరిగింది. అనంతరం నాగోల్ సర్కిల్ లోని పెద్ద అంబర్ పేట్ వార్డులో పాత స్టాక్ రిజిస్టర్ లను సమీక్షించడం జరిగింది. ఎల్బీనగర్ జోన్ అనేది గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్( జిహెచ్ఎంసి) యొక్క పరిపాలన విభాగాలలో ఒకటి అనే విషయం మనందరికీ విధితమే.

# నాణ్యమైన విద్య అందించేందుకు అందరూ కలిసి పనిచేయాలి

### ఉపాధ్యాయ సంఘాలతో జిల్లా విద్యాధికారి ముఖాముఖి సమావేశం

కరీంనగర్ బ్యూరో,జూన్ 9 (ప్రజాజ్యోతి )
విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు అందరూ కలిసి పనిచేయాలని జిల్లా విద్యాధికారి ప్రశాంత్ రెడ్డికోరారు. కరీంనగర్ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఎల్ఎండీ కాలనీలోని డైట్ కళాశాలలో జిల్లా విద్యాధికారి (డీఈఓ) ప్రశాంత్ రెడ్డి ఉపాధ్యాయ సంఘాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, బాధ్యులతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో ఉపాధ్యాయులకు ఎదురయ్యే అకడమిక్, నాన్-అకడమిక్ సమస్యలను ముందుగానే గుర్తించి సామరస్యపూర్వకంగా పరిష్కరించేందుకు విద్యాశాఖ కట్టుబడి ఉందన్నారు. ఉపాధ్యాయ సంఘాలను ఒక కుటుంబంలా భావిస్తూ పరస్పర సహకా రంతో జిల్లాలోని విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు అందరూ కలిసి పనిచేయాలని కోరారు.సమావేశంలో ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు బడిబాట కార్యక్రమం, ఉపాధ్యాయుల బదిలీలు, రెగ్యులరైజేషన్, టోటల్ వర్క్ అడ్జస్ట్మెంట్, సర్వీస్ పుస్తకాల నవీకరణ, కార్యాలయంలోని వివిధ విభాగాల డిస్ప్లే బోర్డులు, పెండింగ్ ఫైళ్ల పరిష్కారం తదితర అంశాలపై తమ అభిప్రాయాలు, సమస్యలను డీఈఓ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే చిన్నచిన్న సమస్యల పరిష్కారం కోసం ఉపాధ్యాయులు తరచూ జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి రావాల్సిన అవసరం లేకుండా, అన్ని సమస్యలకు సత్వర పరిష్కారం లభించేలా చర్యలు చేపట్టాలని సంఘాల నాయకులు కోరారు.



ఈ సమావేశంలో డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ముండయ్య, కోఆర్డినేటర్లు అశోక్ రెడ్డి, శ్రీనివాస్, ఉమారాణి పాల్గొన్నారు. వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై పలు సూచనలు చేశారు. డీఈఓ ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి విద్యాశాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, పరస్పర అవగాహనతో సమస్యలను పరిష్కరిస్తూ జిల్లాలో విద్యా ప్రమాణాల పెంపు కోసం సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కరీంనగర్ జిల్లాను విద్యారంగంలో అగ్రస్థానంలో నిలిపేందుకు విద్యాశాఖ, ఉపాధ్యాయ సంఘాలు కలిసి పనిచేయాలని ఆకాంక్షించారు.

## హెల్ప్ డెస్క్ ఏర్పాటు

కరీంనగర్ బ్యూరో, జూన్ 9 (ప్రజాజ్యోతి )
డబుల్ బెడ్ రూమ్, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలు ఎదుట మంగళవారం హెల్ప్ డెస్క్ ను ఏర్పాటు




చేసినట్లు కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు. ఏవైనా సమస్యలు ఉంటే ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు హెల్ప్ డెస్క్ లో సంప్రదించాలని ప్రజలకు సూచించారు. కలెక్టరేట్ ఏవో సుధాకర్ గృహ నిర్మాణశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 60 ఏళ్ల కల సాకారం..

### 11 కేవీ విద్యుత్ లైన్ షిఫ్టింగ్ పనులకు శ్రీకారం

జగిత్యాల రూరల్,జూన్9(ప్రజాజ్యోతి):
జగిత్యాల రూరల్ మండలం మోరపల్లి గ్రామ ప్రజల ఆరు దశాబ్దాల చిరకాల సమస్యకు పరిష్కారం దిశగా అడుగులు పడ్డాయి. గ్రామంలో ఇండ్లపై నుంచి వెళ్తున్న 11 కేవీ విద్యుత్ లైన్‌ను తొలగించి ఇతర ప్రాంతానికి మళ్లించే పనులను





రూ.9 లక్షల నిధులతో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. విద్యుత్ లైన్ కారణంగా ఎదురవుతున్న ప్రమాదాల నుంచి ఉపశమనం లభిస్తుందని స్థానికులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గడ్డం నారాయణరెడ్డి, జిల్లా సర్పంచుల ఫోరమ్ అధ్యక్షుడు బొలిశెట్టి గంగారెడ్డి, సర్పంచ్ కట్ట రాజేందర్, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

## దుబాయ్‌లో ప్రమాదం..నమిలికొండలో విషాదం

**కుటుంబ పోషకుడి మృతితో దిక్కుతోచని స్థితిలో మృతుడి కుటుంబం**

**ప్రభుత్వం, దాతలు ఆదుకోవాలని గ్రామస్తుల విజ్ఞప్తి**

కొడిమ్యాల,జూన్ 09,(ప్రజాజ్యోతి):
ఉపాధి కోసం విదేశాలకు వెళ్లిన ఓ కుటుంబ పెద్ద రోడ్డు ప్రమాదంలో మృతి





చెందడంతో జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం నమిలికొండ గ్రామంలో విషాదం నెలకొంది. గ్రామానికి చెందిన సయ్యద్ సలీం (51) మూడు నెలల క్రితం ఉపాధి నిమిత్తం దుబాయ్‌కు వెళ్లాడు. అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. సలీం కుటుంబ పోషణ కోసం కూలి పనులు చేస్తూ జీవనం సాగించేవాడు. మెరుగైన ఉపాధి కోసం విదేశాలకు వెళ్లిన ఆయన ఆకస్మిక మృతితో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. మృతుడికి భార్య గోరిభి, కుమార్తె కరియ (17), కుమారులు షాదుల్లా (14), చిన్న కరీం (9) ఉన్నారు. కుటుంబానికి ఆధారంగా ఉన్న సలీం మృతితో భార్యాభిడ్డల రోదనలు గ్రామస్తులను కలచివేస్తున్నాయి. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురావడానికి ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, దాతలు సహకరించాలని గ్రామస్థులు కోరుతున్నారు. కుటుంబ పెద్దను కోల్పోవడంతో ఆ కుటుంబ భవిష్యత్తుపై ఆందోళన వ్యక్తమవుతోంది.

## ఆడపిల్ల జన్మిస్తే 5 వేలు ఎవరైనా మరణిస్తే 10 వేలు మాట తప్పని గాజుల మహేష్ గౌడ్

శంకరపట్నం జూన్ 9 (ప్రజా జ్యోతి)
కరీంనగర్ జిల్లాశంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామానికి చెందిన గాజుల మహేష్ గౌడ్ గ్రామ సర్పంచ్ గా స్వల్ప ఓట్ల మెజార్టీతో ఓటమి చెందాడు.ఎన్నికల హామీలలో భాగంగా గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఎవరైనా మరణిస్తే వారి కుటుంబానికి 10 వేలు ఆడపిల్ల జన్మిస్తే 5వేల రూపాయలు అందిస్తానని ప్రకటించడం జరిగింది.స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయినప్పటికీ,ఇచ్చిన మాట తప్పకుండా గ్రామానికి చెందిన దాసారపు ఎల్లయ్య ఇటీవల మరణించగా వారి కుటుంబానికి మంగళవారం రూ.10 వేల రూపాయల ఆర్థిక సాయం చేసి ఉదారత చాటుకున్నాడు.ఇచ్చిన మాట తప్పకుండా మాట నిలబెట్టుకున్న మహేష్ గౌడ్ మాట్లాడుతూ సర్పంచ్ గా గెలవలేదు కానీ ఈ గ్రామమే నా ఇల్లు ఆడపిల్ల అంటే లక్ష్మి ఆమె పుట్టుకన స్వాగతించాలి అలాగే ఏ కుటుంబంలోనైనా దుఃఖం వచ్చినప్పుడు ఆదుకోవడం మన బాధ్యత ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దండు రాజేష్ జిల్లా అధ్యక్షుడు మోరే గణేష్ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు నేరెళ్ల సంతోష్ గాజుల శ్రీనివాస్



పెంట సాంబయ్య పోచయ్య కాసర్ల రమేష్ రాజేందర్ పాల్గొన్నారు.

## పోక్సో కేసులో సిరిసిల్ల కోర్టు సంచలన తీర్పు...

**-నిందితుడుకి 20 సంవత్సరాల జైలు శిక్ష, రు.5000/- జరిమానా**

**-పోలీసు ప్రాసిక్యూషన్ సమన్వయంతో నిందితులకు వరుస శిక్షలు..**

**-నిందుతుడికి శిక్ష పడటంలో కృషి చేసిన అధికారులను, పిపి, సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీ.**

గంభీరావుపేట జూన్ 9 (ప్రజా జ్యోతి):
గంభీరావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన (పోక్సో) కేసులో నిందుతుడికి 20 సంవత్సరాలు జైలు ,5000/- రూపాయల జరిమానా విధిస్తూ సిరిసిల్ల పోక్సో కోర్టు ప్రధాన న్యాయమూర్తి రాధికా జైస్వాల్ మంగళవారం తీర్పు వెల్లడించినట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. గంభీరావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక మైనర్ బాలికను గోరింటాకు గ్రామానికి చెందిన కోటగిరి శ్రీనివాస్ అనే వ్యక్తి వేధింపులకి గురి చేయగా బాధితురాలి తండ్రి ఫిర్యాదు మెరకు గంభీరావుపేట పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి అప్పటి సిరిసిల్ల డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి దర్యాప్తు అనంతరం నిందితుడిని రిమాండ్ కి



తరలించారు.అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయడం జరిగింది. కోర్టు విచారణలో భాగంగా అదనపు ఎస్పీ చంద్రయ్య పర్యవేక్షణలో కోర్టు మానిటరింగ్ ఎస్.ఐ రవీందర్ నాయుడు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుళ్ శ్రీనివాస్, సి ఎం ఎస్ కానిస్టేబుళ్ నవీన్, పోక్సో కోర్టు కానిస్టేబుల్ వెన్నెల కోర్టులో 15 మంది సాక్షులను ప్రవేశపెట్టగా ప్రాసిక్యూషన్ తరుపున గత పబ్లిక్ ప్రాసిక్యూటర్ పెంట శ్రీనివాస్ గారు వాదించగా, శాస్త్రీయ ఆధారాలు, సాక్షులను పరిశీలించిన న్యాయమూర్తి నేరము రుజువు కావడంతో నిందితుడైన కోటగిరి శ్రీనివాస్ కి 20 సంవత్సరాలు జైలు శిక్ష , 5000/-జరిమాన విధించారు.

సమాజంలో నేరం చేసిన వారు ఎవరూ శిక్ష నుండి తప్పించుకోలేరని శిక్షల ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని జిల్లా ఎస్పీ తెలిపారు.

ఈకేసులో పకడ్బందీగా దర్యాప్తు చేపట్టి నిందితునికి శిక్ష పడటంలో కృషి చేసిన అదనపు ఎస్పీ చంద్రయ్య, అప్పటి డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, ప్రస్తుత డిఎస్పీ నాగేంద్రచారి,పబ్లిక్ ప్రాసిక్యూటర్ పెంట శ్రీనివాస్,గంబిరావుపేట ఎస్.ఐ శ్రీకాంత్,కోర్టు మానిటరింగ్ ఎస్.ఐ రవీందర్ నాయుడు,కోర్టు కానిస్టేబుల్ శ్రీనివాస్, సిఎంఎస్ కానిస్టేబుల్ నవీన్, పోక్సో కోర్టు కానిస్టేబుల్ వెన్నెలలను జిల్లా ఎస్పీ అభినందిచారు.

## పెద్దపల్లి జిల్లాలో ధాన్యం సేకరణ ప్రక్రియ విజయవంతం

**4.21 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు**

**రైతుల ఖాతాల్లో రూ.998 కోట్లకు పైగా చెల్లింపులు**

**జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ ముప్పిడి శ్రీకాంత్ వెల్లడి**

పెద్దపల్లి ప్రతినిధి, జూన్ 9 ప్రజా జ్యోతి:
యాసంగి 2025-26 సీజన్‌లో పెద్దపల్లి జిల్లాలో ధాన్యం సేకరణ ప్రక్రియ విజయవంతంగా కొనసాగుతోందని జిల్లా పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ ముప్పిడి శ్రీకాంత్ తెలిపారు. జిల్లాలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 4,21,366.53 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. పెద్దపల్లి జిల్లాలో రవి పంట కాలంలో ధాన్యం సేకరణ పై ప్రజా జ్యోతి ప్రతినిధికి జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ ముప్పిడి శ్రీకాంత్ మంగళవారం ప్రత్యేకంగా మాట్లాడారు. జిల్లాలో మొత్తం 334 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రతిపాదించగా, అన్ని కేంద్రాలు ప్రారంభించబడ్డాయని చెప్పారు. వీటిలో ఇప్పటివరకు 305 కేంద్రాలు కొనుగోళ్లు పూర్తి చేయగా, మరో 29 కేంద్రాల్లో కొనుగోళ్లు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. కొనుగోలు చేసిన ధాన్యంలో 4,16,847.99 మెట్రిక్ టన్నుల సాధారణ రకం (కామన్), 4,518.54 మెట్రిక్ టన్నుల సన్న రకం (ఫైన్) ధాన్యం ఉన్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 4,21,135.01 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులకు తరలించగా, కేవలం 231.52 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉందని వివరించారు. జిల్లాలోని 56,742 మంది రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. కొనుగోలు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియలో 96 శాతం ఎంట్రీలు పూర్తయ్యాయని, మిల్లులకు తరలింపు ప్రక్రియ 93 శాతం, రైతులకు చెల్లింపులు 93 శాతం మేర పూర్తయ్యాయని తెలిపారు. రైతులకు ఇప్పటివరకు రూ.998.84 కోట్ల మేర చెల్లింపులు జరిగాయని, మిగిలిన చెల్లింపులను కూడా



త్వరితగతిన పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్నారని వెల్లడించారు. జిల్లాలో ధాన్యం నిల్వలు, రవాణా, మిల్లింగ్ ప్రక్రియలు సజావుగా కొనసాగుతున్నాయని, కొనుగోలు కేంద్రాల సిబ్బంది, మిల్లర్లు, రవాణా సంస్థల సమన్వయంతో లక్ష్యాలను సాధిస్తున్నామని జిల్లా మేనేజర్ ముప్పిడి శ్రీకాంత్ తెలిపారు.

## అప్పుల భారం తాళలేక కౌలు రైతు బలవన్మరణం

**పంట దిగుబడి తగ్గడంతో మనస్తాపం**

**కౌలు చేసిన పొలం వద్దే విషం సేవించి ఆత్మహత్య**

బుగ్గారం,జూన్ 09( ప్రజాజ్యోతి ):
పంట దిగుబడి తగ్గడం, అప్పుల భారం పెరగడంతో మనస్తాపానికి గురైన ఓ కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన జగిత్యాల జిల్లా బుగ్గారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. కౌలుకు సాగు చేసిన పొలం సమీపంలోనే ఆయన మృతదేహం లభించడం గ్రామంలో విషాదాన్ని నింపింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బుగ్గారం గ్రామానికి చెందిన మానాల పెద్ద దుబ్బయ్య (60) పలువురు రైతుల భూములను కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవల సాగు చేసిన వరి పంట ఆశించిన మేర దిగుబడి ఇవ్వకపోవడంతో పాటు పంటకు గిట్టుబాటు ధర కూడా లభించలేదు. దీంతో పెట్టుబడి ఖర్చులు, అప్పులు, భూ యజమానులకు చెల్లించాల్సిన కౌలు సొమ్ము ఎలా చెల్లించాలనే ఆందోళనలో ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గత కొన్ని రోజులుగా తీవ్ర మనోవేదనతో ఉన్న దుబ్బయ్య సోమవారం మధ్యాహ్నం జగిత్యాలకు వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి బయలుదేరాడు. రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువుల వద్ద, పరిసర ప్రాంతాల్లో గాలించారు. అయినప్పటికీ ఆయన ఆచూకీ లభించలేదు. మంగళవారం ఉదయం బుగ్గారం శివారులోని చందయ్యపల్లి రహదారి సమీపంలో, ఆయన కౌలుకు సాగు చేసిన పొలం వద్ద విగతజీవిగా కనిపించాడు. సమాచారం అందుకున్న బుగ్గారం ఎస్సై జి.సతీష్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి కుమారుడు మానాల లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు, వ్యవసాయ నష్టాలు, అప్పుల కారణంగా మనస్తాపానికి గురై గుర్తు తెలియని విష పదార్థం సేవించి ఆత్మహత్య చేసుకున్నట్లు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించి, అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది. దుబ్బయ్యకు భార్య, ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ పెద్దను కోల్పోవడంతో వారి ఇంట విషాద ఛాయలు అలుముకున్నాయి. గ్రామస్తులు కూడా రైతు మృతిపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

## నాచుపల్లిలో ఘనంగా ఎల్లమ్మ బోనాలు

కొడిమ్యాల,జూన్ 09,(ప్రజాజ్యోతి):
మండలం నాచుపల్లి గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా ఎల్లమ్మ బోనాల జాతర నిర్వహించారు. ఐదేళ్లకు ఒకసారి శ్రీ



రేణుకా ఎల్లమ్మ తల్లి సిద్దోగంలో భాగంగా ఎల్లమ్మ బోనాలు తీయడం గౌడ కులస్తుల ఆచారంగా భావిస్తారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు తాళ్లపెల్లి అంజయ్య గౌడ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజుల అజయ్ గౌడ్, కొండగట్టు మాజీ డైరెక్టర్ గాజుల శంకర్ గౌడ్, పల్లె రాంగోపాల్ గౌడ్, పల్లె రవి గౌడ్, కోల రవి గౌడ్, తాళ్ళపెల్లి విక్రమ్ గౌడ్, సాయినాథ్ గౌడ్, రంజిత్ గౌడ్, గవాస్కర్ గౌడ్, ప్రభాకర్ గౌడ్, గౌడ కులస్తులు పాల్గొన్నారు.

## వాహనాలను తనిఖీ చేసిన పోలీసులు

కాల్వ శ్రీరాంపూర్ జూన్ 9 (ప్రజా జ్యోతి)
కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలోని. తహసిల్దార్ కార్యాలయం ముందు. రహదారిపై. మంగళవారం రోజున పోలీసులు వాహనాలను తనిఖీలు చేపట్టారు. లైసెన్స్ లేని వాహనాలకు జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ సంపతి. పోలీసు సిబ్బంది సుమన్ ఉన్నారు.



## మండల పార్టీ అధ్యక్షుడు కి ఘన సన్మానం

సత్తుపల్లి జూన్ 09(ప్రజా జ్యోతి)
మండల పరిధిలోని రేజర్ల గ్రామంలో గల భీమిరెడ్డి సుబ్బారెడ్డి,సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఇటీవల మండల పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టడంతో, మంగళవారం కిష్టారం గ్రామానికి చెందిన యువ



నాయకులు వారి స్వగృహానికి వెళ్లి బోకే, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పుచ్చకాయల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ చిన్న వయసులో పెద్ద బాధ్యత గల మండల పార్టీ అధ్యక్షుడు బాధ్యత చేపట్టటం మామూలు విషయం కాదని, భవిష్యత్తులో ఇంకా మంచి సేవలు ప్రజలకు అందిస్తూ, ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో బాల కిరణ్, సుమన్,వెంకటేశ్వ రావు, సుబ్బారావు, ఉడతనేని ప్రసాద్ తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ భూములను గుర్తించండి మంత్రి పొంగులేటి

### ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే ఎట్టి పరిస్థితులను వదలొద్దు మంత్రి పొంగులేటి

సత్తుపల్లి జూన్09(ప్రజా జ్యోతి)
తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మంగళవారం పట్టణంలోని వేశ్యకాంతల చెరువును పరిశీలించారు. ఇటీవల ప్రభుత్వ భూమి ఉన్నదని గమనించి స్థానిక శాసన సభ్యురాలు దానిని మొత్తం శుభ్రం చేసినారు. ఈ సందర్భంగా ఆయన పరిశీలించి,ప్రభుత్వ భూమి ఎవరు ఆక్రమించినా వదిలే ప్రసక్తి లేదని, వెంటనే సర్వే చేసి ఫెన్సింగ్ వేయాలని, ప్రభుత్వ భూమి పేదవాడికి మాత్రమే చెందాలని, రెవెన్యూ అధికారులకు తెలిపారు. భూమి అక్రమనకు



గురైందని ఆయనకి తెలుపటంతో పూర్తి సర్వే చేసి ప్రభుత్వానిది అయితే ప్రభుత్వానికి ఉంచండి, ప్రైవేటు వ్యక్తులదైతే వారి భూమి వారికే ఇవ్వండి, ప్రభుత్వానికి సంబంధించిన భూమి మొత్తం సర్వే చేసి అప్పు చెప్పాలని,ఆ భూమి పేదలకు మాత్రమే పంచుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, తాసిల్దార్ సత్యనారాయణ, మున్సిపల్ చైర్ పర్సన్ రెహానా కమల్, వైస్ చైర్పర్సన్ బొంతు సుమలత, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, వార్డ్ కౌన్సిలర్లు మట్టా ప్రసాద్,దూదిపాల రాంబాబు,కొత్తూరు ఉప సర్పంచ్ గొర్లమారి రామ్మోహన్ రెడ్డి,మందపాటి ప్రభాకర్ రెడ్డి,కాంగ్రెస్ నాయకులు, పొంగులేటి అభిమానులు లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## చెన్నకేశవులకు మట్టా పరామర్శ

సత్తుపల్లి జూన్09(ప్రజా జ్యోతి)
మండల పరిధిలోని రుద్రాక్ష పల్లి గ్రామపంచాయతీలో గల రెండవ వార్డ్ నెంబర్ గంట చెన్నకేశవులు ఇటీవల ప్రమాదానికి గురై, కాలుకి గాయాలు అయ్యాయి. ఈ విషయాన్ని తెలుసుకున్న సీనియర్ కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ రఘురాం



హాస్పిటల్ కి వెళ్లి,ఆయన ఆరోగ్య పరిస్థితిపై పరిశీలించి, డాక్టర్ తో మాట్లాడి విషయాలను తెలుసుకున్నారు. జాగ్రత్తగా ఉండాలని, మందులు మంచిగా వాడాలని,పలు సూచనలు,సలహాలు కేశవులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పాయం నాగేంద్రబాబు,ఉప సర్పంచ్ భూపతిరెడ్డి,భరత్ కుమార్, పంచాయతీ వార్డు మెంబర్స్,కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు ఉన్నారు.

## మెరుగైన విద్యుత్ సేవలు అందించటమే సంస్థ లక్ష్యం

- కిలో మీటర్ లోపు ఉచితంగా విద్యుత్ లైన్ ఏర్పాట్లు
- విద్యుత్ శాఖ కూసుమంచి ఏడీ పి.వెంకట్

నేలకొండపల్లి, జూన్ 9 ప్రజా జ్యోతి:
మెరుగైన విద్యుత్ సేవలు అందించటమే సంస్థ లక్ష్యమని విద్యుత్ శాఖ కూసుమంచి ఏడీ పి.వెంకట్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని విద్యుత్ కార్యాలయం ను మంగళవారం ఆకస్మికంగా తనీఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. సిబ్బందితో ప్రత్యేక సమావేశం ను నిర్వహించారు. అనంతరం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు...ఒక కిలో మీటర్ దూరం లో నూతనంగా విద్యుత్ లైన్ ను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ఉచితంగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశం ను గృహా. వ్యవసాయ విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డివిజన్ వ్యాప్తంగా 29,307 మంది లబ్దిదారులు గృహాజ్యోతి పథకం ను వినియోగించుకుంటున్నారని పేర్కొన్నారు. గత నెలలో గృహా జ్యోతి పథకం కింద 200 యూనిట్ల ను వినియోగించుకున్నందుకు రూ.1,16 కోట్ల ను ప్రభుత్వం చెల్లించినట్లు తెలిపారు. ఇటీవల ఈదురుగాలులు, వర్షాలకు డివిజన్ వ్యాప్తంగా పెద్ద ఎత్తున స్థంబాలు విరిగినట్లు తెలిపారు. నేలకొండపల్లి మండలం



లోనే 215 స్థంబాలు విరిగినట్లు పేర్కొన్నారు. సిబ్బంది రాత్రింబవళ్లు కష్టపడి పునరుద్ధరణ పనులు సకాలంలో పూర్తి చేశారని అన్నారు. ప్రజాదర్బార్ లో డివిజన్ వ్యాప్తంగా 1,112 దరఖాస్తులు విద్యుత్ సమస్యల పై అందినట్లుతెలిపారు. వాటిని పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యక్రమం చేపడుతునట్లు తెలిపారు. చెరువు మాధారం లో సోలార్ విద్యుత్ పనులు మరో 20 రోజులలో పూర్తి చేసి వినియోగంలోకి తీసుకరానున్నట్లు తెలిపారు. పెండింగ్ బిల్లుల వసూళ్ల కు స్పెషల్ డ్రైవ్ చేపట్టనున్నట్లు తెలిపారు. విద్యుత్ చౌర్యం ను సహించేది లేదని హెచ్చరించారు. ఎక్కడైనా చౌర్యం జరిగితే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. మెరుగైన విద్యుత్ సేవలు అందించేందుకు వినియోగదారులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి ఏఈ జీ.రవి, సిబ్బంది పాల్గొన్నారు.

## మత్కేపల్లి వ్యవసాయ మర్కెట్ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం

చింతకాని జూన్ 09ప్రజాజ్యోతి :
రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సిపార్సుతొ మంజూరయిన జగన్నాధపురం రైతు వేదిక నుండి మత్కేపల్లి– పందిళ్ళపల్లి పీఆర్



రోడ్డు వరకు వయా నూతన వ్యవసాయ మార్కెట్ రూ.4.50 కోట్ల వ్యయంతో చేపట్టనున్న బిటి రోడ్డు నిర్మాణానికి సంబంధించిన జంగిల్ క్లియరెన్స్ పనులను ★మత్కేపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎఎంసి చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు గారు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రహదారులే పునాది అని .ఈ బీటీ రోడ్డు నిర్మాణం పూర్తయితే పరిసర గ్రామాల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వచ్చి ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుంది అని అలాగే వ్యవసాయ ఉత్పత్తుల రవాణా సులభతరమై ఈ ప్రాంత అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు.ఈ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసిన తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు కు గ్రామ రైతులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జగన్నాధపురం గ్రామ సర్పంచ్ తాళ్లూరు స్వప్న, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బందెల నాగార్జున,మత్కేపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కంచం కోటేశ్వరరావు,కాంగ్రెస్ నాయకులు బోలికొండ రామారావు,తాళ్లూరి రమేష్, నర్సింశెట్టి చలమయ్య,తాడుకూరి సతీష్,బండారుపల్లి వెంకటప్పయ్య,మెట్టెల రమేష్, షేక్ సైదా తదితరులు పాల్గొన్నారు.

## ఫిట్ లెస్..!

-బడి బస్సులకు నిర్వహించని ఫిట్‌నెస్ పరీక్షలు
-కాలం చెల్లిన బస్సులతో నెట్టుకొస్తున్న విద్యాసంస్థలు?
-ఇల్లందులో దాదాపు బస్సులు ఆన్ ఫిట్?
-ఆందోళనకు గురవుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు!
-అధికారులు జర స్పందించరూ

ఇల్లందు, జూన్ 9 (ప్రజా జ్యోతి):
కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైనా ఇల్లందు పట్టణంలోని పలు ప్రైవేటు విద్యాసంస్థల బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు ఇప్పటివరకు నిర్వహించకపోవడం ఏమిటో అర్థం కాని పరిస్థితి నెలకొంది. దీంతో చాలా బస్సులు ఫిట్నెస్ లేకుండానే రోడ్డెక్కుతున్నాయి.
విద్యార్థుల భద్రతకు అత్యంత కీలకమైన వాహన సామర్థ్య పరీక్షలను పాఠశాలల యాజమాన్యాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి సంవత్సరం మే 15 నుంచి జూన్ 12 వరకు తప్పనిసరిగా నిర్వహించాల్సిన ఫిట్‌నెస్ పరీక్షలను అనేక విద్యాసంస్థలు ఇప్పటికీ పూర్తి చేయకపోవడం చర్చనీయాంశంగా మారింది.

**విద్యార్థుల భద్రతపై నిర్లక్ష్యం..!**

పాఠశాలలకు చెందిన బస్సులు ప్రతిరోజూ వందలాది మంది విద్యార్థులను గ్రామాలు, కాలనీల నుంచి పాఠశాలలకు తరలిస్తున్నాయి. అయితే వాటిలో కొన్ని బస్సులు పాతబడిపోయి, సాంకేతిక లోపాలతో ఉన్నప్పటికీ యాజమాన్యాలు వాటినే వినియోగిస్తున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించకుండా రోడ్లపైకి తీసుకురావడం ద్వారా విద్యార్థుల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టేస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**నిబంధనలున్నా అమలు ఎక్కడ..?**

రవాణా శాఖ నిబంధనల ప్రకారం ప్రతి స్కూల్ బస్సు తప్పనిసరిగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కలిగి ఉండాలి. బస్సుకు పసుపు రంగు ఉండటంతో పాటు నాలుగు వైపులా పాఠశాల పేరు స్పష్టంగా రాసి ఉండాలి. హెవీ డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు కనీసం ఐదేళ్ల అనుభవం ఉన్న డ్రైవర్‌ను మాత్రమే నియమించాలి. డ్రైవర్ యూనిఫామ్ ధరించడం, విద్యార్థులను పరిమితికి మించి ఎక్కించకపోవడం, అత్యవసర భద్రతా పరికరాలు ఏర్పాటు చేయడం వంటి నిబంధనలు కూడా తప్పనిసరి. కానీ వీటిలో చాలా వరకు అమలు కావడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.




**అడిగేవారు లేరనే ధీమానే కారణమా..?**

ప్రతి సంవత్సరం ఫిట్‌నెస్ పరీక్షల గడువు సమీపించినప్పుడే కొందరు యాజమాన్యాలు స్పందిస్తుండగా, మరికొన్ని విద్యాసంస్థలు పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని సమాచారం. తనిఖీలు లేకపోవడం, చర్యలు తీసుకునే అధికారులు కనిపించకపోవడంతో యాజమాన్యాలు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది..?**

ఫిట్‌నెస్ లేని బస్సులు రోడ్లపై తిరగడం వల్ల ఎప్పుడైనా ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బ్రేకులు, టైర్లు, స్టీరింగ్ వ్యవస్థ, అత్యవసర ద్వారాలు వంటి అంశాలను పరీక్షించకుండా విద్యార్థులను తరలించడం ప్రమాదకరమని పేర్కొంటున్నారు. ఏదైనా దుర్ఘటన జరిగితే బాధ్యత ఎవరు తీసుకుంటారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఫిట్‌నెస్ లేని బస్సులను వెంటనే గుర్తించి సీజ్ చేయడంతో పాటు నిబంధనలు ఉల్లంఘిస్తున్న యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. విద్యార్థుల ప్రాణాల కంటే ఏదీ ముఖ్యమేమీ కాదని, భద్రతా ప్రమాణాల విషయంలో రాజీ పడకూడదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి ఫిట్‌నెస్ లేని బస్సుల వల్ల విద్యార్థుల ప్రాణాలకు ముప్పు కలిగే అవకాశం ఉన్నందున తనిఖీలు చేపట్టి అన్‌ఫిట్ వాహనాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. అదిశగా అధికారులు ముందుకు సాగాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## నిషేధమా... నువ్వెక్కడ...?

-జిల్లా వ్యాప్తంగా విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగం
- నిషేధం ఉన్నా యథేచ్ఛగా విక్రయాలు
- పర్యావరణం, ప్రజారోగ్యానికి పెరుగుతున్న ముప్పు
 కఠిన చర్యలు, ప్రజల్లో అవగాహనతోనే
-నియంత్రణ

పర్యావరణ పరిరక్షణ, ప్రజారోగ్య భద్రత కోసం కేంద్ర ప్రభుత్వం సింగిల్-యూజ్ ప్లాస్టిక్‌పై నిషేధం విధించి సంవత్సరాలు గడుస్తున్నా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా దాని అమలు ప్రశ్నార్థకంగా మారింది. పట్టణాల నుంచి ఏజెన్సీ గ్రామాల వరకు నిషేధిత ప్లాస్టిక్ క్యారీబ్యాగులు, గ్లాసులు, కప్పులు, ప్యాకేజింగ్ వస్తువులు యథేచ్ఛగా విక్రయమవుతుండగా, నియంత్రణ చర్యలు ఆశించిన స్థాయిలో కనిపించడం లేదు. ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి, జీవరాశులకు, మానవ ఆరోగ్యానికి తీవ్ర ముప్పు పొంచి ఉన్నప్పటికీ వినియోగం మాత్రం తగ్గడం లేదు. ఈ నేపథ్యంలో జిల్లాలో ప్లాస్టిక్ నిషేధం అమలు పరిస్థితులపై ప్రజా జ్యోతి ప్రత్యేక కథనం.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి జూన్ 9(ప్రజా జ్యోతి):
కేంద్ర ప్రభుత్వం నిషేధించిన సింగిల్–యూజ్ ప్లాస్టిక్ వస్తువుల వినియోగం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా నిరాటంకంగా కొనసాగుతోంది. ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టేందుకు చట్టాలు, నిబంధనలు అమల్లో ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో వాటి అమలు కనిపించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు సులభంగా లభిస్తుండటంతో నిషేధం కేవలం ఉత్తర్వులకే పరిమితమైందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తక్కువ ఖర్చు, సులభ వినియోగం కారణంగా ప్లాస్టిక్ వస్తువుల వినియోగం రోజురోజుకూ పెరుగుతోంది. కూరగాయల దుకాణాలు, పండ్ల వ్యాపారులు, హోటళ్లు, టీ స్టాళ్లు, మెడికల్ షాపులు, చికెన్, మటన్ కేంద్రాలు, చిరు వ్యాపార సంస్థలు అధికంగా ప్లాస్టిక్ సంచులు, కప్పులు వినియోగిస్తున్నాయి. దీంతో నిషేధం అమలుపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**ఆచరణలో కనిపించని నిషేధం**

కొన్ని సంవత్సరాల క్రితం ప్లాస్టిక్ నిషేధంపై అధికారులు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి, వ్యాపారులపై జరిమానాలు విధించారు. ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు కూడా చేపట్టారు. అయితే ప్రస్తుతం అలాంటి చర్యలు చాలా అరుదుగా కనిపిస్తున్నాయి. ఫలితంగా నిషేధిత ప్లాస్టిక్ విక్రయాలు, వినియోగం యథేచ్ఛగా కొనసాగుతున్నాయి.

**పెరుగుతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు**

జిల్లాలో ప్రతిరోజూ లక్షల సంఖ్యలో ప్లాస్టిక్ గ్లాసులు, టీ కప్పులు, క్యారీబ్యాగులు, నీటి సీసాలు వినియోగంలోకి వస్తున్నట్లు అంచనాలు చెబుతున్నాయి. బిస్కెట్లు, నూనెలు, షాంపూలు, ఇతర వస్తువుల ప్యాకేజింగ్ ద్వారా కూడా భారీ స్థాయిలో ప్లాస్టిక్ వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి. ఈ వ్యర్థాలు కాలువలు, డ్రైయిన్లు, రహదారుల పక్కన పేరుకుపోయి పర్యావరణ కాలుష్యానికి కారణమవుతున్నాయి.

**పర్యావరణానికి పెను ముప్పు**

ప్లాస్టిక్ భూమిలో పూర్తిగా కలిసిపోవడానికి వందల ఏళ్ల సమయం పడుతుంది. ఈ క్రమంలో నేల సారం తగ్గిపోవడంతో పాటు భూగర్భ జలాలు కూడా కలుషితమవుతాయి. ప్లాస్టిక్ వ్యర్థాలు చెరువులు, వాగులు, నదుల్లోకి చేరి జలచరాల మనుగడకు ప్రమాదంగా మారుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా లక్షలాది పక్షులు, సముద్ర జీవులు ప్లాస్టిక్ వ్యర్థాల కారణంగా ప్రాణాలు కోల్పోతున్నట్లు పర్యావరణ నిపుణులు చెబుతున్నారు.

**ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం**

ప్లాస్టిక్‌ను కాల్చినప్పుడు విడుదలయ్యే డయాక్సిన్లు, ఫ్యూరాన్లు వంటి విషవాయువులు క్యాన్సర్ సహా పలు ప్రమాదకర వ్యాధులకు కారణమవుతాయి. నాసిరకం ప్లాస్టిక్ సంచుల్లో వేడి ఆహార పదార్థాలు నిల్వ చేయడం వల్ల హానికర రసాయనాలు ఆహారంలో కలిసే ప్రమాదం ఉంది. ప్లాస్టిక్ తయారీలో ఉపయోగించే కొన్ని లోహాలు, రసాయనాలు మానవ ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**కఠిన చర్యలతోనే ఫలితం**

నిబంధనల ప్రకారం అధికారులు మార్కెట్లు, వ్యాపార కేంద్రాల్లో నిరంతర తనిఖీలు నిర్వహించి నిషేధిత ప్లాస్టిక్ స్వాధీనం చేసుకోవాలి. ఉల్లంఘనలకు పాల్పడే వారిపై జరిమానాలు విధించడంతో పాటు ప్రజల్లో అవగాహన కల్పించాలి. అలాగే పర్యావరణహిత ప్రత్యామ్నాయాల వినియోగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. అధికారులు, వ్యాపారులు, ప్రజలు సమష్టిగా కృషి చేసినప్పుడే ప్లాస్టిక్ నిషేధం ఆశించిన ఫలితాలను ఇస్తుందని పర్యావరణవేత్తలు అభిప్రాయపడుతున్నారు.

**ఉత్తర్వులకే పరిమితం:గోళ్ళ భూపతిరావు ,పర్యావరణ ప్రేమికుడు**

ప్లాస్టిక్ నిషేధం కేవలం ప్రభుత్వ ఉత్తర్వులతోనే ఫలించదు. ప్రజలు, వ్యాపారులు, అధికారులు సమష్టిగా బాధ్యత తీసుకున్నప్పుడే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుంది. ప్లాస్టిక్ వల్ల నేల, నీరు, గాలి కలుషితమై భవిష్యత్ తరాల ఆరోగ్యానికి ముప్పు ఏర్పడుతోంది. ప్రత్యామ్నాయ పదార్థాల వినియోగాన్ని ప్రోత్సహిస్తూ







నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలి.

**చిన్ననాటి నుంచే అవగాహన అవసరం:భూక్యా కిషోర్ సింగ్ ,ప్రభుత్వ ఉపాధ్యాయుడు**

ప్లాస్టిక్ నిషేధం విజయవంతం కావాలంటే విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే పర్యావరణ బాధ్యతను పెంపొందించాలి. పాఠశాల స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, పర్యావరణహిత జీవనశైలిని అలవాటు చేయాలి.

## ప్రపంచ తెలుగు మహాసభలో పల్లం పిచ్చయ్యకు అభినందన

సత్తుపల్లి జూన్09(ప్రజా జ్యోతి)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని రాజమహేంద్రవరంలో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభ లలో పాల్గొన్న పల్లం పిచ్చయ్యను నిర్వాహకులు ఘనంగా అభినందించారు.చైతన్య సారస్వత పరిషత్తు మరియు శ్రీ శ్రీ కళా వేదికల ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన ఈ సభలో పిచ్చయ్య కవితా గానంలో భాగంగా ప్రతి అక్షరం అనే స్వీయ కవితను చదివారు.ఈ సందర్భంగా పిచ్చయ్యను చైతన్య సారస్వత పరిషత్తు అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ చైతన్య రాజు,శ్రీశ్రీ కళాపరిషత్ సిఈఓ కత్తిమండ ప్రతాప్,సంస్థ జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరీభూషణం,జాతీయ కన్వీనర్ టి.పార్థసారధి,గ్లోబల్ యూనివర్సిటీ డైరెక్టర్ శ్రీనివాసరావు తదితర ప్రముఖులు శాలువా,జ్ఞాపికలతో సత్కరించారు.ఈ సందర్భంగా పిచ్చయ్యకు సృజన సాహితీ సమాఖ్య నిర్వాహకులు అభినందనలు తెలిపారు.



## బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మరీదు రామకృష్ణ గౌడ్

చింతకాని జూన్ 9 ప్రజాజ్యోతి :
మండలపరిధిలోని చిన్నమండవ గ్రామంలో గల జిల్లాపరిషత్ హైస్కూల్ వారు నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో,గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మరీదు రామకృష్ణ గౌడ్ పాల్గొని తనవంతుగా రెండు అడ్మిషన్స్ ఇవ్వడం జరిగినది,ఈ సందర్భంగా వారు తల్లిదండ్రులతో మాట్లాడుతూ మన గ్రామ ప్రభుత్వ బడిని ప్రోత్సహించాలని వారికీ తెలియజేశారు,ఈరోజు కాశీమాల రాజేష్,వేముల సైదులు, వారి పిల్లలని ప్రైవేట్ పాఠశాల నుండి మార్పించి ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్ పొందినారు,ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వారి సిబ్బంది మరియు విద్యార్థులు,వారి తల్లిదండ్రులు అందరూ పాల్గొన్నారు.

## రెండు తెలుగు రాష్ట్రాల నృత్య పోటీల బ్రోచర్ ఆవిష్కరణ

ఇల్లందు, జూన్ 9, (ప్రజా జ్యోతి)
కీర్తిశేషులు బాల, సాయి జ్ఞాపకార్థం వెంకట్ డాన్స్ అకాడమీ వివిసిసి యూత్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 14న ఇల్లందులోని సీనియర్ క్లబ్లో జరిగే తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల స్థాయి నృత్య పోటీల బ్రోచర్ ను మంగళవారం రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కలలు యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, సృజనాత్మకతను పెంపొందిస్తాయన్నారు. గ్రామీణ పట్టణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన యువ కళాకారులకు ఇటువంటి పోటీలు తమ ప్రతిభను చాటుకునేందుకు మంచి వేదికగా నిలుస్తారని తెలిపారు. అనంతరం నిర్వాహకులు మాట్లాడుతూ జూన్




14వ తేదీ ఉదయం 9 గంటల నుండి పోటీలు ప్రారంభమవుతాయని, వెస్ట్రన్, ఫోక్, క్లాసికల్ విభాగాల్లో జూనియర్, సీనియర్ కేటగిరిలతోపాటు సోలో, డ్యూయెట్ విభాగాలలో అవకాశం ఉంటుందన్నారు. పోటీదారులు తమ నృత్య గీతాలను పెన్ డ్రైవ్ లేదా మొబైల్ ఫోన్లో తీసుకురావాలని సూచించారు. క్లాసికల్ నృత్యానికి 5 నిమిషాలు, ఫోక్, వెస్ట్రన్ నృత్యాలకు 4 నిమిషాల సమయం ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి విభాగంలో కనీసం 10 ఎంట్రీలు నమోదు అయితేనే బహుమతులు ప్రధానం చేయబడతాయని, విజేతల ఎంపికలో న్యాయ నిర్ణేతలదే తుది నిర్ణయమని స్పష్టం చేశారు. పోటీలలో పాల్గొనే ప్రతి ఒక్కరికి ప్రశంసా పత్రంతో పాటు ఉచిత భోజన సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. విజేతలకు ఆకర్షణమైన నగదు బహుమతులు ఉంటాయన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నృత్య కళాకారులు అధిక సంఖ్యలో పాల్గొని పోటీలను విజయవంతం చేయాలని కోరారు. మరిన్ని వివరాలకు కదారి వెంకటేష్ 8374579497, 7989163958, బాల మాస్టర్ 9030099139 నెంబర్లలో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ డ్యాన్స్ మాస్టర్స్ శేఖర్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన

ఇల్లందు, జూన్ 9, (ప్రజా జ్యోతి)
మండలంలోని మర్రిగూడెం గ్రామంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య చొరవతో మంజూరైన 33/11 కెవి నూతన సబ్ స్టేషన్ నిర్మాణానికి



రెవెన్యూ స్థలాన్ని మంగళవారం ఇల్లందు మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, మాజీ వైస్ ఎంపీపీ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మండల రాము లు విద్యుత్ అధికారులతో కలిసి పరిశీలించారు. మర్రిగూడెం గ్రామంలో నూతన 33/11 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించి, త్వరితగతిన పనులు పూర్తిచేసి నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేయటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముక్తి రమేష్, పోలారం ఉప సర్పంచ్ ధరావత్ చంద్రశేఖర్, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# సీ.ఎం.రిలీఫ్ ఫండ్‌తో పేదలకు అండగా నిలుస్తున్నాం

## ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుదీర్ రెడ్డి

రంగారెడ్డి జూన్ 09 (ప్రజాజ్యోతి)
ఎల్.బి.నగర్ నియోజకవర్గం పరిధిలోని కొత్తపేట డివిజన్ రాజీవ్ గాంధీ నగర్ నందు నివాసం ఉంటున్న శివకుమార్(33)కిడ్నీలకు సంబంధించి పలు అనారోగ్య సమస్యలతో బాధపడుతుండగా కుటుంబ ఆర్థిక పరిస్థితి సహకరించకపోవడంతో వారి కుటుంబ సభ్యులు ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుదీర్ రెడ్డిని సంప్రదించారు.వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి వారి వైద్య చికిత్సకు అవసరమైన ఆర్థిక సహాయం కోసం ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎం రిలీఫ్ ఫండ్) ద్వారా దరఖాస్తు



చేయించారు.దీనికి సంబంధించి రెండు లక్షల రూపాయల ఎల్.ఓ.సీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) మంజూరు కాగా బాధిత కుటుంబసభ్యులకు చెక్కును అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుదీర్ రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలకు సేవ చేయడం ద్వారా మాకు ఎంతో సంతృప్తి లభిస్తుందన్నారు.తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎంతోమంది పేద ప్రజలకు సేవ చేసే అదృష్టం దక్కిందన్నారు.
బాధిత కుటుంబ సభ్యులు మాట్లాడుతూ మా కుమారుడి ఆరోగ్య సమస్య విషయంలో సుదీర్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని సహాయం అందించడం ఎంతో ఆనందంగా ఉందని, ఆయనకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ భారస నాయకులు ఆనంతుల రాజిరెడ్డి,దీప్ లాల్,ఇటికల యాదగిరి ,మహ్మద్ యాసిన్,జోగు నాగేష్,బట్టు అంజయ్య, సూర్యకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ముగ్గురి ప్రాణాలు కాపాడి ప్రాణ త్యాగం చేసిన అనురూప్ రెడ్డి అభినందనీయుడు

**ప్రశంసా పత్రం లేఖలో సీఎం రేవంత్ రెడ్డి.**

**నివాళులర్పించిన భువనగిరి ఎంపీ చామల,ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి.**

**ముగ్గురి ప్రాణాలు కాపాడి అమరుడైన అనురూప్ రెడ్డి.**

**అమెరికా నుండి స్వగ్రామానికి అనురూప్ మృతదేహం.**

అబ్దుల్లాపూర్ మెట్టు జూన్ 09(ప్రజాజ్యోతి)
అమెరికాలోని సెబాన్ నదిలో ముగ్గురి ప్రాణాలు కాపాడి తన ప్రాణాలు కోల్పోయిన కోదూరు అనురూప్ రెడ్డి మృతదేహానికి భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి,ఇబ్రహీంపట్నం నియోజకవర్గం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి,తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ ఘనంగా నివాళులర్పించారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్టు మండలం కవాడిపల్లి గ్రామానికి చెందిన కోదూరు రాజేందర్ రెడ్డి దుర్గాభవాని దంపతుల చిన్న కుమారుడు అనురూప రెడ్డి రెండేళ్ల క్రితం అమెరికా వెళ్ళాడు. యూనివర్సిటీ ఆఫ్ నార్త్ టెక్సాస్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ లో మాస్టర్స్ చేసి మరో వారం రోజుల్లో ఉద్యోగంలో చేరాల్సి ఉండగా గత నెల 30వ తేదీన తన స్నేహితులతో కలిసి లూసియానాలోని టోరోడు పార్కు వద్ద సెబాన్ నది వద్దకు వెళ్లారు. ముగ్గురు



స్నేహితులు నీటి లోతులోకి వెళ్లి నీట మునుగగా అనురూపు రెడ్డి తన ధైర్య సాహసాలతో ముగ్గురు స్నేహితులను ఒడ్డుకు లాగి తిరిగి ఒడ్డుకు చేరుకుంటున్న సమయంలో నదిలో వేసిన ఓ వల అతడి కాళ్లకు చుట్టుకుంది, ఈ క్రమంలోని నీట మునిగి అనురూప్ ప్రాణాలు కోల్పోయాడు, పది రోజుల అనంతరం అతడి మృతదేహం మంగళవారం కవాడిపల్లి గ్రామానికి చేరుకోగా గ్రామంలో తీవ్ర విషాదం అలుముకుంది. ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యేలు మల్ రెడ్డి రంగారెడ్డి, మందుల సామిల్ కవాడిపల్లి గ్రామంలోని అనురూప్ మృతదేహంపై పుష్పగుచ్ఛం నుంచి ఘనంగా నివాళులర్పించారు. కుమారుడిని కోల్పోయి శోకసంద్రంలో ఉన్న కుటుంబ సభ్యులను వారు ఓదార్చారు. ఎంతో సమయస్ఫూర్తితో ముగ్గురి ప్రాణాలు కాపాడిన అనురూప్ తన ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరమన్నారు, వారి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు.
బాధిత కుటుంబ సభ్యులకు సీఎం రేవంత్ రెడ్డి ప్రశంసలేఖ ఇతరుల ప్రాణాలను కాపాడే క్రమంలో తన ప్రాణాలను అర్పించిన అనురూపు రెడ్డి సాహసోపేత చర్య అభినందనీయమన్నారు.



ఈ క్రమంలో అతడు ప్రాణాలు కోల్పోవడం విచారకరమన్నారు. అనురూప్ అనురూపు రెడ్డి ధైర్య సాహసాలు, తోటి వారిని కాపాడే క్రమంలో తన ప్రాణాలను సైతం త్యాగం చేసిన తీరు తన మనసును తీవ్రంగా కలచివేసింది అన్నారు. మాతృభూమిపై అతని త్యాగం తెలంగాణ గడ్డపై శాశ్వతంగా నిలిచిపోతుందన్నారు. అనురూప్ రెడ్డి తల్లిదండ్రులకు, సోదరుడు ఆశ్రిత్ రెడ్డికి, కుటుంబ సభ్యులకు సీఎం రేవంత్ రెడ్డి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వారి కుటుంబ సభ్యులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పిస్తూ అందించిన లేఖను ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి చేతుల మీదుగా వారి కుటుంబ సభ్యులకు అందజేశారు.కవాడి పల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ కొలను ప్రసన్న లక్ష్మి రవీందర్ రెడ్డి అనురూపు రెడ్డి మృతదేహానికి ఘనంగా నివాళులర్పించారు.కవాడి పల్లి గ్రామంలో ఇలాంటి దురదృష్టకర సంఘటన చోటు చేసుకోవడం విచారకరమన్నారు.

# జిల్లా సమగ్ర అభివృద్ధికి అధికారులు సమన్వయంతో కృషి చేయాలి

**ఇండస్ట్రియల్ హబ్‌గా వెలుగొందు తున్న జిల్లా అభివృద్ధిలో మరింత ముందుకు సాగాలి**

**రైతులను క్రాప్ డైవర్షన్, ఆయిల్ పామ్ సాగు వైపు ప్రోత్సహించాలి**

**ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులందరికీ చేరేలా చర్యలు తీసుకోవాలి**

**జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి**

**గ్రామీణ ప్రాంతాల యువతులను నర్సింగ్ విద్య వైపు ప్రోత్సహించాలి**

**ఆసుపత్రుల్లో అవసరమైన వైద్య మౌలిక వసతులు కల్పించాలి**

**వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ**

ప్రజా జ్యోతి ప్రతినిధి సంగారెడ్డి, జూన్ 09:
జిల్లా సమగ్ర అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని రాష్ట్ర కార్మిక, ఎంప్లాయిమెంట్ శాఖ మరియు జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి సూచించారు. తాగునీరు, వ్యవసాయం, విద్య, వైద్యం, గృహ నిర్మాణం, రవాణా, ఆర్ అండ్ బి, పిసిబి, పి ఆర్, విద్యుత్, డి ఆర్ డి ఏ, సంక్షేమ శాఖలు, ఆర్టీసీ, షుగర్ కేన్, పరిశ్రమలు, తదితర రంగాల పురోగతిపై మంగళవారం నిర్వహించిన జిల్లా సమీక్ష సమావేశంలో ఆయా శాఖల అధికారులు తీసుకోవాల్సిన చర్యలపై మంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ, ఇండస్ట్రియల్ హబ్‌గా వేగంగా అభివృద్ధి చెందుతున్న సంగారెడ్డి జిల్లా మరింత పురోగతి సాధించేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వ్యవసాయ రంగంలో రైతులను క్రాప్ డైవర్షన్ వైపు ప్రోత్సహిస్తూ, లాభదాయక పంట అయిన ఆయిల్ పామ్ సాగుపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని ఆదేశించారు. వ్యవసాయ, రెవెన్యూ, పోలీసు శాఖలు సమన్వయంతో ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి ఎలాంటి అక్రమాలు జరగకుండా చూడాలని, రైతులకు యూరియా, డీఏపీ తదితర ఎరువుల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు సరైన సాంకేతిక మార్గదర్శకత్వం అందించి ఆయిల్ పామ్ సాగు వైపు మళ్లించాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా అమలవుతోందని, గూడు లేని పేదలకు సొంత ఇల్లు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. అలాగే జిల్లాలో గతంలో నిర్మించి కేటాయించని డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను అర్హులైన లబ్ధిదారులకు కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ భూములను ఆక్రమణల నుంచి కాపాడాలని, తాగునీటి సమస్యలు ఎక్కడా తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ మార్గదర్శకాల మేరకు నీటి నిల్వలను నిర్వహించాలని చెప్పారు. జిల్లాలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల పరిస్థితిని సమగ్రంగా పరిశీలించి అవసరమైన మౌలిక వసతులపై నివేదిక సిద్ధం చేసి జిల్లా కలెక్టర్‌కు అందజేయాలని సూచించారు. విద్యార్థులకు అవసరమైన సదుపాయాల కల్పనకు ప్రభుత్వం తగిన బడ్జెట్ కేటాయించేందుకు సిద్ధంగా ఉందన్నారు. జాతీయ రహదారి–65 పరిధిలో ఉన్న విద్యుత్ స్తంభాల మార్పిడి పనులను వేగవంతం చేయాలని, నిర్మాణ కార్మికుల నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు వారికి అందేలా చూడాలని సూచించారు. జిల్లాలోని ప్రతి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించే దిశగా కార్యాచరణ రూపొందించాలని, అవసరమైన అదనపు బస్సుల కోసం ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులకు సూచించారు. హాస్పిటళ్లు, హోటళ్లు తదితర సంస్థల్లో బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణపై క్రమం తప్పకుండా పర్యవేక్షణ నిర్వహించి కాలుష్య నియంత్రణ చర్యలను పటిష్ఠం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ, ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న సేవలు ప్రత్యక్షంగా చేరడం ముఖ్యమని అన్నారు. తాగునీటి సమస్యలు ఉన్న ప్రాంతాల్లో అవసరమైన బోర్‌వెల్స్ కోసం వెంటనే ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన అన్ని డయాగ్నస్టిక్ పరికరాలు, డ్రగ్స్, అవసరమైన ఇక్విప్‌మెంట్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, డయాలసిస్ సేవలకు అవసరమైన చోట అదనపు పడకల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో నర్సింగ్ కళాశాలను ఈ నెలాఖరులోగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. నర్సింగ్ వృత్తికి ప్రస్తుతం దేశవ్యాప్తంగా, అంతర్జాతీయ స్థాయిలో మంచి డిమాండ్ ఉన్నందున గ్రామీణ ప్రాంతాల యువతులను నర్సింగ్ కోర్సులు అభ్యసించేలా ప్రోత్సహించాలని సూచించారు. ప్రతి 35 కిలోమీటర్ల పరిధిలో ఒక ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. అంబులెన్స్ సేవలను మరింత బలోపేతం చేసేందుకు అవసరమైన డ్రైవర్ల నియామకాల కోసం ప్రతిపాదనలు పంపాలని సూచించారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణ పనులను వేగవంతం చేసి వచ్చే విద్యా సంవత్సరంలోపు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎంపీలు , ఎమ్మెల్సీ, శాసనసభ్యులు పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపీ సురేష్ శేఖర్ రైతు సమస్యలను పార్టీలకతీతంగా పరిష్కరించాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో రైతులకు న్యాయం చేయాలన్నారు. ఎంపీ రఘునందన్ రావు ప్రజలు మోసపోకుండా ఏ సర్వే నంబర్లు ఏ భూమి ఉందో తెలిసేలా వెబ్సైట్లో పెట్టాలన్నారు. ప్రభుత్వ భూముల ఆక్రమణపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమీక్ష సమావేశంలో ఎంపీలు రఘునందన్ రావు, సురేష్ షెట్కర్, ఎమ్మెల్సీ అంజి రెడ్డి, ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మాణిక్‌రావు, సునీతా లక్ష్మారెడ్డి, సంజీవరెడ్డి, సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు కలెక్టర్లు సంగీత, పాండు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## భావితరాల ఆకాంక్షలకు అనుగుణంగానే

# అడుగులు..

మొదటిపేజీ తరువాయి..

సెంటర్ లో నిర్వహించిన 'ఎఫ్ టీసీసీఐ ఎక్స్ లెన్స్ అవార్డ్స్ 2026' ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... ఐటీ, లైఫ్ సైన్సెస్ నుంచి మ్యానుఫ్యాక్చరింగ్, డీప్–టెక్ వరకు తెలంగాణను దేశంలోనే అత్యంత ఆకర్షణీయమైన వృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. పరిశ్రమ 4.0 విప్లవంలో భాగంగా దూసుకొస్తున్న ఆటోమేషన్, డీప్–టెక్ సవాళ్లను ఎదుర్కొనేలా రాష్ట్రంలో కాంప్రహెన్సివ్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. అదే సమయంలో... భవిష్యత్తు తరాలకు మేలు జరిగేలా స్థిరమైన, పర్యావరణహిత పారిశ్రామిక వృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో పారిశ్రామికాభివృద్ధి అనేది కేవలం భూమి, మూలధనంపైనే కాకుండా... మేధో సంపత్తి, నాలెడ్జ్ ఎకానమీ ఆధారంగానే సాధ్యమవుతుందన్నారు. అందుకు... పరిశ్రమల అవసరాలకు,




విద్యాసంస్థల శిక్షణకు మధ్య ఉన్న స్కిల్ గ్యాప్ ను పూడ్చాల్సిన అవసరముందన్నారు. ఆ దిశగానే రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణను స్కిల్ క్యాపిటల్ గా మార్చాలనే సంకల్పంతో 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ'కి శ్రీకారం చుట్టిందన్నారు. రాష్ట్రానికి కొత్త పెట్టుబడులను తీసుకొచ్చి... ఇక్కడి యువతకు ఉపాధి అవకాశాలను కల్పించాలనే లక్ష్యంతోనే ముందుకెళ్తున్నామన్నారు. పారిశ్రామికాభివృద్ధిని కేవలం హైదరాబాద్ కే పరిమితం చేయకుండా... రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు విస్తరిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని ఎంఎస్ఎంఈలను మరింత ప్రోత్సహించేందుకు దేశంలోనే తొలిసారిగా ప్రత్యేక 'ఎంఎస్ఎంఈ పాలసీ'ని తీసుకొచ్చామన్నారు. పారిశ్రామికవేత్తలకు 2017 నుంచి చెల్లించాల్సిన పెండింగ్ సబ్సిడీలను దశలవారీగా చెల్లిస్తున్నామన్నారు. అన్ని వర్గాల అభిప్రాయాలను పరిగణలోనికి తీసుకునే కనీస వేతనాలను నిర్ణయించామన్నారు. పారిశ్రామికవేత్తలను మేం కేవలం పెట్టుబడిదారులుగా మాత్రమే చూడటం లేదని... రాష్ట్ర ప్రగతిలో కీలక భాగస్వాములుగా భావిస్తున్నామన్నారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి పారిశ్రామికవేత్తలిచ్చే సలహాలు, సూచనలను స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. సరికొత్త ఆవిష్కరణలతో ముందుకొచ్చే పారిశ్రామికవేత్తలు, ఆవిష్కర్తలకు అన్ని రకాలుగా అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో ఎఫ్ టీసీసీఐ ప్రతినిధులు రవి కుమార్, కేకే మహేశ్వరీ, శ్రీనివాస్ గరిమెళ్లా, భాస్కర్ రెడ్డి, అనిల్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగోను వణికిస్తున్న ఎబోలా

## ఇప్పటికే 101 మంది మృత్యువాత

న్యూఢిల్లీ,జూన్9(ప్రజాజ్యోతి): మధ్య ఆఫ్రికా దేశం కాంగోలో ఎబోలా వైరస్ విజృంభిస్తోంది. ఈ వైరస్ కారణంగా ఇక్కడ ఇప్పటివరకు 100 మందికి పైగా ప్రాణాలు కోల్పోవడం ఆందోళనను రేకెత్తిస్తోంది. ఈ మేరకు కాంగో ఆరోగ్య అధికారులు ఓ ప్రకటనను విడుదల చేశారు. ఆ ప్రకటన ప్రకారం.. కాంగోలో ఇప్పటివరకు 550కి పైగా ఎబోలా కేసులు నిర్ధరణ అయ్యాయి. వారిలో 101 మంది ప్రాణాలు కోల్పోగా.. 19 మంది కోలుకున్నారు. మరో 309 మంది ఎబోలా అనుమానితులు ఐసోలేషన్‌లో ఉన్నారు. ఆదివారం ఒక్కరోజే ఇటురి, నార్త్ కివులలో 35 కొత్త కేసులు నమోదవగా, మరో 10 మంది మృత్యువాత పడ్డారు. ప్రస్తుతం వైరస్ తీవ్రత పెరుగుతోందని, కొన్నిరోజుల తర్వాత తీవ్రత తగ్గే అవకాశం ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. వ్యాధి నిర్ధరణ.. వైరస్‌కు సరైన టీకా, చికిత్స లేకపోవడం సవాళ్లుగా మారాయని తెలిపారు. కేసుల సంఖ్య ఇంకా ఎక్కువగానే ఉండొచ్చని భావిస్తున్నారు. ఈనేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) హెచ్చరికలు జారీ చేసింది. ప్రాంతీయంగా ఈ వ్యాధి మరింత వ్యాపించే ప్రమాదం ఉందని పేర్కొంది. ఇక, ఉగాండాలో 19 ఎబోలా కేసులు నిర్ధరణ అయ్యాయి. కాగా.. రెండు మరణాలు చోటుచేసుకున్నాయి.

## ధాన్యం కొనుగోళ్లపై కేంద్రం

# తిరకాసు

మొదటిపేజీ తరువాయి..

పంట సాగవుతుందని చెప్పారు. ప్రతిపక్షాలు చెప్పేవన్నీ అబద్ధాలేనని పేర్కొన్నారు. పౌర సరఫరాల శాఖ కార్యాలయం నుంచి నేరుగా ఆన్‌లైన్‌లో రైతులు, మహిళా సంఘాల అకౌంట్‌లో నగదు వేస్తున్నామని చెప్పారు. మహిళ సంఘాలకు కేంద్ర ప్రభుత్వం నిధుల నుంచి రూ.170 కోట్లు చెల్లించామని వివరించారు. 8 లక్షల మెట్రిక్ టన్నుల మొక్క జొన్న కూడా కొనుగోలు చేశామని తెలిపారు. క్వింటాకు రూ.1000 నష్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించిందన్నారు. దేశంలో ఏ రాష్ట్రం కూడా ఇంత బాధ్యతగా కొనుగోలు చేయలేదని చెప్పారు. భవిషత్తులో పాడి ప్రోక్యూర్‌మెంట్‌లో ఏ విధంగా పోవాలని దేశంలో వివిధ రాష్ట్రాల్లో ప్రత్యేక బృందాలు పర్యటిస్తున్నాయని వివరించారు. రాష్ట్రంలో హమాలీల సమస్య అధికంగా ఉందన్నారు. తెలంగాణలో ప్రస్తుతం ఉన్న స్టోరేజ్ సరిపోవడం లేదన్నారు. బుధవారం మేడిగడ్డలో మూడు బ్యారేజీల టెస్టింగ్ ప్రక్రియపై సమీక్ష చేస్తామని చెప్పారు. ఈ మూడు బ్యారేజిల్లో నీళ్ల నింపొద్దని ఇప్పటికే నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఎన్‌డీఎస్ఏ చెప్పిందని గుర్తు చేశారు. మేడిగడ్డలో నీళ్లు నింపితే కొట్టకుపోతాయని ఎన్‌డీఎస్ఏ స్పష్టం చేసిందన్నారు. దేశంలోనే రికార్డ్ స్థాయిలో తెలంగాణలో ధాన్యం కొనుగోళ్లు చేశామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా తెంగాణలో ఎక్కువ ధాన్యం ఉత్పత్తి అయ్యిందని.. యాసంగిలో రికార్డ్ స్థాయిలో ధాన్యం కొన్నామని చెప్పారు. రబీ, ఖరీఫ్ సీజన్ కలిపి 147 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని.. ఇన్ని టన్నుల ధాన్యం సేకరణ దేశంలోనే రికార్డ్ అని తెలిపారు. వడ్ల కొనుగోళ్లకు సంబంధించి





రూ.35,077 కోట్లు రైతుల ఖాతాలో వేశామన్నారు. 8,575 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని.. రైతులకు ఇబ్బంది లేకుండా స్థానికంగా ధాన్యం కొనుగోలు చేశామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం 52 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ టార్గెట్ పెట్టిందని.. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 75 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించిందని తెలిపారు. తెలంగాణ పొరుగు రాష్ట్రం ఏపీలో 25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు మాత్రమే జరిగిందని పేర్కొన్నారు. దేశంలో ఉత్పత్తి అయ్యే వరిలో 61 శాతం తెలంగాణలోనే అవుతుందని తెలిపారు. ధాన్యం కొనుగోలు ద్వారా మహిళా సంఘాలు, పీఏసీలను బలపరుస్తున్నామన్నారు. మహిళా సంఘాల ద్వారా 53 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేయించామని.. రూ.171 కోట్లు మహిళా సంఘాలకు ఇచ్చామన్నారు. పీఏసీల ద్వారా 90 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామని తెలిపారు. బీజేపీ, బీఆర్ఎస్ ధాన్యం కొనుగోలుపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. గన్నీ బ్యాగులు అందుబాటులో లేవని దుష్ప్రచారం చేస్తున్నాయని ఫైర్ అయ్యారు. ధాన్యం కొనుగోళ్లపై ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని బద్నాం చేస్తున్నాయని మండిపడ్డారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తీరుపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కిషన్‌రెడ్డి బాధ్యతారహితంగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. దేశంలో ఏ బీజేపీ పాలిత రాష్ట్రంలోనూ.. తెలంగాణలో సేకరించినంతా ధాన్యం సేకరించలేదని తెలిపారు. అలాంటి బీజేపీ నేతలు ఇక్కడ యాత్రలు చేయడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ప్రతిపక్షాలు చెప్పేవి అన్ని అబద్ధాలేనని మండిపడ్డారు. ధాన్యం విషయంపై కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషిని పదిసార్లు కలిశామని తెలిపారు. మొత్తం ధాన్యం కొనుగోలు చేయాలని కోరామని.. కానీ కేంద్రం ఎందుకు కొనుగోలు చేయట్లేదని ప్రశ్నించారు. రైతులపై బీజేపీ వైఖరి స్పష్టం అవుతోందని పేర్కొన్నారు. దేశంలో ఏ రాష్ట్రం కూడా బాధ్యతగా ధాన్యం కొనుగోలు చేయలేదని మంత్రి ఉత్తమ్ చెప్పుకొచ్చారు. భవిషత్తులో పాడి ప్రోక్యూర్‌మెంట్‌లో ఏ విధంగా పోవాలనే అంశంపై.. దేశంలో వివిధ రాష్ట్రాల్లో ప్రత్యేక బృందాలు పర్యటిస్తున్నాయని అన్నారు. రాష్ట్రంలో హమాలీల సమస్య ఎక్కువగా ఉందని ప్రస్తావించారు. మోస్ట్ అడ్వాన్స్ మోడరైజేషన్ సిస్టం తేవాలని తాము నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. తెలంగాణలో ఇప్పుడు ఉన్న స్టోరేజ్ సరిపోవట్లేదని తెలిపారు.

Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967